ఆంధ్రభూమి

సంపుటి: 30 · సంచిక: 227 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 17 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు,
పుష్యమాసం, శుక్లపక్షం
తిథి: శుద్ధ ఏకాదశి సా.6.27
నక్షత్రం: కృత్తిక ఉ.9.59
వర్జ్యం: రా.1.41 నుండి 3.15 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు,
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30నుండి 3.00 వరకు
విశేషాలు: సర్వేషాం ఏకాదశి,
గురువారైకాదశివ్రతం

సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా
మహేశ్వరి, ఖన్నా

- ఆమోద ముద్ర వేసిన రాష్ట్రపతి కోవింద్
- కొలీజియం నిర్ణయాన్ని తప్పుబట్టిన సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ కౌల్
- విస్మయం వ్యక్తం చేసిన సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లోధా

న్యూఢిల్లీ, జనవరి 16: కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది. వీరికి ఈ మేరకు పదోన్నతి కల్పిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్రం ప్రకటించింది. ఐదుగురు సభ్యులున్న కొలీజియం ఈ నెల 11వ తేదీన సమావేశమై పై నియామకాలను ఖరారు చేసింది. ఈ సిఫార్సులను రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆమోదించారు. గత నెల 12వ తేదీన కొలీజియం సమావేశమై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మీనన్, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ సిఫార్సు చేసింది. కాగా ఈ నిర్ణయాన్ని కొలీజియం ఈ నెల 10వ తేదీన వెనక్కుతీసుకుంది. వారి స్థానంలో జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఖన్నా పేర్లను కొలీజియం సిఫార్సు చేసింది. ఈ ఇద్దరు న్యాయమూర్తుల జాతీయ స్థాయిలో ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని - మిగతా 6వ పేజీలో

జగన్‌పై దాడి కేసు
దర్యాప్తు వేగవంతం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్న కేసులో దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వేగవంతం చేస్తోంది. గత ఐదు రోజులుగా ఈ కేసులో నిందితుడు శ్రీనివాస్‌ను ఎన్ఐఏ అధికారులు అన్ని కొణాల్లో విచారిస్తున్నారు. జగన్‌పై జరిగిన హత్యాయత్న కేసుతో పాటు దాడి సంఘటనలో ఎవరైనా కుట్రదారులు ఉన్నారా అన్న అంశాలపై ఎన్ఐఏ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ జనరల్ అలోక్ మిట్టల్ పర్యవేక్షణలో కేసు విచారణ జరుగుతోంది. నిందితుడు శ్రీనివాసువుపై 2019 జనవరి 12న ఎన్ఐఏ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. శ్రీనిసరావు విమానాశ్రంలోకి కత్తితో ఎలా వెళ్ళాడు? జగన్ వద్దకు ఎలా - మిగతా 6వ పేజీలో

ఘనగామా



ఆ పేరు పెట్టారంటే..
దానికి మెదడు కూడా లేకుండా ఉండాలి!!


హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌తో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు మంతనాలు

కేసీఆర్ ఫ్రంట్‌లోకి
వైకాపా

వైఎస్ జగన్‌తో కేటీఆర్ మంతనాలు..

- ఫోన్‌లో మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి
- కేసీఆర్ వేదికను స్వాగతిస్తున్నా: జగన్
- ఏపీకి ప్రత్యేక హోదా రావాల్సిందే: కేటీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: టీఆర్ఎస్ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఫెడరల్ ఫ్రంట్‌లోకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేరేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్న కేసీఆర్ ఇటీవల వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, పార్టీల అధ్యక్షులను కలిసి చర్చించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే బుధవారం అనూహ్యంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు లోటస్ పాండ్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి మంతనాలు జరిపారు. మంగళవారం ముఖ్యమంత్రి - మిగతా 6వ పేజీలో

అది ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్

- ఆంధ్రుల్ని అవమానించిన వారితో జట్టా?
- బయటపడిన ముగ్గురు మోదీల చీకటి ఒప్పందం
- ట్విట్టర్‌లో మంత్రి నారా లోకేశ్ ధ్వజం



విజయవాడ (సిటీ), జనవరి 16: ఆంధ్రులను అడుగడుగునా అవమానపరుస్తూ, ఏపీ హక్కులను కాలరాస్తున్న కేసీఆర్‌తో వైఎస్ జగన్ జత కట్టడం దారుణమని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఆక్షేపించారు. కేసీఆర్‌తో కలిసి జగన్ ఏర్పాటు చేస్తున్నది 'ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్' అని బుధవారం ట్విట్టర్ వేదికగా విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా విభజన చట్టం ప్రకారం అనేక అంశాల్లో ఏపీకి రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుపడుతున్న కేసీఆర్‌తో కలిసి జగన్ ఆంధ్రా దోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. లంకలో పుట్టినవాళ్లంతా రాక్షసులు.. ఆంధ్రలో పుట్టినవాళ్లంతా వారి వారసులని ఆంధ్రులను కేసీఆర్ అవమానించడం రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. ఆంధ్రా బిర్యానీ పేడలా ఉంటుందని అవహేళన చేసిన వ్యక్తితో జతకడతారా అని ప్రశ్నించారు. ఢిల్లీ మోదీ, ఆంధ్రా మోదీ, తెలంగాణ మోదీ ఒక్కటయ్యారని ఆరోపించారు. ఇంతకాలం వీరి మధ్య కొనసాగుతున్న చీకటి ఒప్పందం ఇప్పుడు బహిర్గతమైందని ట్విట్టర్‌లో లోకేష్ ధ్వజమెత్తారు.


కనుమ పండుగను పురస్కరించుకొని చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లి, వెదురుకుప్పం మండలం మాంబేడు, గోపాలపురం గ్రామాల్లో పశువుల పండుగ బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. కోడె గిత్తలను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహం ప్రదర్శించారు. - వార్త 2లో

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

- ముఖ్యమంత్రిని కలవనున్న సీమ న్యాయవాదులు

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 16: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సంబంధించి సాంకేతికపరమైన అంశాలను పూర్తిచేసి ఎన్నికలలోపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాయలసీమకు చెందిన నాలుగు జిల్లాల సీనియర్ న్యాయవాదులు కోరుతున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించాలని నిర్ణయించారు. కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన సీనియర్ న్యాయవాదులు సీఎంను కలిసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకరించినందున తదుపరి కార్యాచరణను వేగవంతంచేయాలని వారు కోరుతున్నారు. విభజన చట్టం ప్రకారం ప్రభుత్వం ఆమోదిస్తే బెంచ్ ఏర్పాటుకు హైకోర్టు అనుమతిస్తుంది. ముందుగా మంత్రివర్గ ఆమోదం ఆ తరువాత శాసనసభలో తీర్మానంచేసి రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్మానం కాపీలను పంపాల్సి ఉంటుంది. శాసనసభ తీర్మానాన్ని పరిశీలించి గవర్నర్ ఆమోదిస్తే తదుపరి చర్యలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తీసుకుంటారని న్యాయవాదులు వెల్లడిస్తున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ - మిగతా 6వ పేజీలో

సకల సదుపాయాలతో
పేదలకు ఇళ్లు



- గేటెడ్ కమ్యూనిటీ తరహాలో సౌకర్యాలు
- 5.29 లక్షల గృహాలు.. ఇంధన సామర్థ్య నిలయాలు
- 'ఎన్టీఆర్ నగర్స్' పథకం వినూత్నం.. విప్లవాత్మకం
- ఇంధన శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: పేదల కోసం నిర్మిస్తున్న ఎన్టీఆర్ నగర్లలోని ఇళ్లు ఇంధన సామర్థ్య నిలయాలుగా మారాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారు. ఇవి ధనికుల ఇళ్లతో సమానంగా ఉండేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పురపాలక, ఇంధన శాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ నగర్‌లలో నిర్మించే ఇళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్స్ పథకం దేశంలోనే వినూత్న, విప్లవాత్మకమైనదన్నారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీ తరహాలో సమస్త సదుపాయాలు కల్పించాలని, ఇందుకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఏపీ టిడ్కో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో ఇంధన సామర్థ్య పథకాలను అమలు చేయాలన్నారు. ఇంధన సామర్థ్య స్టార్ రేటెడ్ గృహోపకరాణాలు ఈ ఇళ్లలో అమర్చేందుకు సరఫరా చేయనున్నామన్నారు. 9వాట్ల ఎల్ఈడీ బల్బులు, 20వాట్ల ట్యూబ్‌లైట్లు, 50వాట్ల ఫ్యాన్లు, వీధుల్లో ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 30కోట్ల రూపాయల అంచనాతో ఈ గృహోపకరణాలు అందచేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి చర్యల వల్ల పేదలకు విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. ప్రస్తుతం 75వేల ఇళ్లకు ఏపీ ఇంధన సామర్థ్య అభివృద్ధి సంస్థ ద్వారా స్టార్ రేటెడ్ పరికరాలను అందచేయనున్నామన్నారు. ఈ చర్యల వల్ల ఏటా 54 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని, 32కోట్ల రూపాయల వరకూ పొదుపు చేయవచ్చన్నారు. దీన్ని దశలవారీగా 5లక్షల యూనిట్లకు విస్తరించే యోచన ఉందని తెలిపారు. పేదల కోసం నిర్మిస్తున్న ఈ ఇళ్లలో అన్ని సౌకర్యాల ఉండాలన్నారు. సకల సదుపాయాలతో సొంత ఇంటిని సమకూర్చుకోవాలన్నది ప్రజల కల మాత్రమే కాదని, వారి సెంటిమెంట్ కూడా అని తెలిపారు. ఇలాంటి ఇళ్లలో నివసిస్తున్నందుకు గర్వపడేలా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఎన్టీఆర్ నగర్లలో విద్యుత్, రహదారులు, మురుగు కాల్వలు, నీటి సరఫరా, పాఠశాలలు, పచ్చదనం, తదితర సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. నీటి సంరక్షణపై కూడా దృష్టి పెట్టాలన్నారు. పట్టణాలు, పల్లెల్లో ఉన్న - మిగతా 6వ పేజీలో


పందెంలో తలపడుతున్న కోడి పుంజులు

జూదాల గోదాబరి!

తూ.గో., ప.గో. జిల్లాల్లో గ్రామగ్రామాన కోడి పందాలు

- క్లబ్బుల తరహాలో పేకాటలు, ఇతర జూదాలు
- జాతీయ రహదారి పక్కనే రాత్రీ పగలు నిర్వహణ
- చేతులు మారిన వందల కోట్లు
- మేము సైతం అంటూ పాల్గొన్న మహిళలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 16: సంక్రాంతి సంప్రదాయం ముసుగులో మరోసారి గోదావరి జిల్లాలు మూడు రోజులు జూదాల గోదా'బరి'గా మారిపోయాయి. వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి. రాజధాని స్థాయి నుండి వచ్చిన అనధికార ఆదేశాలతో ఎక్కడి పోలీసులు అక్కడే గప్‌చిప్‌గా ఉండిపోవడంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోడి పందేలు, పేకాటలు, గుండాటల జాతర కొనసాగింది. సోమ, మంగళ, బుధ వారాలు రెండు జిల్లాల్లోని గ్రామాలన్నీ జూదాల పూనకంతో ఊగిపోయాయి. జాతీయ రహదారుల పక్కనే భారీగా టెంట్లు వేసి పందేలు, జూదాలు నిర్వహించారు. ఎన్నికల సీజను కావడంతో నేతల నుండి వచ్చిన భరోసాతో దాదాపు జూదాలు జరగని గ్రామం లేదంటే అతిశయోక్తికాదు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు సమీపంలోని డి.ముప్పవరం అనే ఒక చిన్న గ్రామంలో ఒకే రోడ్డులో 200 మీటర్ల పరిధిలో నాలుగు చోట్ల కోడిపందేలు, జూదాల బరులు నిర్వహించారంటే ఈసారి జరిగిన తీవ్రత ఊహించవచ్చు. ఇదే జిల్లాలో పాలకొల్లు పట్టణంలోని దేశాలమ్మ ఆలయం సమీపంలో మెయిన్ రోడ్డుపక్కనే గుండాట నిర్వహించారంటే నిర్వాహకులు ఎంత బరితెగించారో ఊహించవచ్చు. రెండు జిల్లాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా కత్తులతో జరిగిన కోడి పందేలలో వేలాది కోళ్లు రక్తమోడుతూ నేలకొరిగిపోయాయి. పందేలరాయుళ్లయితే కోట్లాది రూపాయలను కోల్పోయారు. భారీ పందేలు నిర్వహించిన ప్రాంతాల్లో స్టేడియం తరహాలో వీక్షకుల కోసం గ్యాలరీలు నిర్మించడం విశేషం. ఇక మేము సైతం అంటూ మహిళలు సైతం పెద్ద సంఖ్యలోనే కోడి పందేలకు హాజరయ్యారు. కాగా ఈసారి కోడి పందేల బరుల వద్ద బౌన్సర్లను నియమించడం మరో విశేషం. పోటీలు తిలకిస్తున్న వారికి అల్పాహారాలు, శీతల పానీయాలు అందించేలా ఏర్పాట్లుచేశారు.

ఇక సినీఫక్కీలో క్లబ్బుల తరహాలో బహిరంగంగా నిర్వహించిన పేకాటల్లో జూదరులు భారీగా నష్టపోయారు. పాలకొల్లు సమీపంలోని పూలపల్లి గ్రామంలో సినీ తరహాలో టెంట్లు వేసి, రాత్రి పగలు పేకాటలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారికి స్నాక్స్, శీతల పానీయాలు, సాయంత్రం సమయంలో మద్యం టేబుల్ వద్దకే అందించే ఏర్పాట్లు - మిగతా 6వ పేజీలో


పందెం పుంజుతో టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని, పక్కన వైసీపీ నేతలు



రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ సమీపంలో గోదావరిలో తెట్టులా పేరుకుపోయిన చెత్త (ఫైల్ ఫొటో)

కాలుష్య చింత.. ఆక్రమణల వ్యథ..!

★ కుంగి, కృశిస్తున్న గోదావరి

★ నది పొడవునా పేరుకుపోతున్న కాలుష్యం ★ కానరాని స్నాన ఘట్టాలు

★ పనిచేయని నదీ జలాల శుద్ధి పథకం ★ ఆక్రమణలకు గురవుతున్న తీరం



రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్ సమీపంలో భవన శకలాలతో గోదావరిని పూడ్చేస్తున్న దృశ్యం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 16: ఒకవైపు కాలుష్యం బారిన పడి విలవిల్లాడుతున్న గోదావరి నది మరోవైపు ఆక్రమణల కోరల్లో చిక్కిశల్యమవుతోంది. గర్భంలో ఆక్రమణలు రివర్ కన్జర్వేషన్ యాక్టుకు విరుద్ధంగా గోదావరి చెంతనే శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నా జలవనరుల శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. పావన నదిగా భావించే గోదావరి నది విచక్షణారహితమైన కాలుష్యానికి గురవుతోంది. మరోవైపు అఖండ గోదావరి నది దిగువన ఇటు కోనసీమ, అటు పశ్చిమ గోదావరి, మరో వైపు ఈస్ట్రన్ డెల్టా వైపు పరీవాహ ప్రాంతాల కాల్వలు కంపోస్టు యార్డులుగా మారుతున్నాయి. ప్రధానంగా అఖండ గోదావరి నది రాజమహేంద్రవరం సమీపంలో తీవ్ర కాలుష్యానికి గురవుతోంది. మరో వైపు పర్యాటకం మాటున అఖండ గోదావరి నది ఎగువ ప్రాంతంలో కాలుష్యమవుతోంది. లాంచీల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. నది చెంతన గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు వరదల సమయంలో గోదావరి నదిలో కలిసి కాలుష్యం తెట్టుకడుతోంది.

రాజమహేంద్రవరం నగరంలోని డ్రెయిన్ల కాలుష్యంతో పరీవాహమంతా సుమారు 16 కిలోమీటర్ల మేర కాలుష్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఇటు మార్కండేయ ఘాట్ నుంచి అటు కోటిలింగాల ఘాట్ వరకు మురుగు నీటి తెట్టు ఆవరించింది. స్థానిక కోటిలింగాల ఘాట్ కిలో మీటర్ పొడవునా కాలుష్యం నీటితో ఒడ్డంతా నిండిపోయింది. ఈ ప్రాంతమంతా నిత్యం మురికికూపంగా మారింది. స్థానిక నగరపాలక సంస్థ కనీస స్థాయిలో స్నానఘట్టాలను పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. చెత్తా చెదారాన్ని నదీమయం చేస్తున్నా, కఠినమైన మురుగునీరు కలుస్తున్నా నివారించే చర్యలు మృగ్యంగా వున్నాయి. నది పవిత్రను కాపాడ్డంలో గానీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో గానీ, కాలుష్యం బారిన పడకుండా చూడ్డంలో గానీ నగరపాలక సంస్థ పాత్ర శూన్యంగానే వుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగునీరు నదిలో కలవకుండా రూ.కోట్ల నిధులతో చేపట్టిన నదీ జలాల శుద్ధి పథకం పూర్తి స్థాయిలో అక్కరకు రాలేదు. షరా మామూలుగానే మురుగునీరు నదిలో కలుస్తోంది. గతంలో నిర్మించిన నదీ జలాల శుద్ధి ప్లాంట్ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రాలేదు గానీ మరో ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ప్రధానంగా పేపర్‌మిల్లు నుంచి విడుదలయ్యే కాలుష్యం నుంచి కూడా నది కాలుష్యానికి గురవుతున్నట్టు తెలుస్తోంది.

ఇదిలావుండగా మరో వైపు నదీ తీరం ఆక్రమణలకు గురవుతోంది. వెంకటనగరం సమీపం నుంచి ధవళేశ్వరం వరకు ఆక్రమణలు పెరిగిపోయాయి. కొత్త, పాత వెంకటనగరం పంపింగ్ స్కీములకు సమీపంలోనూ, చాగల్నాడు ఎత్తిపోతల పథకం ఇన్‌టేక్ వెల్ సమీపంలోనూ, విశాఖ పారిశ్రామిక అవసరాలకు నీటిని తీసుకెళ్ళే విస్కో పైపులైన్ ఇన్‌టేక్ వెల్ సమీపంలోనూ గోదావరి ఒడ్డు ఆక్రమణలకు గురయ్యింది. ఈ ప్రాంతంలో నదీ గర్భాన్ని అనధికారికంగా సాగు చేస్తున్నారు.

ఇక రాజమహేంద్రవరం సమీపంలో భవనాల శిథిలాలతో గట్టును పూడ్చుతూ నదీ గర్భాన్ని ఆక్రమించి ఇసుక ర్యాంపుల బాటలు వేస్తున్నారు. రివర్ కన్జర్వేషన్ చట్టం ప్రకారం నదీ గర్భంలో ఎటువంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా జలవనరుల శాఖ చర్యలు చేపట్టాల్సివుంది. కుడి, ఎడమ వైపు అఖండ గోదావరి నదీ గర్భంలో శాశ్వత కట్టడాలు పెరిగిపోతున్నాయి. పర్యాటక ప్రాజెక్టుల పేరుతో కూడా పర్యవేక్షణ లేకపోవడం వల్ల శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. మరో వైపు లంక భూములను కూడా అనధికారికంగా ఆక్రమిస్తున్నారు.

కొంతమంది జల వనరుల శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నదీగర్భాన్ని అప్పగించినట్టు ఆరోపణలు వున్నాయి. గోశాలలను అడ్డుపెట్టుకుని రాజకీయ అండదండలతో వున్న కొంత మంది నదీ గర్భాన్ని ఆక్రమించినట్టు తెలిసింది. ఏదేమైనప్పటికీ నదీ కాలుష్యం కాకుండా, నదీ గర్భం ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత శాఖలు సమీక్షించుకుని పర్యవేక్షించాల్సివుంది.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన జగన్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉమా

★ ఆంధ్రాకు ద్రోహం చేస్తున్న కేసీఆర్‌తో కుమ్మక్కు

★ వచ్చే ఎన్నికల్లో ఇద్దరికీ గుణపాఠం తప్పదు

★ మంత్రి దేవినేని ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కై వైఎస్ జగన్ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. నగరంలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చే పైసలు, కాంట్రాక్ట్‌లకు కక్కుర్తి పడి జగన్ దిగజారిపోయాడని ధ్వజమెత్తారు. ఏపీ ప్రజలపై, ఆంధ్రా సంస్కృతిపై, తెలుగుతల్లిపై కేసీఆర్ చేసిన దూషణలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. హైదరాబాద్‌లో ఏపీ వాళ్లు ఎప్పటికీ కిరాయిదారులేనని కేసీఆర్ అనలేదా? అని ప్రశ్నించారు. ఏపీ బ్రాహ్మణులకు మంత్రాలు రావని, లంకలో పుట్టిన వారు రాక్షసులని దూషించలేదా అని నిలదీశారు. తెలుగుతల్లి అంటే దెయ్యమని దూషించారని, ఏపీ ప్రజలను తిట్టిన కేసీఆర్‌తో కలవడానికి జగన్‌కు సిగ్గుండాలని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై కక్షతో కేసీఆర్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్‌ను అడ్డుపెట్టుకుని ఏపీపై పెత్తనం చేయాలని కేసీఆర్ కుట్ర పన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 5200 కోట్లు విద్యుత్ బకాయిలు చెల్లించకుండా మీ దిక్కున్నచోట్ల చెప్పుకోమని కేసీఆర్ అంటున్నారన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు దూసుకుపోతున్నారని, 54లక్షల మందికి పెన్షన్లు పెంచడంతో ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి 72గంటల నుంచి జగన్‌కు నిద్రపట్టక ఆంధ్రప్రదేశ్‌పై కుట్ర రాజకీయాలకు తెరలేపారన్నారు. జగన్‌కు అధికార దాహం, డబ్బుపిచ్చి పట్టిందన్నారు. జగన్‌కు, కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని మంత్రి దేవినేని ఉమా హెచ్చరించారు.

కోలాహలంగా పశువుల పండుగ

రామచంద్రాపురం, జనవరి 16: కనుమ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లిలో, వెదురుకుప్పం మండలంలో మాంబేడు, గోపాలపురం గ్రామాల్లో పశువుల పండుగ అంగరంగ వైభవంగా సాగింది. కోడెగిత్తలను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహం ప్రదర్శించారు. ఇనుమడించిన ఉత్సాహంతో యువత కేరింతలు కొడుతూ గిత్తలను పట్టుకుని విజయోత్సాన్ని ప్రదర్శించారు. గ్రామంలో గిత్తలను అందంగా అలంకరించి , వాటి కొమ్ములకు నూతన వస్త్రాలతో పాటు పలకలను కట్టి వాటికి వెదురుదబ్బలతో బెలూన్లు అలంకరించారు. పశువుల పందేలను చూడటానికి చుట్టుపక్కల మండలాల నుంచి వందలాది మంది గ్రామానికి చేరుకున్నారు. భవనాలపైకి ఎక్కి పశువుల పందేలను చూడటానికి పెద్ద ఎత్తున గుమికూడారు. ఒక్కొక్క దొడ్డి నుంచి పశువులను వదులుతూ డప్పుల చప్పుళ్లతో బెదిరించారు. పశువులు వేగంగా పరిగెడుతూ యువకుల మధ్యనుంచి దూరుతూ తప్పించుకొని వెళ్లాయి. పశువులను నిలువరించే ప్రయత్నంలో యువకులు కింద పడి చిన్నచిన్న గాయాలపాలయ్యారు. కొన్ని పశువులను ఒడిసి పట్టుకొని వాటికి కట్టిన పలకలను లాగి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి

బంగారుపాళ్యం, జనవరి 16: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని కీరమంద పంచాయతీ పరిధిలోని పూలవానివంక సమీపాన మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి జరిపి బీభత్సం సృష్టించింది. ఈసంఘటనలో తాము పండించిన రాగి, వరి, అరటి, టమోటా, మామిడి చెట్లను ధ్వంసం చేశాయని బాధిత రైతులు తెలిపారు. గ్రామంలో అనేక మార్లు ఏనుగులు దాడులు జరిపాయి. ఈ దాడులు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. అనంతరం ఫారెస్ట్ అధికారి మధుసూదన్‌రెడ్డి వచ్చి పంట పొలాలను సందర్శించారు. పంట నష్టం అంచనా వేశారు. కందకం తవ్వి ఏనుగుల భారీ నుంచి పంట పొలాలను రక్షించాలని గ్రామస్తులు ఫారెస్ట్ అధికారి దృష్టికి తీసుకువచ్చారు.

ఫెడరల్ ఫ్రంట్‌కు మోదీ డైరెక్షన్

★ కేసీఆర్ కనుసన్నల్లో జగన్ ★ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: ప్రధాని మోదీ డైరెక్షన్‌లోనే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, దీంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. నగరంలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర పార్టీలన్నీ మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. మోదీ పేరు చెబితే తెలుగు రాష్ట్రాల ప్రజలు ఓట్లు వేసే పరిస్థితుల్లేవని స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ పూర్తిగా విఫలమవ్వడంతో ఇప్పుడు ప్రమాదకరమైన రాజకీయాలకు తెరతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ కనుసన్నల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరిట దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారని, అటు కేసీఆర్ కనుసన్నల్లోనే వైసీపీ అధినేత జగన్ నడుస్తున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్, జగన్ లోపాయికారీగా మోదీ జపం చేస్తున్నారని, ఆంధ్రా, తెలంగాణ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేసీఆర్ దూతగా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆంధ్రాకు వచ్చి జగన్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ జగన్‌కు సేవలు చేస్తామనేలా తలసాని వ్యాఖ్యలున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు పోవాలని, జగన్ కోసం బీసీలు, యాదవులంతా పనిచేయాలంటూ తలసాని చెప్పడం సరికాదని రామకృష్ణ హితవు పలికారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

జడలు విప్పిన సంక్రాంతి జూదం!

★ పంతం నెగ్గించుకున్న పందెంరాయుళ్లు ★ హద్దులు దాటిన వినోద క్రీడలు

★ చేతులు మారిన వందల కోట్లు ★ చేతులెత్తేసిన పోలీసులు ★ కోనసీమను తలదన్నే రీతిలో ఏర్పాట్లు

విజయవాడ (సిటీ)/ కంకిపాడు, జనవరి 16: తెలుగువారి సంప్రదాయ సంక్రాంతి సంబరాల్లో జూద క్రీడలు జడలు విప్పాయి. కోడి పందాలు, పొట్టేళ్ల పందాలు, కోసాట, చిత్తూ-బొమ్మా, గుండాట.. ఇలా వినోదం పేరిట జూదాలు హద్దులు దాటాయి. కోడి పందాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతిచ్చే ప్రసక్తే లేదని ముందస్తు హెచ్చరికలు చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు చివరిక్షణంలో చేతులెత్తేయడంతో పందెంరాయుళ్లు తమ పంతం నెగ్గించుకున్నారు. చిన్నా, పెద్దా.. ముసలీ, ముతకా అనే తేడాలేకుండా పాల్గొన్న పందాల్లో తామేమీ తక్కువ కాదంటూ మహిళలూ హాజరయ్యారు. ఆతిథ్యంలో కోనసీమను తలపించేలా నిర్వాహకులు సకల ఏర్పాట్లు బరుల వద్దే చేయడంతో ఈ ఏడాది రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశవిదేశాల నుండి పెద్దసంఖ్యలో ప్రజానీకం పాల్గొన్నారు. మూడురోజులు కృష్ణా జిల్లాలోని ముఖ్యమైన మండల కేంద్రాల్లో సంక్రాంతి సంబరాల పేరిట రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల ఆధ్వర్యంలోనే వివిధ పోటీలు నిర్వహించారు. ఈడుపుగల్లు ప్రాంతంలో సుమారు 60ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బరులు రాష్ట్రంలోనే పెద్దవిగా నిలిచాయి. కోర్టులు ఎన్ని ఆంక్షలు విధించినా, పోలీసు అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా వాటన్నిటినీ భోగి మంటల్లో వేసిన పందెంరాయుళ్లు.. కోళ్లకు కత్తులు కట్టి మరీ బరిలోకి దించారు. పందాల కోసం భారీగా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు పేరుకి సంక్రాంతి సంబరాలు అంటూనే వాటిమాటున ఎక్కడా జరగని విధంగా పెద్దఎత్తున జూద క్రీడలు నిర్వహించారు. రాత్రీ పగలు తేడాలేకుండా ఫ్లడ్ లైట్ల వెలుతురులోనూ పోటీలు నిర్వహించారు. ఇందుకోసం భారీగా జనరేటర్లు ఏర్పాటు చేశారు. పందాలు జరిగే ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లేందుకు వీల్లేకుండా కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేశారు. జూదం కోసం వచ్చేవారికి అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించడంతో పాటు ఎలాంటి అంతరాయాలకు తావివ్వకుండా చూసేందుకు సుమారు 200 మంది వరకు ప్రైవేటు సైన్యాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగిన ఈ పోటీలను కొన్ని ప్రాంతాల్లో వారే ప్రారంభించడం, అక్కడే ఉండి సజావుగా జరిగేలా పర్యవేక్షించడం కనిపించింది. గత రెండేళ్లు నోట్ల రద్దు, జీఎస్టీ కొంత ప్రభావం చూపినా, ఈ ఏడాది మాత్రం ఆ ఛాయలు ఎక్కడా కనిపించలేదు. 500, 2వేల రూపాయల నోట్ల చలామణీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎక్కడ, ఎవరి చేతిలో చూసినా పెద్దనోట్లే దర్శనమిచ్చాయి. అయితే కోసాటలో మాత్రం నిర్వాహకులు కాయిన్లు ఏర్పాటు చేసి పందెంరాయుళ్లకు చిల్లర ఇబ్బందుల్లేకుండా చూశారు. ఇక కోడి పందాలు చూసేందుకు మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, దేశవిదేశాల నుండి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. ఈడుపుగల్లు ప్రాంతంలో ఏర్పాటు చేసిన బరికి ఈ మూడురోజులు సుమారు 5లక్షల మంది వరకు వచ్చారని నిర్వాహకులే చెబుతున్నారు. ప్రతిరోజు లక్ష మంది వరకు ఈ ప్రాంతానికి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మహిళలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయవచ్చు. పందాల కోసం వచ్చినవారికి భోజనాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక మద్యం విషయం చెప్పనే అక్కర్లేదు. చీప్‌లిక్కర్ దగ్గర నుండి చలచల్లని బీరు, ఖరీదైన స్కాచ్ వరకు మందుబాబుల కోసం ప్రత్యేక కౌంటర్లు వెలిశాయి. ఇక పందాలు జరిగే ప్రాంతంలోకి వెళ్లాలంటే మాత్రం ప్రత్యేక పాసులు తప్పనిసరి. పందాలు జరిగిన మూడురోజులూ ఏరోజుకారోజు వైవిధ్యంగా పాసులు ముద్రించి పంపిణీ చేశారు. పాస్ లేకుండా బరిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే మాత్రం ప్రైవేటు సైన్యం చేతిలో కొరడా దెబ్బలు తినాల్సిందే! ఇంత జరుగుతున్నా పోలీసులు అటుగా కన్నెత్తి చూసిన పాపానపోలేదు.



ఈడుపుగల్లులో జూద క్రీడ వద్ద జనసందోహం

ఐదేళ్లలో ఆయుష్ వైద్య సేవలు విశ్వవ్యాప్తం

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 16: ప్రజారోగ్య పరిరక్షణలో సిద్ధ వైద్య పరిశోధన ఎంతో ఉపయోగకరం కావాలని కేంద్ర ఆయుష్ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ ఆకాంక్షించారు. బుధవారం తిరుపతి స్విమ్స్ ఆవరణలో సిద్ధ పరిశోధన కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి అద్దం పట్టే సిద్ధ వైద్యం పట్ల పేద ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ సిద్ధ వైద్యాన్ని దేశ వ్యాప్తంగా విస్తరింపజేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇప్పటికే దేశంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక, కేంద్రపాలిత ప్రాంత్రాలైన పాండిచ్చేరి, ఢిల్లీలో ఏడు సిద్ధ వైద్య పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నేడు స్విమ్స్‌లో 8వ సిద్ధ వైద్య పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధునిక వైద్య విధానం, సంస్కృతి సాంప్రదాయాలతో కూడుకున్న వైద్య విభాగం అనుసంధానంగా జరిగే పరిశోధనలు ప్రజారోగ్యాన్ని పరిరక్షించే విధంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయుష్ అంటే ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి అని తెలిపారు. అంటే భారతీయ సంస్కృత, సాంప్రదాయాలకు సంబంధించిన ఆరోగ్య పరిరక్షణతో కూడుకున్న వైద్య విధానమే ఆయుష్ అని చెప్పారు.

ప్రజారోగ్య రక్షణ కోసం ప్రధాని మోదీ ఇందుకు ప్రత్యేక శాఖను కూడా కేటాయించారన్నారు. ఇప్పటికే భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఈ వైద్య విధానాలు ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలో శాశ్వత సభ్యత్వం కలిగిన ఆయుష్ రానున్న ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా తన వైద్య సేవలను విస్తరించనుందని కేంద్ర మంత్రి యశో నాయక్ చెప్పారు. వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు అద్భుతమైన వైద్య విధానాలతో వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారని తెలిపారు. సిద్ధ వైద్యాన్ని నేటి ప్రపంచ ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. స్విమ్స్‌తో కలిసి సిద్ధ వైద్య పరిశోధన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సైతం తన సంపూర్ణ సహకారం అందించి అవసరమైన స్థలం కేటాయించాలని, ప్రాంతీయ పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చెందడానికి సహకరించాలన్నారు. స్విమ్స్, సీసీఆర్‌ఎస్ సంయుక్త పరిశోధనలు మరింత సత్ఫలితాలను సాధించాలని, మానవుల ఆరోగ్య పరిరక్షణలో ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. సీసీఆర్‌ఎస్ డైరెక్టర్ జనరల్ ఆచార్య డాక్టర్ కె.కనకవల్లి మాట్లాడుతూ సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుకు సహకరించిన టీటీడీ ఈఓ, జిల్లా కలెక్టర్, స్విమ్స్ డైరెక్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే ఆయుర్వేదం ద్వారా ప్రజలకు మంచి వైద్యం అందుతోందన్నారు. దీంతోపాటు సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చినట్లేనని చెప్పారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, నరాలకు సంబంధించిన వివిధ వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ఏఎన్‌యూ ఇన్‌చార్జి విసీగా
రామ్‌జీ నియామకంపై వివాదం

★ విధుల్లో చేరవద్దంటూ రాజకీయ ఒత్తిళ్ళు

★ మంత్రి గంటా ఆగ్రహం ★ రాయబారిగా ప్రభుత్వ విప్ రవికుమార్


ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 16: ముఖ్యమంత్రి మైండ్ సెట్‌తో ఉపకులపతిగా విద్యావ్యవస్థలో ప్రభుత్వ పథకాలను గ్రామదర్శిని ద్వారా ప్రజల ముంగిటకు పెట్టే ప్రయత్నం చేసిన అంబేద్కర్ యూనివర్సిటీ విసీ కూన రామ్‌జీ చేసిన సేవలకు, సిన్సియారిటీకి గుర్తింపుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యు) ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా రామ్‌జీని నియమించారు. ఇటీవల జరిగిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియామకాల్లో అత్యంత కీలకంగా నిర్ణయాలు తీసుకుని అవినీతి పోకడలు లేకుండా పూర్తి చేసినందుకు ఏఎన్‌యు ఇన్‌ఛార్జి విసీగా రామ్‌జీని సిఎంవో కార్యాలయం ఎంపిక చేసిందనడంలో అతిశయోక్తిలేదు. కానీ, ఆ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు మాత్రం రామ్‌జీ నియామకం అసంతృప్తి, ఆగ్రహం రెండూ కలిగించాయి. మూడు సార్లు తర్జనభర్జనలతో గవర్నర్, ముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖ మంత్రికి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సమాలోచనలు, రెండు జీవోలు నడుమ చివరకు ఆచార్య కూన రామ్‌జీని ఏఎన్‌యు ఇన్‌ఛార్జి వీసీగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఆయన అక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వైస్‌ఛాన్సలర్ రామ్‌జీ నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నియామకం వెనుక ఆయన ప్రమేయం, ప్రయత్నం లేకపోయినప్పటికీ, రాజకీయ పరిణామాలు ఆచార్యులు రామ్‌జీని ఇరకాటంలో నెట్టేశాయి. పొరుగు జిల్లా మంత్రిగా గంటా శ్రీనివాసరావుతో సత్సంబంధాలు కలిగి, ప్రభుత్వ విప్ కూన రవికుమార్ సోదరుడు, శ్రీకాకుళం జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన ఆచార్యులుగా, మంత్రి కళా వెంకటరావు ఆశీస్సులతో అంబేద్కర్ యూనివర్సిటీ వీసీగా చాలా గట్టిపోటీ, కులాల మంత్రాంగాల నడుమ నియామకమైన రామ్‌జీ తన పాలనాపరమైన అంశాల్లో రాజకీయ ఒత్తిళ్ళకు దూరంగా ఉంచుతూ అంబేద్కర్ యూనివర్సిటీని గతంలో ముద్రపడిన ఉప'కుల'పతుల్లా కాకుండా విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో ఆచార్య నాగార్జున వర్సిటీ ఇన్‌ఛార్జి నియామకం మంత్రి గంటా - వీసీ రామ్‌జీల మధ్య దూరాన్ని పెంచింది. ఇంతకుముందు నాగార్జుయూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసీగా ఇక్కడే వీసీగా కాలపరిమితి ముగించుకున్న ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ ఈ నెల 11వతేదీన ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తి చివరికి సి.ఎం. క్యాంపు కార్యాలయానికి చేరాయి. ఏపీ యూనివర్సిటీ చట్టాన్ని అతిక్రమించారన్న ఫిర్యాదులు కూడా గవర్నర్, ముఖ్యమంత్రికి చేరాయి. అక్కడ రెక్టార్‌నే ఇన్‌ఛార్జి విసీగా నియమించాలంటూ మంత్రి గంటా ప్రతిపాదనను పక్కనపెట్టి రాజేంద్రప్రసాద్‌ను నియమించిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి గంటా రగడ ఆరంభించడంతో రాజేంద్రప్రసాద్ నియామకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత రద్దే చేసింది. రెక్టార్‌ను ఇన్‌ఛార్జి విసీగా నియమించాలన్న గంటా ప్రతిపాదనను సీఎంవో నిర్వర్తిస్తుందన్న ఆలోచనలను తారుమారు చేస్తూ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ కూన రామ్‌జీని ఇన్‌ఛార్జి విసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లిఖితపూర్వకంగా మంత్రి గంటా రెక్టార్‌ను నియమించాలని చేసిన ప్రతిపాదనను సిఎంవో అధికారులు తోసిపుచ్చి మంత్రి అసంతృప్తికి లోనుకావడం సహజం. కానీ, ఆ అసంతృప్తి, తర్వాత కలిగిన ఆగ్రహం అంబేద్కర్ వర్సిటీ వీసీ రామ్‌జీపై చూపించడం ఎంతవరకూ సమంజసమంటూ ఆచార్యుల్లో చర్చ మొదలైంది. మంత్రి గంటా రగడ తర్వాత నియమించిన రాజేంద్రప్రసాద్ ఈ నెల 11వతేదీన ఉత్తర్వులు అందుకోవడం, మళ్లీ ఆ ఉత్తర్వులు పెండింగ్‌లో పడడంతో రాత్రికిరాత్రి పలు ఫైళ్ళపై సంతకాలు చేశారన్న ఆరోపణలు గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రి గంటా, ఉన్నతవిద్యామండలి ఛైర్మన్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి ఫిర్యాదులు పంపినట్టు వర్సిటీ వర్గాలు చెప్పుకొచ్చాయి. అలాంటి సమయంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దమయంతి జీవో.నెం.ఆర్టీ 14ను ఇస్తూ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ఆచార్యులు కూన రామ్‌జీని ఆచార్యనాగార్జునయూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు ఆయన గురువారం అక్కడ విసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కానీ, రామ్‌జీని ఆ పదవీ బాధ్యతలు చేపట్టేందుకు ఆటంకాలను గంటా పేషీ నుంచి ఒత్తిడి పెరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, వీసీ రామ్‌జీ తరుపున గంటా శ్రీనివాసరావుతో మంతనాలు జరిపినట్టు తెలియవచ్చింది. ఇన్‌ఛార్జి వీసీగా ఉత్తర్వులు కావాలంటూ రామ్‌జీ ప్రయత్నం చేయకపోయినా, ఆయనను ప్రభుత్వం ఎంపిక చేసిన విధానాన్ని విడమరిచి చెప్పినట్టు తెలిసింది. కానీ, మంత్రి గంటా మాత్రం ఆచార్యులు రామ్‌జీ పట్ల ఆగ్రహంతో, ఆయన నియామకం పట్ల అసంతృప్తినే వ్యక్తం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఉన్నతవిద్యాశాఖలో ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తూ, ఆ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో పొరపొచ్చలు ఏర్పడడం పట్ల అంబేద్కర్ వర్సిటీ వీసీ రామ్‌జీ మదనపడుతున్నట్టు ఆయన సహచరులైన ఆచార్యులు చెప్పుకొచ్చే మాట. అయితే వీసీ రామ్‌జీని 'ఆంధ్రభూమి' ఈ సంఘటనపై వివరణ కోరగా మంత్రి గంటాతో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని, ఎటువంటి దూరం పెరగలేదంటూ చెప్పారు. ఈ నెల 17వ తేదీన ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి విసీగా బాధ్యతలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

బంధుమిత్రులతో కలసి పాల్గొంటేనే

సంక్రాంతికి సార్థకత

★ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



మనుమడు దేవాన్ష్‌తో కలిసి నారావారిపల్లె వీధుల్లో ఎడ్లబండిలో వెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఆంధ్రభూమిబ్యూరో

తిరుపతి, జనవరి 16: ఈ మారు జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా పటిష్టంగా నిర్వహించామని, అక్కడికక్కడే ప్రజాసమస్యలు పరిష్కరించామని, కొత్త వినతులు స్వీకరించామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. సంక్రాంతి పర్వదినాన్ని తన జన్మస్థలమైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో జరుపుకోవడానికి సోమవారం సాయంత్రం ఆ గ్రామానికి చేరుకున్న ఆయన మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వారి వారి జన్మస్థలాల్లో జరుపుకుంటేనే పండుగ ప్రాముఖ్యతకు సార్థకత చేరుతుందన్నారు. ఈ క్రమంలో తాను తన జన్మస్థలమైన నారావారిపల్లికి వచ్చినట్లు తెలిపారు. వాస్తవానికి 20 సంవత్సరాల క్రితమే తన సతీమణి భువనేశ్వరి దేవి ఈ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు. తొలిరోజుల్లో ప్రజల్లో చైతన్యం కొంత తక్కువ ఉన్నా నేడు గణనీయంగా పెరిగిందన్నారు. ఈ యేడాది సంక్రాంతి రోజున సుదూర ప్రాంతాల్లో ఉన్న వారందరూ వారి వారి స్వగ్రామాలకు చేరుకుని పండుగలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. తమ వారసత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం అవసరమన్నారు. వాటిని అడ్డం పెట్టుకుని జూదమాడడం మంచిది కాదన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా లోటుబడ్జెట్ ఉన్నా ఏ రాష్ట్రం చేయని విధంగా అభివృద్ధి చేశామన్నారు. గతంలో 50లక్షల వినతులు అందేవని, నేడు ఆ పరిస్థితి పోయి 5.5 లక్షల వినతులు అందాయని, అందుకు కారణం ప్రజాపరిష్కార వేదిక పారదర్శకంగా ఆన్‌లైన్ చేసి అందుబాటులోనికి తేవడమేనన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా బయోమెట్రిక్ విధానంతో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నామని, నెలనెలా ఇస్తున్న వెయ్యి రూపాయలను రెండువేల రూపాయలకు పెంచి పేదలకు ఆసరాగా ఉంటుందని భరోసా ఇచ్చి జనవరి మొత్తాన్ని ఫిబ్రవరిలో మూడువేలు, దివ్యాంగులకు 3,500 రూపాయలు అందించనున్నామన్నారు. నేడు పెన్షన్ పొందుతున్న పేదలు సంక్రాంతిని ఆనందంగా జరుపుకుంటున్నారన్నారు. పెన్షన్ పొందుతున్న వారికి వైద్యఖర్చులు, ఇతర ఖర్చులతో పాటు ఆరోగ్యంపై భరోసా వచ్చిందన్నారు. ఇంటిలో కుటుంబ సభ్యులు గౌరవం ఇస్తున్నారని పెన్షన్‌దారుల్లో ఆత్మస్థైర్యం వచ్చిందన్నారు. రేషన్ పండుగ కానుకలు, బీమా, పెన్షన్‌లు వంటివి ధనిక రాష్ట్రాలు కూడా చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. గృహ నిర్మాణాలకు 2లక్షల రూపాయలు రాయితీ ఇస్తునట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలను పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్ది, సీసీ రోడ్ల నిర్మాణం, ఇంటింటి చెత్తసేకరణ, కంపోస్ట్ తయారీ వంటివి పట్టణాలకు దీటుగా చేస్తున్నామన్నారు. ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటి చెత్తసేకరణ, బిందుసేద్యంలో దేశంలోనే చిత్తూరు జిల్లా 10వ స్థానంలో ఉందన్నారు. అనంతపురం, చిత్తూరు జిల్లాలను హార్టీకల్చర్ హబ్‌గామార్చి వ్యాపార పంటలతో అధిక ఆదాయం వచ్చేలా చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు రైతులను మరలిస్తున్నామని, పీల్చే గాలి, తినే తిండి, తాగునీరు స్వచ్ఛంగా ఉండాలనే ఉద్దేశంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. హార్టీకల్చర్ గార్డెన్స్‌తో గ్రీన్ కవర్ అయి ఆరోగ్యంతో పాటు అధిక ఆదాయం రైతులకు వస్తున్నదన్నారు. 25వేల కిలోమీటర్లు సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామాల్లో ఇప్పటికే దాదాపు సీసీ రోడ్లు మయం అయ్యాయని, మన ఆరోగ్యం కోసం మట్టి రోడ్డు నడక మంచిదని ఉమ్మడి రాష్ట్రంలో బ్రహ్మానందరెడ్డి పార్కులో 6 కిలోమీటర్లు మట్టిరోడ్డు వేశామని, నడక అందులోనే సాగించేవారన్నారు. గోకులం, మినీగోకులంలకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. బ్రెజిల్ దేశస్థులకు మన ఒంగోలు బ్రాండ్‌తో పాల ఉత్పత్తి గణనీయంగా వచ్చిందని, మన డెయిరీకి సహకరించడానికి వారు ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగంలో హీరో మోటార్స్, ఇసుజు, అపోలో టైర్స్, ఫక్షర్డ్ వంటి కంపెనీలు వచ్చాయన్నారు. వీటితో పాటు టైల్స్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు రావడంతో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. 24గంటల కరెంటు, రైతుల కోసం 9గంటల ఉచిత విద్యుత్, 24వేల కోట్ల రుణమాఫీ, 10శాతం వడ్డీతో కలిపి 3విడతలు ఇప్పటికే అందించామన్నారు. మరో రెండు విడతలు త్వరలో ఇవ్వనున్నామన్నారు. యువత కోసం యువనేస్తం పేరుతో దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని నిరుద్యోగ భృతి అందిస్తున్నామని, జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు గణనీయంగా పెంచామన్నారు. ఇప్పటికే 7వేల ఎంఎస్‌ఎంఈలలో 80వేలమందికి ఉపాధి కలిగిందన్నారు. మన రాష్ట్రం అభివృద్ధిలో 650 ర్యాంకులు సాధించిందని, తిరుపతి పట్టణం భద్రతలో రెండు, నివాసయోగ్యంలో 4, స్వచ్ఛతలో 6, రైల్వేలో 3వ ర్యాంకులు సాధించడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించడం లేదని ఎంపీ శివప్రసాద్ పార్లమెంట్‌లో ఎండగట్టినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సీబీఐ, ఆర్‌బీఐ, ఈడీ, ఐటీ వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులను ఇచ్చినట్లే ఇచ్చి వెనకకు తీసుకున్నారని, పోలవరం బ్యాలెన్స్ నిధులు ఇంకా 3700కోట్ల రూపాయలు విడుదల చేయలేదని, ఇబ్బందులు పెడుతున్నా సంక్షేమంలో ముందుకు పోతున్నామన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ శివప్రసాద్, ఎంఎల్‌సీలు, కలెక్టర్ పాల్గొన్నారు.

సత్తెమ్మకు పూజలు చేసిన ముఖ్యమంత్రి

చంద్రగిరి: పుట్టి పెరిగిన సొంతూరు నారావారిపల్లిలోని గ్రామదేవత, కుల దేవత సత్యమ్మ, నాగాలమ్మలకు, తల్లిదండ్రులు అమ్మణ్ణమ్మ , ఖర్జూరపునాయుడు సమాధుల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కుటుంబసభ్యులతో కలసి పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మకర సంక్రాంతి పండుగ సందర్భంగా ఆనవాయితీగా నారావారిపల్లి గ్రామంలో తరతరాల కుటుంబ సంప్రదాయం ప్రకారం ముందుగా సత్యమ్మకు కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగాలమ్మకు కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి తల్లిదండ్రుల సమాధి వద్దకు చేరుకుని అమ్మణ్ణమ్మ, ఖర్జూర నాయుడు సమాధుల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలుచేసి, నివాళులు అర్పించారు. అక్కడ నుండి తమ ఇంటి వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయతీ రాజ్, సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నివాసం వద్దకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని జేసీ 2 చంద్రమౌళిని ఆదేశించారు. ప్రజలకు మకరసంక్రాంతి, కనుమపండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అభినందించి, ప్రకృతి సేద్యంలో తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందిన పులిచెర్ల మండలం, బాలిరెడ్డి గారిపల్లి గ్రామానికి చెందిన రైతు మోహన్‌రెడ్డి అమరావతి రాజధాని నిర్మాణానికి 10వేల రూపాయలు విరాళపు చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. పెన్షన్‌ను రెండువేల రూపాయలకు పెంచినందుకు పులిచెర్ల మండలం కురవపల్లి గ్రామానికి చెందిన రామయ్య ముఖ్యమంత్రిని కలసి అభినందనలు తెలిపి, 2వేల రూపాయల చెక్కును రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. ఎన్టీఆర్ గృహం మంజూరు అయిందని, కొంతపైకం వల్ల ఇల్లు పూర్తికాలేదని, పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లి గ్రామానికి చెందిన చెల్లెమ్మ ముఖ్యమంత్రికి తెలుపగా, వెంటనే సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాయంత్రం ఇంటివద్దకు వచ్చిన ప్రజల వద్ద నుండి వినతులు స్వీకరించి వీటిని పరిష్కరించాలని కలెక్టర్ ప్రద్యుమ్నకు సూచించారు.



తల్లిదండ్రుల సమాధుల వద్ద పూజలు చేసిన హారతి ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులు

మనవడితో కలసి ఎడ్లబండి తోలిన సీఎం

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నారావారిపల్లిలో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిని మనవడు దేవాన్ష్‌తో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోలారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నారావారిపల్లిలో సత్తెమ్మ, నాగాలమ్మకు కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేసిన ముఖ్యమంత్రి, అనంతరం తల్లిదండ్రుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై మనవడు దేవాన్ష్‌తో కలసి సొంత గ్రామంలో వీధుల్లో తిరుగుతూ బంధువులను, గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎంఎల్‌సీ రాజసింహులు, తుడా చైర్మన్ నరసింహయాదవ్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులివర్తి నాని, అనంతపురం రేంజ్ డీఐజీ క్రాంతి రాణా, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ అన్బురాజన్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ విజయరామరాజు, జేసీ 2 చంద్రమౌళి, చంద్రగిరి మండల తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ సెల్ఫ్‌గోల్

★ ఫెడరల్ ఫ్రంట్ ప్రభావం ఏమీ ఉండదు:గంటా

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 16: టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రూపకల్పన చేస్తున్న ఫెడరల్ ఫ్రంట్‌తో రాష్ట్ర విపక్ష నేత జగన్ కలవడం ద్వారా తనకు తానుగా సెల్ఫ్‌గోల్ వేసుకుంటున్నారని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో జగన్ తన చర్యల ద్వారా అతిపెద్ద తప్పిదానికి పాల్పడుతున్నట్టు అభిప్రాయపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం అడ్డుపడే కేసీఆర్‌తో చేయి కలపడం ద్వారా జగన్ రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటములు మినహా మరే ఫ్రంట్‌వల్ల ఉపయోగం ఉండదని తేల్చి చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపుతో కేసీఆర్ విర్రవీగుతున్నారని మండిపడ్డారు. జగన్, కేసీఆర్ అవిభక్త కవలలుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ విపక్ష నేత జగన్ కలిసి ఆడుతున్న జగన్నాటకమే ఫెడరల్ ఫ్రంట్‌గా పేర్కొన్నారు. కేసీఆర్ తనయుడు కేటీఆర్‌తో జగన్ కలవడం ద్వారా ప్రజల్లో ఇప్పటివరకూ నెలకొన్న అపోహలు వాస్తవంగా నిర్ధారణైందన్నారు. రాజకీయంగా ఎటువంటి అనుభవం లేని జగన్ తనంతట తానుగా ఓటమిని కొనితెచ్చుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్న జగన్ ఈ రాష్ట్ర పోలీసులపై విశ్వాసం చూపకపోవడం దారుణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జగన్ ముఖ్యమంత్రి కాలేరని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం ఖాయమని జోస్యం చెప్పారు.

రేపటి నుంచి అరకులో బెలూన్ ఫెస్టివల్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 16: విశాఖ జిల్లా అరకులోయలో అంతర్జాతీయ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌ను ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు పర్యాటక శాఖ సిద్ధమైంది. అరుకు పర్వత శ్రేణుల్లో రెండో ఏడాది వరుసగా ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విశాఖలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సాహసోపేతమైన ఈ సాహస క్రీడలను పర్యాటక శాఖ లెట్స్ వైజాగ్, స్కైవాల్ట్జ్‌తో కలిపి నిర్వస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రెజిల్, స్లోవేకియా, ఇటలీ, యూకే, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్, మలేషియా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియాతోపాటు 15 దేశాలు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు. సుమారు 20 వరకూ హాట్ ఎయిర్ బెలూన్‌లు వేడుకల్లో ఉపయోగిస్తున్నారు. వివిధ దేశాలకు చెందిన హాట్ ఎయిర్ బెలూన్లు బ్రూనోక్లౌన్, హామీబీ, బేబీకార్, హ్యాపీ చికెన్ వంటి ఆకృతుల్లో అరుకు పర్వత శ్రేణుల్లో నీలిమేఘాల నడుమ కదలాడుతూ సందర్శకులను ఆనందడోలికల్లో ముంచెత్తుతాయన్నారు. సూర్యోదయ సమయంలో బెలూన్ విన్యాసాలు జరుగుతాయని, రాత్రివేళల్లో బెలూన్లకు అనుసంధానం చేసిన విమానాలతో నిపుణులు గగన విన్యాసాలు ప్రేక్షకులకు అద్భుత అనుభూతి కలిగిస్తాయన్నారు.అరుకు బెలూన్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఇప్పటికే 4000 మంది ఆసక్తిచూపుతూ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

రాష్ట్రాన్ని పర్యాటకంగా తీర్చిదిద్ది ప్రపంచంలోనే అద్భుత టూరిజం హబ్‌గా విశాఖను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బౌద్ధారామాలను కలుపుతూ బుద్దిస్ట్ సర్క్యూట్ తీసుకువస్తున్నామన్నారు. అరుకు, అనంతగిరి, లంబసింగి ప్రాంతాల్లో రిసార్టులు, హోటళ్లు నిర్మించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. విశాఖలో పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించి అరుకు టూరిజం సర్క్యూట్‌కు రూ.156 కోట్లతో ప్రణాళిక రూపొందించామన్నారు. అలాగే విశాఖ నగరంలో 9 ప్రాంతాల్లో బీచ్‌లు అభివృద్ధి చేస్తున్నామని, రుషికొండ బీచ్‌కు అంతర్జాతీయ బ్లూఫాగ్ సర్టిఫికేషన్ లభించిందన్నారు. అలాగే స్కూబాడైవింగ్, వాటర్ అండ్ అడ్వంచరస్ స్పోర్ట్స్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహణకు వాతావరణం పూర్తి అనుకూలంగా ఉందని, ఇప్పటికే రెండు విడతలుగా ట్రయల్‌రన్ పూర్తి చేశామన్నారు.



హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ వివరాలు వెల్లడిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

పాఠశాలలకు క్రీడా సౌకర్యాల్లో ఏపీకి ఐదో స్థానం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: దేశంలోని వివిధ పాఠశాల్లో క్రీడా సౌకర్యాల కల్పనలో ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం దక్కింది. యాన్యువల్ స్టాటస్ రిపోర్ట్ ఆన్ ఎడ్యుకేషన్ - 2018లో వివిధ రాష్ట్రాల్లో క్రీడలు, క్రీడా సౌకర్యాలు, తదితర అంశాలపై నివేదికను కేంద్రం తాజాగా విడుదల చేసింది. పాఠశాలల టైమ్‌టైబుళ్లలో వ్యాయామ విద్యకు సంబంధించి ఒక పీరియడ్ కేటాయించిన రాష్ట్రాల్లో ఏపీకి ఐదో స్థానం దక్కింది. మొదటి నాలుగు స్థానాలను మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కేరళ దక్కించుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాలు చివరి స్థానాల్లో ఉండటం గమనార్హం.

హర్యాణా, పంజాబ్ రాష్ట్రాలు క్రీడా రంగం పరంగా ముందంజలో ఉన్నప్పటికీ, సగం పాఠశాలల్లో మాత్రమే టైమ్‌టేబుల్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ పీరియడ్‌ను కలిగి ఉండటం గమనార్హం. 10లో 8 పాఠశాలలకు క్రీడా మైదానం అందుబాటులో ఉండగా, 5.8 శాతం ప్రాథమిక పాఠశాలల్లో, 30.8 శాతం ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. చాలా పాఠశాలల్లో ఇతర ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 55.8 శాతం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 71.5 శాతం క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో మెరుగైన క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నట్లు కేంద్రం నివేదికలో వెల్లడైంది.

నేడు చా.సో 104వ జయంతి

★ షరీఫ్‌కు చాసో స్ఫూర్తి సాహితీ పురస్కారం

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 16: గురజాడ వారసత్వ ప్రతినిధిగా కథా రచనలో వాసికెక్కిన చాగంటి సోమయాజులు(చా.సో) జయంత్యుత్సవాలకు విజయనగరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సాహిత్య రంగంలో చాసో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఏటా ఆయన జయంతి కుమార్తె చాగంటి తులసి ఉన్నత స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 17వతేదీన యువ రచయిత వేంపల్లె షరీఫ్‌కు చా.సో స్ఫూర్తి పురస్కారాన్ని అందజేయనున్నారు. పట్టణంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం సాయంత్రం ఈ పురస్కారాన్ని విశిష్ట అతిథుల చేతుల మీదుగా అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. 1995 నుంచి ప్రారంభమైన చాసో స్ఫూర్తి పురస్కారం ఇప్పటివరకు 23 మంది అందుకున్నారు. అందుకున్న వారిలో ఎం.రామ్మోహనరావు, ఆరుద్ర, పి.సత్యవతి, గంటేడ గౌరునాయుడు, బోయ జంగయ్య, కెఎన్‌వై పతంజలి, చిలుకూరి దేవపుత్ర, ముదిగంటి సుజాతరెడ్డి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, కె.వరలక్ష్మి, వి.ప్రతిమ, ఎం.ఖాదిర్‌బాబు, జాజులర గౌరి, ఎస్.సలీం, ఎస్‌వి.రామిరెడ్డి, కె.పద్మ, శశిశ్రీ, ఎఎన్ జగన్నాధశర్మ, పెద్దింటి అశోక్‌కుమార్, చింతకింది శ్రీనివాసరావు, కె.వి.రమణారావు, ఎంఎం వినోదిని, గౌరీ హరదాస్ ఉన్నారు. చాసో 1915 జనవరి 17వతేదీన శ్రీకాకుళంలో జన్మించారు. హైస్కూల్ విద్యాభ్యాసం శ్రీకాకుళంలోనే సాగింది. విజయనగరం మహారాజా కళాశాలలో కళాశాల విద్యను అభ్యసించారు. విజయనగరం చిన్నపల్లివీధిలో చాసో స్వగృహం అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఆటపట్టుగా నిలిచింది. 1930-40 మధ్య కాలంలో తెలుగు కవిత్యోద్యమానికి కవాటాలు తెరచింది. శ్రీరంగం నారాయణబాబు చాసో ఇంటి పక్కనే నివసించేవారు. భగత్‌సింగ్ ఆశయాలపట్ల వీరిద్దరు ఆకర్షితులై సోషలిస్టు భావాలను పెంచుకున్నారు. ప్రజలు అన్యాయాలను ఎదుర్కోవాలని తన కథలలో చెప్పారు. శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, రోణంకి, ఆరుద్రలకు వసతిగృహ అధ్యయన కేంద్రం శిక్షణ శిబిరంగా విరాజిల్లింది. ఈ నేపథ్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం, నారాయణ బాబు-రుధిర జ్యోతి, చాసో కథలు ఆవిర్భవించాయి. చాసో నాలుగు దశాబ్దాలపాటు 50కి పైగా కథలు రాశారు. ఆయన కథలు దృశ్య సాక్ష్యాత్కారాలు. 'గుడిసె దీర్ఘరోగి' కథ మధ్యతరగతి మనుష్యులలో దాగి ఉండే సౌందర్యధారణకు మచ్చుతునక. నడిమంత్రపు సిరి పట్టిన మధ్య తరగతి కుటుంబీకుల మనస్తత్వాన్ని 'వణులవారి' కథలో చక్కగా వ్యక్తం చేశారు. చాసో పేరు వినగానే కుక్కలకంటే హీనంగా బతికే 'కుక్కుటేశ్వరరావు' కథ ఎవరికైనా జ్ఞప్తికి వస్తుంది. 'లేడి కరుణాకరం, ఏలూరు వెళ్లాలి', ఎందుకు పారేస్తారు నాన్న, బండపాటు, ఎంపు, జంక్షన్‌లో బడ్డీ, దుమ్ములగుండె, బొమ్మలపెళ్లి.. ఇలా ప్రతి కథ చాసో ప్రతిభకు సామాజిక చైతన్యానికి సారథ్యం వహిస్తాయి. చాసో ముద్ర చెరిగిపోదని ఆరుద్ర అన్నారు. నిమగ్నత, నిజాయితీ, నిరాడంబరత, మానవత్వం, చాసో ఆయుధాలు అవే కథా రచనలో ఆయన అభ్యున్నతికి సోపానాలు.

ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో మోదీకి సేవ

★ కేసీఆర్, జగన్‌పై కళావెంకట్రావు ధ్వజం

గుంటూరు, జనవరి 16: ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో కేటీఆర్, జగన్ మోదీకి సేవ చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు విమర్శించారు. బుధవారం గుంటూరులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల మాఫీ కోసం జగన్, తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కుంభకోణాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోదీ వ్యతిరేక ఓట్లు చీల్చే కుట్రలో భాగమే ఫెడరెల్ ఫ్రంట్ నాటకమని దుయ్యబట్టారు. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ కేసీఆర్ ఫ్రంట్‌కు మద్దతు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ భేటీలు, కుట్రలను ఆంధ్రులు తిప్పికొడతారన్నారు. తెలుగుదేశం పార్టీ చెప్పినట్లుగానే నేడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ముసుగు తొలగిందన్నారు. 42మంది ఎంపీలు ఉంటే ప్రత్యేక హోదా సాధించే అవకాశముందని చెపుతున్న జగన్ తన పార్టీ ఎంపీలతో ఎందుకు రాజీనామాలు చేయించారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, విభజన హామీలపై జగన్ ఎప్పుడైనా మోదీని ప్రశ్నించారా అని నిలదీశారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి 75వేల కోట్ల రూపాయలు రావాలని మేధావులు చెపుతుంటే వైసీపీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. జగన్ స్వార్థ రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, సరైన రీతిలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్, వైసీపీ నేతలకు తెలంగాణలో ఇరిగేషన్ కాంట్రాక్టులను కేసీఆర్ కట్టబెట్టారని, అందుకే టీఆర్ఎస్‌తో వారు లాలూచీ పడ్డారని ఆరోపించారు.

విలేజ్ మాల్స్‌పై సర్కారు పునరాలోచన!

★ సరకు సరఫరాలో వైఫల్యం

★ కానరాని ప్రజాదరణ

★ రేషన్ డీలర్ల అనాసక్తి

★ మూడు నెలల్లో తుది నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చంద్రన్న విలేజ్ మాల్స్ కొనసాగింపుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. కొద్దినెలలు వేచిచూసి దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలోని దాదాపు 29వేల రేషన్ దుకాణాలను దశలవారీగా చంద్రన్న విలేజ్ మాల్స్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల తక్కువ ధరకు నాణ్యమైన సరకులను ప్రజలకు అందచేయడంతో పాటు రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం లభిస్తుందని భావించింది. ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసేందుకు వీలు కల్పిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ ఆశయం ఘనంగా ఉన్నప్పటికీ, వివిధ కారణాల వల్ల అవి ప్రజాదరణకు నోచుకోవడం లేదు. 2017 డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ, గుంటూరు జిల్లాల్లో రెండు మాల్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తరువాత 13 జిల్లాల్లో 6500 మాల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. తొలిదశలో కనీసం 500 మాల్స్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ గత సంవత్సర కాలంలో 235 రేషన్ డిపోలను మాత్రమే విలేజ్ మాల్స్‌గా మార్చగలిగారు. చాలా రేషన్ డిపోలు అద్దె భవనాల్లో ఉండటం, ప్రజల నుంచి తగినంత ఆదరణ లభించకపోవడం వంటి కారణాలతో విలేజ్ మాల్స్ ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు సంస్థలతో సరకుల సరఫరాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, పంచదార సహా ఆ రెండు సంస్థలు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఇందుకు ఆ కంపెనీల వ్యాపారంలో 8శాతం ఆదాయం డీలర్లకు చెల్లించేలా నిర్ణయించారు. సబ్బులు, పౌడర్లు, వాషింగ్ పౌడర్లు, తదితర ఉత్పత్తులపై 3శాతం రిబేటు ఇస్తున్నా.. వంట నూనెలు, ఇతర ఆహార, పానీయాలపై మార్కెట్ ధరల కన్నా 20నుంచి 30శాతం వరకూ అధికంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వివిధ రకాల పప్పులు, నూనెల ధరలు ఎక్కువగా ఉండటం, షాపు పనివేళలు వంటివి సౌకర్యంగా లేకపోవడంతో విలేజ్ మాల్స్‌కు ప్రజాదరణ లేకుండాపోతోంది. చాలా మాల్స్ సరకులు లేక ఖాళీగా ఉంటున్నాయి. గ్రామీణులకు కావాల్సిన అన్ని సరకులు అందుబాటులో లేకపోవడం కూడా ప్రజల నిరాదరణకు కారణంగా మారింది. దీంతో 235 మాల్స్‌ను ప్రారంభించినప్పటికీ 112 మాత్రమే కొంతమేర వ్యాపారం చేస్తున్నాయి. కొన్ని చోట్ల సరకులు విక్రయించినప్పటికీ, ఆ డబ్బులను తమకు జమ చేయడం లేదని రిలయన్స్ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. విలేజ్ మాల్స్‌కు తగినంత ఆదరణ లభించకపోవడంతో కొత్తగా ఏర్పాటు చేసే విలేజ్ మాల్స్‌కు సరకులను సరఫరా చేసేందుకు రిలయన్స్ ఆసక్తి చూపడం లేదు. దీంతో విలేజ్ మాల్స్ ఏర్పాటు ప్రహసనంగా మారింది. మాల్స్‌లో అమ్మే సరకుల ద్వారా వచ్చే ఆదాయంలో 8శాతం డీలర్లకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తరువాత దీన్ని 3శాతానికి తగ్గించింది. మాల్స్ నిర్వహణకు అవసరమైన సరకులను ముందుగా రిలయన్స్ సంస్థ అప్పుగా ఇస్తుందని చెప్పినప్పటికీ, అది ఆచరణలో అమలు కావడం లేదు. రేషన్ దుకాణాల నిర్వాహకులు 25శాతం, ప్రభుత్వం 25శాతం, మిగిలిన 50శాతం రిలయన్స్ సంస్థ పెడుతుందని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ దుకాణాల డీలర్లు వాటాగా 25శాతం నిధులను కూడా ముద్రా రుణంగా ఇచ్చేలా చూస్తామని ప్రభుత్వం తొలుత హామీ ఇచ్చింది. ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడంతో డీలర్లు కూడా అంతగా ఆసక్తి చూపడం లేదు.

దీంతో ఇప్పటికే ఏర్పాటైన మాల్స్ కొనసాగింపు, కొత్తవి ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన మాల్స్‌కు తగిన ఆదరణ లేకపోవడంతో సరకుకుల సరఫరా కంపెనీలతో ఒప్పందాల కొనసాగింపుపై పౌర సరఫరా శాఖ పునరాలోచనలో పడింది. మరో మూడు నెలలు విలేజ్ మాల్స్ పనితీరు పరిశీలించాక, రెండు కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను కొనసాగించటమా, లేదా అనేదానిపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

గురువారం, 17 జనవరి 2019

ముంబయిలోని ఒక 'హోటల్'లో స్వచ్ఛంద నిర్బంధంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కర్నాటక శాసనసభ్యులు చెల్లిస్తున్న 'అద్దె'- కిరాయి- గురించి బుధవారం గొప్పగా ప్రచారమైంది. ఒక 'గది'కి రోజుకు పదునాలుగు వేల రూపాయల 'కిరాయి' చెల్లించడం రాజకీయ పరిణామక్రమాన్ని కుతూహలంతో గమనిస్తున్న ఉత్సుకగ్రస్తులకు చర్చనీయాంశమైంది. హోటల్ గదుల కిరాయి- ఒక్కొక్కదానికి- పదునాలుగువేల నాలుగువందల రూపాయలకు అదనంగా జీఎస్‌టీ ధ్యాస ఉన్న మాధ్యమాలవారు మరింత నిక్కచ్చిగా నిగ్గుదేల్చిన మహావిషయం. 'రామాయణం'కంటె 'పిడకల వేట'కు ప్రాధాన్యం పెరగడం నడచిపోతున్న రాజకీయం. పార్టీ ఫిరాయింపులను నిరోధించడానికి వీలుగా రాజ్యాంగంలోని నూటరెండవ, నూట తొంబయి ఒకటవ అధికరణాలలోను, పదవ అనుబంధంలోను నిర్దేశించిన నియమావళిని దాదాపు అందరూ మరచిపోవడం నడుస్తున్న చరిత్ర. ఈ నియమావళిని ఉల్లంఘించి సొంత పక్షం నుంచి ఇతర రాజకీయ పక్షాలలోకి ఫిరాయిస్తున్న పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యుల తమ పదవులను కోల్పోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి అనేక ఏళ్లుగా జరుగుతున్న విఘాతం. తెలుగు రాష్ట్రాలలో ఇలా నియమావళికి విరుద్ధంగా పార్టీలను ఫిరాయించినవారు అనేకుమంది ఆ తరువాత కూడ శాసనసభ్యులుగా కొనసాగుతున్నారు. పార్టీలలో 'చీలిక' ఏర్పడినప్పుడు మినహా, మిగిలిన సందర్భాలలో సొంత పార్టీని వదలినవారు తక్షణం తమ పార్లమెంటు సభ్యత్వాన్ని, శాసనసభ్యత్వాన్ని కోల్పోవాలన్నది రాజ్యాంగంలోని పదవ అనుబంధంలోని నిర్ధారణ. చట్టసభలలో ఒక పార్టీకి ఉన్న మొత్తం సభ్యులలో కనీసం మూడవ వంతు మూకుమ్మడిగా తిరుగుబాటు చేసినప్పుడు మాత్రమే 'పార్టీ'లో చీలిక ఏర్పడినట్టు ధ్రువపడుతుంది. కానీ తెలుగు రాష్ట్రాలలో సహా దాదాపు అన్ని రాష్ట్రాలలోను ఇందుకు విరుద్ధంగా ఒకరు, ఇద్దరు, ముగ్గురు, నలుగురు- ఇలా 'మూడవ వంతు కంటె తక్కువ సంఖ్యలోనే' శాసనసభ్యులు పార్టీలను ఫిరాయిస్తూనే ఉన్నారు. ఇలాంటి 'ఫిరాయింపు'దారులు శాసనసభ్యత్వాలను కోల్పోయిన సందర్భాలు తక్కువ. ఇలా ఫిరాయించిన వారికి మంత్రి పదవులు కూడ దక్కిపోతున్నాయి. కర్నాటకలో ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ బేరసారాలకు ఇదంతా నేపథ్యం. తమిళనాడులో అన్నా డీఎంకే నుండి విడివడిన శాసనసభ్యులు పదవులను కోల్పోడం మాత్రమే ఈ ఫిరాయింపుల వైపరీత్యానికి ఇటీవలి కాలంలో 'అపవాదం'. పార్టీకి చెందిన సభ్యులలో మూడవ వంతు లేరన్న కారణంగా టీటీవీ దినకరన్‌కు విధేయులైన పద్దెనిమిది మంది శాసనసభ్యుల సభ్యత్వాలను సభాపతి పి.ధనపాల్ 2017 సెప్టెంబర్ 18న రద్దుచేశాడు. దీనిని మద్రాసు ఉన్నత న్యాయస్థానం ధ్రువీకరించింది. కానీ 'మూడవ వంతు'తో నిమిత్తం లేకుండా ఒక పార్టీనుంచి మరో పార్టీకి ఫిరాయించవచ్చునన్న 'ధీమా' ప్రజాప్రతినిధులలో పెరిగిపోతుండడం ప్రస్తుతం కర్నాటకలో జరుగుతున్న రాజకీయ నాటకానికి ప్రాతిపదిక. వివిధ పార్టీలకు చెందిన శాసనసభ్యుల 'హోటల్' నిర్బంధాలకు అవుతున్న ఖర్చు గురించి జరుగుతున్న ప్రచారం 'పిడకల వేట' మాత్రమే. కానీ కర్నాటకలో నడుస్తున్న 'బేరసారాల' రాజకీయం మాత్రం రామాయణం కాదు. దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న 'పొత్తుల' 'కూటముల' రాజకీయంలో ఈ కర్నాటక కాండ ఒక అంశం మాత్రమే. కర్నాటకకు చెందిన 'భారతీయ జనతాపార్టీ' శాసనసభ్యులను ఢిల్లీకి

పిడకల వేట!

సమీపంలోని గురుగావ్‌లోని హోటళ్లలలో ఎందుకు నివసింపచేస్తున్నారన్నది 'కర్నాటక కాండ'లోని మరో కుతూహల ఘట్టం. కాంగ్రెస్ నుంచి కొంతమంది జారుకున్నట్టయితే కాంగ్రెస్ మద్దతుతో మనుగడ సాగిస్తున్న ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి పదవీగండం ఏర్పడడం ఖాయం. అందువల్ల ఆయన కొంతమంది 'భాజపా' శాసనసభ్యులను తమ 'కూటమి'లో చేర్చుకొనడానికి యత్నిస్తున్నాడన్నది జరుగుతున్న ప్రచారం. లౌకిక జనతాదళ్ అధినేత కుమారస్వామి గత మే నెలలో ముఖ్యమంత్రి కావడానికి కారణం కాంగ్రెస్ చేసిన గొప్ప త్యాగం. రెండువందల ఇరవై నాలుగు స్థానాల శాసనసభలో నూట నాలుగింటిని గెలిచిన 'భాజపా'కు అధికారం దక్కకుండా నిరోధించడానికి కాంగ్రెస్ గత మే నెలలో ఇలా 'చారిత్రిక త్యాగానికి' పూనుకొంది. డెబ్బయి ఎనిమిది స్థానాలను గెలిచిన కాంగ్రెస్ ముప్పయి ఎనిమిదింటిని కైవసం చేసుకున్న లౌకిక జనతాదళ్‌కు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టడం ఈ త్యాగం. ఇలా 'విరోధికి అపశకునం కలిగించడానికై కాంగ్రెస్ తన ముక్కును కోసుకోవడం'వల్ల లౌకిక జనతాదళ్ అధినేత కుమారస్వామి ముఖ్యమంత్రి కాగలిగాడు. కానీ ఎన్నికల ప్రచారం సందర్భంగా తమను కుమారస్వామి తిట్టిన తిట్లను మరచిపోలేని, మంత్రి పదవులను పొందలేని కాంగ్రెస్ శాసనసభ్యులు కొందరు సందు చూసుకొని 'గోడ దూకడానికి' భాజపా 'ప్రాంగణంలోకి' చేరిపోవడానికి సిద్ధంగా ఉండడం ప్రచారమవుతున్న 'రహస్యం'.

కానీ 'విలక్షణ సైద్ధాంతిక నిబద్ధతను అనుశాసన నిష్ఠను కలిగి ఉన్న 'భాజపా'వారు తమ శాసనసభ్యులను గురుగావ్‌లో ఎందుకని 'మందపెట్టి'నట్టు? అంటే తమ పార్టీకి చెందిన కొంతమంది శాసనసభ్యులు 'ఫిరాయించి' కుమారస్వామి కూటమిలో చేరిపోగలరని 'భాజపా' నాయకత్వం భయపడుతోందా? నిజంగా అలా జరిగినట్టయితే సైద్ధాంతిక నిబద్ధత ప్రజాస్వామ్య నిష్ఠ ఈ ఫిరాయింపుదారులకు లేనట్టు ధ్రువపడుతుంది. అలాంటి వారిని అభ్యర్థులుగా నిలబెట్టడం నాయకత్వ వైఫల్యానికి నిదర్శనం. కానీ నిష్కారణంగా సైద్ధాంతిక నిష్ఠ ఉన్న తమ శాసనసభ్యులను వారి 'సౌశీర్యాన్ని' శంకించి ఇలా మందపెట్టి ఉన్నట్టయితే అది వారిపట్ల నాయకత్వం ప్రదర్శిస్తున్న అవమానకరమైన వైఖరికి నిదర్శనం. ఇలా తమను అవమానించిన నాయకత్వానికి, ప్రధానంగా కర్నాటకలో పార్టీని నడిపిస్తున్న బీఎస్ యెడియూరప్పకు ఈ శాసనసభ్యులు నిరసన తెలపడం సహజం. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల లోగా కర్నాటకలో కాంగ్రెస్, లౌకిక జనతాదళ్‌ల మధ్య 'మైత్రి' రద్దయిపోవచ్చునన్నది జరుగుతున్న ప్రచారం. అందువల్ల 'కూటమి'కూలిపోయి కుమారస్వామి మంత్రివర్గం కూలిపోతే శాసనసభకు మళ్లీ ఎన్నికలు జరగడం ఖాయం. నూటనాలుగు మంది సభ్యులున్న భాజపా గత మే నెలలో ఎన్నికలు ముగిసిన వెంటనే- ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. కానీ 'సభ'లో 'సంఖ్యాధిక్యం'- మెజారిటీ లేకపోవడంతో ముఖ్యమంత్రి యెడియూరప్ప ప్రభుత్వం మూన్నాళ్లకే ముగిసింది. కుమారస్వామి ప్రభుత్వం ఏర్పడింది. 'భాజపా' మిన్నకున్నట్టయితే ఇలా మధ్యంతరంగా ఎన్నికలు జరుగవచ్చు. అలా ఎన్నికలు జరిగితే'భాజపాకు మెజారిటీ లభించవచ్చు కూడా. కానీ వేచి చూడకుండా ఫిరాయింపులను ప్రోత్సహించి కుమారస్వామి ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి యత్నించినట్టయితే 'అప్రతిష్ఠపాలు కాగలదు.

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా 'భాజపా' వ్యతిరేక పక్షాల కూటముల ఏర్పాటుకు జరిగిపోతున్న ఆర్భాటం దేశ రాజకీయాలలోని ప్రస్తుత ప్రధాన అంశం! కాంగ్రెస్‌తో కూడిన 'భాజపా' వ్యతిరేక కూటమి ఏర్పాటుకోసం ఒకవైపు, కాంగ్రెస్ లేని 'భాజపా' వ్యతిరేక కూటమి ఏర్పాటుకు మరోవైపు చురుకుగా చర్చలు జరుతున్నాయి. తెరాసకూ, వైఎస్‌ఆర్‌సీపీకి మధ్య బుధవారం జరిగిన చర్చలు కాంగ్రెస్ లేని 'భాజపా' వ్యతిరేక కూటమికి మద్దతు ఊపందుకొంటోందనడానికి నిదర్శనం. ఉత్తరప్రదేశ్‌లో ఇదివరకే కాంగ్రెస్ లేని 'భాజపా' వ్యతిరేక కూటమి ఏర్పడిపోయి ఉంది. ఇలా జాతీయ రాజకీయం ఆసక్తికరంగా రాజుకుంటున్న తరుణంలో మొదలైన 'కర్నాటక ప్రహసనం' సరికొత్త పిడకల వేట.

మతం మతానికి ప్రత్యామ్నాయం కాదు

మయన్మార్‌లో (ఒకనాటి బర్మా) మెజారిటీ సంఖ్యగా ఉన్న బౌద్ధ మతస్థులున్నారు. ఇటీవల ఆ దేశ సైన్యం మైనారిటీలైన రోహింగ్యా ముస్లింలపై దాడులుచేసి వారిని దారుణంగా హతమారుస్తుండటంతో వారు విదేశాలకు వలసపోతున్నారు. రోహింగ్యా ముస్లింలలో కొందరు అక్కడ నెలకొన్న స్థానిక పరిస్థితుల దృష్ట్యా తమ హక్కుల సాధనకోసం ఉగ్రవాద పంథాని ఎంచుకొన్నంతమాత్రాన వారందర్నీ ఉగ్రవాదులమని పిలువలేము. ఆ దేశాధినేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్‌శాన్ సూచి సైతం ఇరువర్గాల మధ్య శాంతియుతమైన చర్చలకు చొరవ చూపకపోవడం దురదృష్టకరం. 2017 ఆగస్ట్ 25నుంచి సుమారు నాలుగు లక్షల మంది ముస్లింలు బంగ్లాదేశ్‌కు వలస వెళ్ళారు.

రెండువేల ఐదువందల సంవత్సరాల క్రితమే బుద్ధుడు అహింస, శాంతియుత మార్గాల ద్వారా సమసమాజాన్ని స్థాపించవచ్చని బోధించాడు. అశోకుడు లాంటి గొప్ప చక్రవర్తికూడా బుద్ధుని బోధనలకి ప్రభావితమై యుద్ధాలకి స్వస్తిపలికి శాంతియుతంగా పరిపాలన సాగించాడు. తదనంతర కాలంలో బౌద్ధమతం హీనయాన, మహాయాన శాఖలుగా చీలిపోయింది. దేవుడే లేడన్న బుద్ధుడిని దేవుడిగా కొలుస్తున్నారు. వ్యక్తిగత ఆరాధన బుద్ధిజంలోనూ చోటు చేసుకుంది. బౌద్ధమతంలో కూడా స్ర్తీలకు అంతగా ప్రాముఖ్యత లభించలేదు. అయినప్పటికీ బుద్ధుని ప్రవచనాలు ఎప్పటికీ ఆచరణీయమే.

మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు మతమౌఢ్యంతో స్ర్తీవిద్యని నిరాకరిస్తున్నారు. ఆ ఉగ్రవాదుల దాడికి అత్యంత ప్రాచీనమైన బమియన్ బుద్ధవిగ్రహాలు ధ్వంసం అయ్యాయి. పాకిస్థాన్‌లోని స్వాత్ లోయలో మలాలపై జరిగిన దాడి ప్రపంచానికి తెలిసిందే. పాకిస్థాన్‌లో రోజురోజుకూ హిందువుల సంఖ్య తగ్గిపోతోంది. సహనం, దాతృత్వం వంటి అత్యుత్తమ లక్షణాలని మనిషి కల్గిఉండాలని మహ్మద్ ప్రవక్త బోధించాడు. మనలో ఉన్న చెడు గుణాలపై జీహాద్ (పవిత్ర యుద్ధం) ప్రకటించాలని ప్రవక్త ప్రబోధించాడు. అంటే దానర్థం మనలోఉన్న చెడు లక్షణాలని తొలగించుకోవాలి. మహ్మద్ ప్రవక్త బోధించిన సూత్రాలని తు.చ. తప్పకుండా పాటిస్తూ ఇండోనేషియా ప్రజలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముస్లింలలో కొందరు జీహాద్‌ని వేరే మతస్థులపై ప్రకటిస్తున్నారు. మహ్మద్ ప్రవక్త గొప్ప సంఘ సంస్కర్త. చరిత్రలో ముస్లింలకు మరియు క్రైస్తవులకు మధ్య 'క్రూసేడ్స్' పేరుతో యుద్ధాలు జరిగిన విషయం విదితమే.

ఇంకోవైపు ప్రేమ, కరుణ, క్షమాగుణం వంటి ఉన్నత లక్షణాలని క్రీస్తు బోధించాడు. బానిస వ్యవస్థని ఎదిరించాడు. రాజుకూడా నామ మాత్రుడేనని వివరించాడు. క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయి. క్యాథలిక్కుల సనాతన సాంప్రదాయాలని ఎదిరించి ప్రొటెస్టెంట్స్ ఎదిగారు. ప్రొటెస్టెంట్స్ ఆధునిక భావాలని స్వాగతించారు. కాని రానురాను క్రైస్తవంలోకూడా అనేక శాఖలు వెలిశాయి. అనేక మూఢ విశ్వాసాలు ఈ మతంలోకి జొరబడ్డాయి. క్రీస్తు పిలుస్తున్నాడంటూ ఇటీవల ముగ్గురు మహిళలు ఆత్మహత్య చేసుకోవడం సంచలనం అయ్యింది. మత ప్రచారాన్ని కొందరు పాస్టర్లు తమ జీవనోపాధిగా మలుచుకుంటున్నారు. బ్రిటిష్‌వారు క్రైస్తవాన్ని ఇతర దేశాలని తమ వలస రాజ్యాలుగా మార్చుకోవడానికి ఉపయోగించుకున్నారు. తోటి వారిని ప్రేమించమని క్రీస్తు బోధించాడు. ఎదుటివారి ఆచారాలని, సాంప్రదాయాలని గౌరవించినప్పుడే అది సాధ్యమవుతుంది. అమెరికాలో శ్వేత జాతీయులు అక్కడి నల్లజాతీయులపై దాడులు చేస్తున్నారు. వర్ణ వివక్షత అక్కడ అడుగడుగునా కన్పిస్తోంది.

ఇక మన దేశ విషయానికొస్తే మెజారిటీలు మతపరంగా స్వతంత్రంగా ఉంటారు. హిందూ మతంలో కుల జాఢ్యం ఎక్కువ. పటిష్టమైన కుటుంబ వ్యవస్థ, పెద్దల పట్ల గౌరవం, మతపరంగా పెద్ద ఆంక్షలు లేకపోవడం వంటివి హిందూ మతంలో ఉన్నాయి. అయితే అంటరానితనం, కుల వివక్ష హిందూ మతానికి మాయనిమచ్చగా మిగిలాయి. ఇటీవల కాలంలో గోరక్షణ పేరుతో మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. మత సామరస్యానికి కృషిచేస్తున్న గౌరిలంకేష్ వంటి వారిని దారుణంగా చంపడం మన దేశంలో పెరుగుతున్న మత అసహనానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలు చేపడుతున్న స్వచ్ఛభారత్, వనం-మనం, నీరుచెట్టు వంటి కార్యక్రమాలని మరింత సమర్థవంతంగా చేపడితే సరిపోతుంది. ప్రభుత్వాలే అశాస్త్రీయ విషయాలకు ప్రాధాన్యతనిస్తే, ప్రజలు డేరాబాబా లాంటి వారిని ఆశ్రయిస్తారు. మహాత్మా జ్యోతీరావుపూలే, డా.బి.ఆర్.అంబేద్కర్, స్వామి వివేకానంద వంటి వారిని పాలకులు తమతమ ప్రాంత, కుల, మత నాయకులుగా చిత్రీకరిస్తున్నారు. స్వామి వివేకానందుని మనం భారతావనికి ప్రతినిధిగా చూడాలి.

ప్రపంచంలో వివిధ మతాలలో జరుగుతున్న సంఘటనలని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, ఒక మతం, మరొక మతానికి ఎప్పటికీ ప్రత్యామ్నాయంకాదని స్పష్టంగా తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మతస్థులు ప్రాంతంలో ఉన్న మైనారిటీ మతస్తులకు రక్షణ లేకుండా పోతోంది. అల్పసంఖ్యాక వర్గాలు తమ హక్కులని కోల్పోతున్నారు. ఆయా ప్రాంతాల్లో వీరు ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణింపబడుతున్నారు. వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువైపోతున్నాయి. గత్యంతరంలేక వీరు తమ ప్రాణాలని కాపాడుకోవడానికి వేరే ప్రాంతాలకు వలసవెళ్తున్నారు. తమ హక్కుల సాధనకోసం హింసామార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇటువంటి పరిణామాలని ఉగ్రవాదంగా కాకుండా, సామాజిక సమస్యగా చూడాలి. ప్రతి ప్రాంతంలో మెజారిటీ మతస్తులే పాలకులుగా ఉంటున్నారు. వారి ఆదేశాలతోనే చట్టాలు తయారుచేయబడుతున్నాయి. ఈ చట్టాల పట్టాల కింద అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు నలిగిపోతున్నారు.

శాస్త్రవేత్తలు ప్రజలతో కలవకుండా పరిశోధనాలయాలకే పరిమితం అవడం, పి.ఎమ్.భార్గవలాంటి కొద్దిమందిని మినహాయిస్తే అత్యధిక మంది శాస్త్రవేత్తలు ఏదో ఒక మత విశ్వాసానికి వత్తాసు పలకడం, పాలకులే మతపరమైన కార్యక్రమాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించడం వంటి కారణాల వల్ల మతాలే మనిషి జీవనాన్ని నిర్దేశిస్తున్నాయి. పాలకులకి ఓటు బ్యాంకుగా మారిపోతున్నాయి.

అమెరికాలాంటి అగ్రరాజ్యాలు ఇతర దేశాలలో జరుగుతున్న అలజడులని అవకాశంగా తీసుకొని ఆయా దేశాలల్లోఉన్న వనరులని దోచుకునే ప్రయత్నం చేస్తుంది. ఫలితంగా ఉత్తరకొరియా వంటి దేశాలు హైడ్రోజన్ బాంబు పరీక్షని విజయవంతంగా చేపట్టామని ప్రకటిస్తూ అమెరికాకు పక్కలో బల్లెంలా తయారైంది. తాజా పరిణామాలన్నీ చూస్తుంటే జాత్యహంకారం మరల జడలు విప్పుతుందేమోనన్న అనుమానం కల్గకమానదు. అమెరికానుండి ఆఫ్రికా వరకు పరిశీలించినా మనకు మండేలా, గాంధీజీ, లూథర్‌కింగ్, లింకన్ వంటి ప్రపంచ నాయకులు కన్పించడంలేదు. ఎక్కడ చూసినా కుల, ప్రాంత, మత నాయకులే వర్ధిల్లుతున్నారు. ఆనాడు మతోన్మాదం, సామ్రాజ్యవాదాలే రెండు ప్రపంచ యుద్ధాలకు కారణమయ్యాయి. నాటి సైన్స్ పరిశోధనలు నియంతల పట్ల వరాలుగా మారాయి. ప్రస్తుత ప్రపంచంలో ఆనాటి పరిస్థితులే పునరావృతమౌతున్నాయి. మతానికి సైన్స్ మాత్రమే ప్రత్యామ్నాయం కావాలి. మతం మన వ్యక్తిగత జీవన విధానంగా ఉన్నంతవరకు పర్వాలేదు. అది రాజకీయ నినాదంగా మారకూడదు.

- ఎమ్.రాంప్రదీప్

కెమిస్ట్రీ లేకపోతే పొత్తులు ఫట్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే కనీసం 150 లోక్‌సభ సీట్లు తెచ్చుకోవాలి. బీజేపీ వ్యతిరేక ఎస్పీ, బీఎస్పీ, డీఎంకే, తృణమూల్, బీజేడీ, టీడీపీ తదితర పార్టీలు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. ఏ విధంగా చూసినా రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేందుకు తగిన బలం సమకూరుతుందనే నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. కాంగ్రెస్ లేకుండా బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లు పొత్తులు ఖరారు చేసుకున్నారు. రెండు పార్టీలు చెరో 38 సీట్లకు పోటీ చేసేటట్లు, మిగిలిన నాలుగు సీట్లు కాంగ్రెస్‌కు రెండు, ఆర్‌ఎల్‌డీకి రెండు సీట్లు ఇచ్చేందుకు ఒప్పందం ఖరారైంది. ఒక వైపు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహా కూటమిని ఏర్పాటు చేసి, బీజేపీని ఓడించి దేశ ప్రధాని కావాలని రాహుల్ గాంధీ ప్రయత్నాలకు ఆదిలోని ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర ప్రదేశ్ రాజకీయాల్లో కులాల ప్రభావం ఎక్కువ. ఈ రాష్ట్రంలో దళితులు మాయావతి వెంట, బీసీలు ఎస్పీ వెంట నడుస్తారు. ముస్లింలు ఇరు పార్టీలకు మొగ్గుచూపుతారు. ఇతర వర్గాల ఓటర్లు బీజేపీతో వెళుతుంటారు. కాని అన్ని వర్గాల్లో మూడు పార్టీలకు ఓటర్లు ఉన్నారు. గంపగుత్తగా ఒక కులం ఓట్లు పడవు. యూపీలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి దాదాపు 30 ఏళ్లయింది. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సాధించేందుకు పెద్ద ప్రయత్నాలు చేయలేదు. ఆ ఓపిక ఆ పార్టీ సీనియర్లకు, గాంధీ కుటుంబానికి లేదు. బీఎస్పీ అధినేత్రి మాయావతి మాటల్లో చెప్పాలంటే, 'అనేక సంవత్సరాలుగా పొత్తుల సందర్భంగా ఓట్ల బదలాయింపు చూస్తున్నాం. బీఎస్పీ ఓట్లు ఎస్పీకి, ఎస్పీ ఓట్లు బీఎస్పీకి బదలాయింపు అవుతున్నాయి. కాని కాంగ్రెస్ ఓట్లు బదలాయింపు కావడం లేదు. కాని మా ఓట్లు కాంగ్రెస్‌కు బదలాయింపు అవుతున్నాయి. ఓట్ల బదలాయింపు సరిగా లేకపోతే పొత్తులు దండగ -అని చెప్పారు. ఈ ఓట్ల బదలాయింపు అనేది పొత్తు రాజకీయాల్లో చాలా ముఖ్యం. ఉదాహరణకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్, సీపీఐ పొత్తు పెట్టుకున్నాయి. ఈ పొత్తులో అంతంత మాత్రంగా ఉన్న టీడీపీ ఓట్లు కాంగ్రెస్‌కు బదలాయింపు కాలేదు. అదే విధంగా కాంగ్రెస్ ఓట్లు టీడీపీకి పడలేదు. ఇక టీజేఎస్, సీపీఐ ఓటు బ్యాంకుపై ఇంతవరకు స్పష్టత లేదు. దీంతో ఈ పొత్తు వికటించి కాంగ్రెస్ పతనానికి దారితీసింది. బీహార్‌లో 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. 40 సీట్లలో బీజేపీకి 22 లోక్‌సభ సీట్లు వచ్చాయి. పొత్తులు నాయకుల కరచాలనాలు, వేదికలపై ఆలింగనాల వల్ల ఫలించవు. కింది స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ఆయా పార్టీలను అభిమానించే ప్రజల మధ్య కెమిస్ట్రీ కుదరాలి. ఈ కెమిస్ట్రీ యూపీలో లేదని మాయావతి చెప్పారు. అందుకే కాంగ్రెస్‌ను పక్కకు తీసి పెట్టారు. కావాలంటే రాయబరేలీ, అమేథీ సీట్లు తీసుకోవాలని, అక్కడ తల్లీ, కుమారుడు సోనియా, రాహుల్ పోటీ చేసుకోవచ్చని నిర్మొహమాటంగా చెప్పారు. కాంగ్రెస్‌కు ఇంత కంటే అవమానం ఏముంటుంది ? స్వాతంత్ర్యాన్ని తెచ్చి, దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీకి ఇంత కంటే ఘోరమైన అవమానం మరొకటి ఉంటుందా ?

శరవేగంగా ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. బీహార్‌లో కూడా ఆర్జేడీ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తుకు ఓకే చెప్పినా అడిగినన్ని సీట్లు ఇచ్చే స్థితిలో లేదు. యూపీ, బీహార్‌లోనే 120 లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్‌కు పట్టుమని పది సీట్లుకూడా రాకపోతే, దేశానికి ప్రధాని కావాలన్న ఆకాంక్ష ఈడేరుతుందా? మాయావతి, అఖిలేష్ యాదవ్ చేతులు కలిపినంత మాత్రాన ప్రజలు ఆ కూటమికి పట్టం కడతారన్న నమ్మకంలేదు. ఈ రోజు ప్రధాని నరేంద్రమోదీకి ఉండే జనాకర్షక శక్తితో పోలిస్తే ఈ రెండు పార్టీలు కలిసినంత మాత్రాన రాజకీయంగా లాభించి బీజేపీ తుక్కుగా ఓటమి చెందుతుందనుకుంటే వ్యూహాత్మక తప్పిదమే. గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా బీజేపీకి 80కు 73 సీట్లు రాకపోవచ్చు. కాని బీజేపీకి ఎక్కువ సీట్లుయూపీలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో ఉండే రాజకీయాలను చూసే పరిస్థితులను ప్రజలు చూస్తున్నారు.

హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీకి మధ్య హోరాహోరీ పోటీ ఉంటుంది. ఇక్కడ పొత్తులు ఉండవు. ముఖాముఖి పోటీలు ఉంటాయి. ఈ రాష్ట్రాల్లో దాదాపు 130సీట్లలో కాంగ్రెస్ స్వీప్ అయ్యే అవకాశాలులేవు. కాంగ్రెస్‌పార్టీ ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువ సీట్లు తెచ్చుకుంటే లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీ దక్కే అవకాశం ఉంది. ఈ రాష్ట్రాల్లో బీజేపీ ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదు. మొన్న జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లను కాంగ్రెస్ తెచ్చుకుంటే బీజేపీ మెజార్టీకి అడ్డుకట్టవేసినట్లవుతుంది. ఈ రాష్ట్రాల్లో బీఎస్పీకి కొద్దిగా బలం ఉన్నా, ఆ పార్టీతో పొత్తుకు కాంగ్రెస్ అంగీకరించదు. కాంగ్రెస్ ఓట్లు బీఎస్పీకి బదలాయింపు కావు. మహారాష్ట్రలో మాత్రం ఎన్సీపీ, కాంగ్రెస్ పొత్తు గట్టిదే. కాని ఇక్కడ బీజేపీ ఇటీవల కాలంలో బలమైన శక్తిగా అవతరించింది. శివసేన అప్పుడప్పుడు అసంతృప్తి వెళ్లగక్కినా, బీజేపీకి దూరంగా జరగదు. ఇదే జరిగితే, శివసేనకు భంగపాటు తప్పదనే విషయం ఆ పార్టీ నేతలకే తెలుసు.

తూర్పు భారతంలోకి అడుగుపెడితే ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్, ఒడిశా రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించినా, ఒకటి రెండు సీట్లు గెలవచ్చు. తృణమూల్ కాంగ్రెస్‌కు, వామపక్షాలు, బీజేపీకి మధ్య ముక్కోణపు పోటీ జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తన ఉనికిని కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. ఒడిశాలో అధికారంలో ఉన్న బీజేడీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య పోటీ హోరాహోరీగా ఉంటుంది. కాంగ్రెస్ ఇక్కడ మూడవ స్థానంలో ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన ప్రాభవాన్ని కోల్పోయింది.

దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రంలో టీఆర్‌ఎస్ తాజా ఎన్నికల్లో తన శక్తిని చాటింది. లోక్‌సభ ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఇక్కడ సంస్థాగతంగా బలంగా ఉన్నా సరైన నాయకత్వం లేకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వైఫల్యం, టీడీపీతో పొత్తు వికటించడంతో చతికిలపడింది. ఈ తప్పును సరిచేసుకునే ప్రయత్నం చేస్తుందో లేదో చూడాలి. బీజేపీ ఉనికి నామమాత్రమే.

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. రాజకీయంగా బద్ధశత్రువైన కాంగ్రెస్‌ను సరైన కారణం లేకుండా చంద్రబాబు అక్కున చేర్చుకునే ప్రయత్నం వల్ల ఏమి జరిగిందో తెలంగాణ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ వేచి చూసే ధోరణిని అవలంభిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. 2019 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల తర్వాత ఆవిష్కృతం కానున్న రాజకీయ చిత్రపటం తర్వాత ఆలోచించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని విశ్లేషకులంటున్నారు. టీడీపీతో పొత్తు కాంగ్రెస్‌కు చేటు. ఇక్కడ రెండు వాదనలు ఉన్నాయి. 1. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా గెలవని పక్షంలో, ఆ మేరకు రాష్ట్ర రాజకీయాల్లో ఏర్పడే శూన్యతను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి మంచి అవకాశం వస్తుంది. కానీ టీడీపీతో కాంగ్రెస్ పొత్తు ఉండరాదు. వైకాపాకు తరలివెళ్లిన నేతలు మరో ఐదేళ్ల పాటు వేచి ఉండే పరిస్థితి ఉండదు. ఒక ప్రాంతీయ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి వరుసగా పదేళ్ల పాటు అధికారంలేకుండా మనుగడ సాగించలేదు. అందుకే టీడీపీతో పొత్తుకు కాంగ్రెస్ దూరంగా ఉంటే మంచిది. 2. కాంగ్రెస్‌కు వాస్తవానికి ఇపుడు క్యాడర్, నేతలు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఓటు బ్యాంకు వైకాపాకు చేరింది. కాంగ్రెస్‌కు మహా అంటే మూడు శాతం లోపు ఓటు బ్యాంకు నికరంగా ఉండవచ్చు. వీరంతా టీడీపీకి బద్ధ వ్యతిరేకులు. పై స్థాయిలో చంద్రబాబు, రాహుల్ చేతులు కలిపినా దిగువ స్థాయిలో ఓట్లు బదలాయింపు జరగదు. ఒక వేళ కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నా, టీడీపీ గెలవని పక్షంలో, కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాజకీయ చిత్రపటం నుంచి అదృశ్యమైనట్లే.

ఏపిలో వైకాపా, టీడీపీలో ఎవరు గెలిచినా కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీకి మద్దతు ఇవ్వక తప్పదు. ఈ పార్టీలకు చెప్పుకునేందుకు తగిన రాజకీయ సిద్ధాంతాలేమీ లేవు. బలమైన సామాజిక వర్గాల మధ్య పోరుకు ప్రాతినిధ్యం వహించే పార్టీలకు సిద్ధాంత నిబద్ధత ఏమీ ఉండదు. వైకాపా లేదా టీడీపీలు ఏదో వంక చూసుకుని రాష్ట్రాభివృద్ధి అజెండా పేరుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీకి మద్దతు ఇస్తాయనడంలో సందేహం లేదు. కాని కాంగ్రెస్ ఇప్పటికే టీడీపీ వలలో చిక్కుకుంది. ఆంధ్రాలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని చంద్రబాబు సంకేతాలు ఇచ్చినా ఆ మేరకు నష్టం జరిగిపోయింది.


తమిళనాడులో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ చేరుతుంది. ఇప్పటికే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. తమిళనాడులో కమల్‌హాసన్, రజనీకాంత్‌లు కొత్త పార్టీలు పెట్టారు. ఇక్కడ బీజేపీ బలం అంతంతమాత్రమే. కన్యాకుమారిలో గత ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. ఇక్కడ కూడా ఎవరు గెలిచినా అభివృద్ధి పేరుతోనో, తమ పదవుల కోసమే కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీకి మద్దతు ఇస్తారు. ఆంధ్ర, తమిళనాడు రాజకీయాలకు పెద్దగా తేడా ఏమీ లేదు. కేరళలో ఈ సారి సీపీఎం పార్టీ గడ్డు పరిస్థితి ఎదుర్కొనక తప్పదు. శబరిమల వివాదం వల్ల కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ సీట్లు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. బీజేపీ బోణీ కొట్టేందుకు ప్రయత్నం చేస్తోంది. కర్నాటకలో రాజకీయ అస్థిరత్వం నెలకొంది. కాంగ్రెస్ కూటమి, బీజేపీ కూటమి చెరి సగం లోక్‌సభ సీట్లను గెలుచుకునే అవకాశాలున్నాయి. దక్షిణ భారతంతో కర్నాటకలోనే బీజేపీకి బలం ఉంది. తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మొత్తం మీద వస్తే ఒకటి లేదా రెండు సీట్లు రావచ్చు. లేకపోతే అవి కూడా రాకపోవచ్చు. దక్షిణాదిన మొత్తం 129 వరకు ఉన్న లోక్‌సభ సీట్లలో ప్రాంతీయ పార్టీలకే 100కు పైగా సీట్లు వస్తాయి.

వచ్చే ఎన్నికల్లో ఏ విధంగా చూసినా బీజేపీకి ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. కర్నాటకలో కుమారస్వామి ప్రభుత్వం ఏర్పాటు సమయంలో వేదికపైకి వచ్చిన ప్రతిపక్ష పార్టీల నేతలు జారుకుంటున్నారు. హిందీబెల్ట్‌లోని మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అపూర్వ విజయాలను సాధించి బీజేపీని చావుదెబ్బ కొట్టిన హీరో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ. ఈ విషయంలో రాహుల్ గాంధీని అభినందించి తీరాలి. కాని కాంగ్రెస్ బలపడితే తమ ఉనికికి ప్రమాదమని ప్రాంతీయ పార్టీలు భయపడుతాయి. అందుకే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ మధ్య కాలంలో కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌తో కలిసేదీ లేదని ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణంలో బిజీబిజీగా ఉంటున్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఇంకా ఆవిర్భవించకపోయినా, యూపీలో జరిగిందేమిటి? ఎస్పీ, బీఎస్పీ పొత్తు ఖరారైంది. ఒడిశాలో బీజేడీ, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కూడా కేసీఆర్ దారికి వచ్చేశాయి. మాయావతి లక్నోలో చేసిన ప్రకటన ప్రధానమైంది. 'పొత్తుల గురించి వేలంవెర్రిగా రాజకీయ పార్టీలు తాపత్రయపడరాదు. పొత్తు పై స్థాయిలో అగ్రనేతల మధ్య ఖరారు కావచ్చు. కాని దిగువ స్థాయిలో పార్టీ క్యాడర్, ప్రజలు ఈ పొత్తును ఆమోదించాలి. ప్రత్యర్థి పార్టీలు పొత్తు కుదుర్చుకుంటే కెమిస్ట్రీ ఉండాలి. అప్పుడే బ్యాలెట్‌బాక్స్ పండుతుంది' అని అన్నారు. మాయావతి చెప్పినట్లు టీడీపీ అధినేత చంద్రబాబు పొత్తుల విషయంలో ఆచితూచి అడుగువేయడం మంచిది.

-కే విజయశైలేంద్ర

9849998097

అఖిలేష్ - మాయాజాలం!



వీరాజీయం

సెల్: 92900 99512

మాయావతి పుట్టినరోజు అంటే అభిమానులూ భక్తులూ ఆమెకి పూలదండలు కాదు- రూపాయల దండలు వేస్తారన్నది లోకోక్తి. దృఢమయిన ఆమె మెడలు విరిగేలాగ కరెన్సీ నోట్ల గజమాలలు ధరిస్తేనే ఆమెకు ఆనందంగా వుంటుంది. ఏనుగు ఆమె పార్టీ ఎన్నికల గుర్తు. కానీ యీసారి ఆమె అరవై మూడో జన్మదినోత్సవానికి భారీ ''కేకు'' ఒకటి తెప్పిస్తే- దానిని ఆమె 'యిలా' కోసి, అందరికీ తలో ముక్కా పంచిపెట్టే లోపల- బసపా కార్యకర్తలు 'దాడి'- ఐ మీన్, కేకుమీద చేశారు. మొత్తం కేకుని ఆరగించేశారు.

ఒకనాడు మకుటం లేని మహారాణీలాగ, అతి కోలాహలంగా జన్మదినోత్సవాలు జరుపుకున్న బహుజనుల ఆరాధ్య దేవత యీసారి జన్మదినోత్సవానికి ''సైకిల్''వైపు ఆశగా చూస్తున్న ''ఏనుగు''లాగ కనబడింది. ఆమెను అభినందించడానికి- కార్యకర్తలు, భక్తులు అనుయాయులకన్నా ముందు- నిన్నటిదాకా బద్ధ శత్రువు అఖిలేష్ యాదవ్ దుశ్శాలువా, పుష్పమాలలు పట్టుకుని, తన సైకిల్‌ను- ''అమ్మా! యిదుగో నా సైకిలు'. ఎన్నికల్లో నీ 'ఏనుగు' ముందు అయినా, లేదా వెనుక నైనాసరే, పరిగెత్తిస్తాను''- అంటూ, అమిత వాత్సల్యాను రాగాలతో శుభాకాంక్షలు చెప్పాడు.

అదే ఎన్నికల యుద్ధ నీతి. నిన్నటి శత్రువులు నేడు పరమ మిత్రులైపోతారు.

పెద్దదీ, కీలకమైనదీ అయిన ఉత్తరప్రదేశ్‌లో ఒక కూటమి ఏర్పడితే, అది కాంగ్రెస్ ''హస్తా''న్ని అందుకుని ఏర్పడుతుంది- అనుకున్న పరిశీలకులు- 2019 కొత్త సంవత్సరం మొదట్లో 'ఖంగు' తిన్నారు. మాయావతి, అఖిలేష్‌లు యిద్దరూ యు.పి.లో మాజీ ముఖ్యమంత్రులే. అలాగే మాయావతి పార్టీ, అఖిలేష్ యాదవుల పార్టీలు, లోగడ- రొటేషన్ మీద రాష్ట్రాన్ని ఏలుకున్న సంగతి, కొందరికయినా జ్ఞాపకం వుండే వుంటుంది.

ఇటీవల కాంగ్రెస్ హస్తాన్ని- 'అభయ హస్తం'గా నమ్ముకున్న అఖిలేష్ యాదవ్ చిత్తుగా వోడిపోయి 'మాజీ'గా నడిరోడ్డున పడటంతో- మరోసారి రాహుల్ గాంధీకి 'జై'-అనడం కన్నా- దళిత వోట్ల 'ఖజానా' అయిన శ్రీమతి మాయావతిని ఆశ్రయించడమే 'బెటరు' అనుకున్నాడు.

అమితోత్సాహంతో అతను మాయావతిని సత్కరిస్తున్న దృశ్యాలు టి.వి. తెరల మీద చూసిన వాళ్లకి ఆశ్చర్యమేసింది. ''వీళ్లేనా ఎదుటబడ్డా, లేక దూరంగావున్నా- పరస్పరం నిప్పులు చెరుక్కున్నదీ?'' అని ముక్కున వ్రేలు వేసుకున్నారు.

ఈ మాయా, అఖిలేష్‌ల ఒప్పందం యిక్కడ జరుగుతున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ''దుబాయ్''లో వున్నాడు. ఐతే మాయావతి గానీ, అఖిలేష్ గానీ ప్రధానమంత్రి కుర్చీ గురించి మాట్లాడలేదు. ఎన్నికలలో పార్లమెంటుకు చెరి 38 సీట్ల చొప్పున పంచుకుని పోటీ చెయ్యాలనుకుంటున్నామని మాత్రం ప్రకటించారు. కాకపోతే, యీ యిద్దరు నాయకులూ యీసారి - ప్రధానమంత్రి ఉత్తరప్రదేశ్ నుంచే వస్తాడని- గంభీరంగా వేర్వేరు సందర్భాలలో ఉద్ఘాటించారు.

దేశంలో, 80 పార్లమెంట్ స్థానాలున్న యు.పి.లో యీ- స.పా; బసపా, పార్టీలు కేవలం 78 స్థానాలకే ఎందుకు పోటీ చేస్తున్నట్లు? అంటే రెండు స్థానాలని కాంగ్రెస్‌కి మీదుగట్టారన్న మాట. ఆ రెండు స్థానాలూ కాంగ్రెస్ పార్టీయొక్క మాజీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీకీ, ప్రస్తుత అధ్యక్షుడు రాహుల్‌గాంధీకీ చెందినవి. ''ఈ యిద్దర్నీ నేరుగా భాజపాతో ముఖాముఖీ, పోరాటానికే వదిలేస్తున్నాం''- అన్నారు. బహుశా యీ అంశమే - దుబాయ్‌లో పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీగారికి కొంత 'ఊరట'నిచ్చి వుంటుంది. ''ఆ యిద్దరు నాయకుల పట్ల నాకు అపారమైన గౌరవం వుంది'' అంటూ తన స్పందనని వ్యక్తం చేశాడు.

సరే! మేం మా యావత్ శక్తినీ ధారపోసి ఎన్నికలలో పోరాడుతాం. కాకపోతే ఒక 'ఊరట' వున్నది-' అంటూ అంగీకరించాడు రాహుల్‌జీ. ''ఆ ఇద్దరి పొత్తూ- మోదీ పార్టీని 'యింటికి' పంపడానికే కనుక- తనకేమీ వ్యాకులతని కలిగించటం లేదన్నాడు. ఇటీవల అయిదు రాష్ట్రాలలో ముక్కుబజ్జీ చేసుకున్న భాజపా యీసారి ఢిల్లీనుంచి కూడా లేచిపోడం ముఖ్యం. తమ లక్ష్యంకూడా అదే కనుక మాయావతి కూటమి విషయంలో అంతగా స్పందించనని, గడుసుగా అన్నాడు- కాంగ్రెస్ పార్టీ అధినేత.

ఎన్నికలలో, ఏ సమయంలో ఏం జరిగినా జరగవచ్చును. ఈ ఘటబంధనాలు, ఘటశ్రాద్ధాలు పెట్టుకోడం ఎంతసేపు? మాయావతి కూడా మొన్నటి భాజపా ఘోర పరాజయాన్ని ఎత్తిచూపింది.

'దీంతో పాటు కాంగ్రెస్ పార్టీని కూడా జనాలు తిరస్కరించాయి' అంటూ ఆమె కాంగ్రెస్ పార్టీ మీద కత్తులు నూరింది.

చిత్రమేమిటీ అంటే, దేశంలో యీసారి రకరకాల 'ఫ్రంటులు' పడగలెత్తడానికి బుసలుకొడుతున్నాయి. కొత్తకొత్త పేర్లతో ఫెడరల్ ఫ్రంట్, కాంగ్రెస్ భాజపేతర ఫ్రంట్, కాంగ్రెసేతర ఫ్రంటు- యిలాగ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఇదంతా 2019 ఎన్నికలలో మోదీగారిని ఓడించడం అన్న ఉమ్మడి లక్ష్యంతో వున్నాయి కనుక కమ్యూనిస్టులు జాగ్రత్తగా తమ పావుల్ని కదుపుతున్నారు.

దక్షిణాదిన ప్రాంతీయ పార్టీల మధ్య పొత్తుకుదరకపోడం ముఖ్యం. ఈ ప్రాంతీయ పార్టీల పరస్పర విరోధం భాజపాకి అందివచ్చే అవకాశం కనుక అమిత్‌షా, మోదీజీలు ఆ దిశలో పావులు కదుపుతున్నారు. కాని శ్రీమాన్ మోదీగారు కూడా కాస్త విచలితుడైనట్లు కనబడుతోంది. తమ పార్టీ కూటమిలోకి కాం.పా. మొదలైన ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వచ్చి చేరితే, 'వెల్‌కమ్' -అంటూ ఆయన యిటీవల ప్రకటించడం అందరూ గమనించారు.

మూడు రకాల సెంటిమెంట్లున్నాయిప్పుడు. ఈ మూడూ- ఒకటి 'ట్రిపుల్ తల్లాక్', రెండు 'శబరిమలై' మూడు 'అయోధ్య'. వీటిని ఆయుధాలుగా వాడుకోడంలో ఎవరు ఎక్కువ చాకచక్యం చూపెడతారో వాళ్ల కూటమికి పరువుదక్కే ఛాన్సు మెరుగు అవుతుందని పొలిటికల్ పండిట్స్ అంటున్నారు.

కాలం ఆగదు. పొలిటికల్ పార్టీలకయినా అది ఆగదు ఒక్క క్షణమయినా. ఉత్తరప్రదేశ్ కూటమిలో మరి కొన్ని చిల్లర పార్టీలు చేరతామని ఉబలాటపడుతున్నాయి. ''పోయినసారి 80 స్థానాలకి 70 సీట్లు గెల్చింది కాబోలు భాజపా. మరి యీసారి ఆదిత్యనాథ్ యోగీగారి ధర్మమా అని ఆ పార్టీ వణుకుతోంది''- బాధగా అన్నాడో మోదీగారి అభిమాని.

ఇక్కడ తెలుగు రాష్ట్రాలలో కె.సి.ఆర్; కె.టి.ఆర్‌లు జాగ్రత్తగా పావులు కదుపుతున్నారు. జగన్, పవన్‌లు- కె.సి.ఆర్, కె.టి.ఆర్;ల మోజులో ఎంత పడతారు? అన్నది చంద్రబాబు గారి 'వర్రీ'. కాకపోతే ప్రస్తుతానికి తెలంగాణా నాయకులు మోదీనీ, చంద్రబాబునీ కూడా వోడించడమే 'లక్ష్యం'అన్నట్లు మాట్లాడుతున్నారు. ఏది ఏమైనా-

'ఇట్స్ టూ ఎర్లీ టు కామెంట్!'

కర్నాటకలో బీజేపీ చిచ్చు

❑ కాంగ్రెస్ సీనియర్ నేత ఖర్గే ధ్వజం ❑ ఎమ్మెల్యేల కొనుగోలుకు యత్నాలు

❑ కమలనాథుల కుట్రలు సాగవని హెచ్చరిక ❑ మా ప్రభుత్వానికి ఢోకా లేదు: కుమారస్వామి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ కర్నాటకలో కాంగ్రెస్ శాసన సభ్యులను గొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు కుట్ర చేస్తోందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

మల్లికార్జున ఖర్గే బుధవారం ఏఐసీసీలో విలేఖరులతో మాట్లాడుతూ బీజేపీ బలవంతగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని, తమ పార్టీ ఎమ్మెల్యేలకు డబ్బులు ఆశచూపుతున్నారని విమర్శించారు. డబ్బులకు లొంగకపోతే భయపెడుతున్నారని ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. ఐటీ, ఈడీ దాడులు చేయిస్తామని భయాందోళనలకు గురిచేస్తున్నారని బీజేపీపై ఆయన ధ్వజమెత్తారు. అవసరమైతే సీబీఐని ప్రయోగించి అరెస్టులు చేయిస్తామని బెదిరిస్తున్నట్టు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా ఫలించవని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏమీ చేయలేవని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు తమ శాసన సభ్యులను ఢిల్లీ సమీపంలోని గుర్గావ్‌కు స్టార్ హోటల్‌లో ఎందుకు బంధించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్రాంతికి రాజకీయ విప్లవం వస్తుందని చెప్పిన కమలనాథులు కాంగ్రెస్ శాసన సభ్యులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి విఫలమైందని ఖర్గే ఎద్దేవా చేశారు. శాసన సభ్యులను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నించటం ఇది మొదటిసారి కాదని, యెడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడూ కూడా ఇలా జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత తెలిపారు. 'కాంగ్రెస్ శాసన సభ్యులు పార్టీ ఫిరాయించటం లేదు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తున్నారు'అని ఆయన స్పష్టం చేశారు.



విలేఖరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్‌కు చెందిన పది మంది శాసన సభ్యులు తమ వద్ద ఉన్నారంటూ బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ సభ్యుల్లో గందరగోళం సృష్టించేందుకు ఇలాంటి అవాస్తవ ప్రకటనలు చేస్తున్నారని ఖర్గే ధ్వజమెత్తారు. ఇలాంటి కుట్రలకు భయపడవలసిన అవసరం లేదని ముఖ్యమంత్రి కుమారస్వామి, కర్నాటక ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తనతో చెప్పారన్నారు. కాంగ్రెస్, జేడీఎస్ పరస్పరం చర్చించుకుంటూ సమర్థవంతం పాలన అందిస్తున్నాయని అన్నారు.

అసలు బీజేపీ తమ శాసన సభ్యులను గుర్గావ్‌లో ఎందుకు దాచాల్సి వచ్చిందీ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసే కుట్రలను మానుకోవాలని బీజేపీకి ఆయన సలహా ఇచ్చారు.

'కుతంత్రాలు బయటపెడతాం'

కర్నాటకలో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న బీజేపీ ఎత్తులు ఫలించవని ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. బీజేపీ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారన్న సీఎం త్వరలోనే వారి కుతంత్రాలు బయటపడతాయని తెలిపారు. కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం పటిష్టంగా ఉందని లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలూ కలిసే పోటీచేస్తాయని బుధవారం ఇక్కడ వెల్లడించారు. ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకున్నందున ప్రభుత్వం సంక్షోభంలో పడిపోతోందని మంగళవారం వార్తలు హల్‌చల్ చేశాయి.

అలాగే ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రధాని మోదీతో అత్యవసర భేటీ అవుతారన్న కథనాలు వెలువడ్డాయి. దీనిపై కుమారస్వామి మాట్లాడుతూ ' మా ప్రభుత్వానికి ఢోకాలేదు. చక్కగా పనిచేస్తోంది. కాంగ్రెస్ మంత్రులెవరూ రాజీనామా చేయడం లేదు'అని ఇక్కడ స్పష్టం చేశారు. ప్రధాని మోదీతో సమావేశం వార్తలను ఆయన ఖండించారు. కాంగ్రెస్ లేదా జేడీఎస్ మంత్రులు ఎవరూ రాజీనామా చేయరు అని ఆయన తెలిపారు. కార్నాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, గుర్గావ్‌లో ఎమ్మెల్యేలను బంధించి కుట్ర రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు.



రాబోయే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం న్యూఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద కవాతు రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు, అసోం రైఫిల్స్‌కు చెందిన మహిళా జవాన్లు

పశ్చిమబెంగాల్‌లో 20 నుంచి బీజేపీ మహార్యాలీలు

❑ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాక ❑ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్

కోల్‌కొతా, జనవరి 16: ఈ నెల 20 వ తేదీ నుంచ బీజేపీ పశ్చిమబెంగాల్‌లో మూడు రోజుల పాటు మహా ర్యాలీలను నిర్వహించనుంది. ఈ వివరాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ ప్రకటించారు.

రాష్ట్రంలో బీజేపీ బహిరంగ సభలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని సుప్రీంకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. కాగా ఈ నెల 19వ తేదీన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మహా ర్యాలీని నిర్వహించనున్నారు. ఈ ర్యాలీకి దేశంలోని వివిధ పార్టీల నేతలను ఆహ్వానించారు. లక్షల సంఖ్యలో ప్రజలను సమీకరించాలని తృణమూల్ కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ మాట్లాడుతూ, మాల్డాలో 20వ తేదీన మొదటి ర్యాలీని అమిత్ షా ప్రారంభిస్తారు. 21వ తేదీన బ్రిబూమ్, జాగ్రామ్, 22వ తేదీన కృష్ణనగర్ పట్టణంలో, జయానగర్ ర్యాలీల్లో అమిత్‌షా పాల్గొంటారు. త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ విస్తరిస్తోంది. వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీతో పోల్చితే తన బలాన్ని పెంచుకోవాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. బీజేపీ రథయాత్రను చేపట్టాలని ముందు నిర్ణయించింది. కాని న్యాయపరమైన చిక్కుల్లో పడింది. దీంతో కోర్టు ఆదేశం మేరకు ర్యాలీలను నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమైంది. రథయాత్రను తప్పనిసరిగా చేపట్టి తీరుతామని, ఈ అంశంపై వెనక్కు వెళ్లే ప్రసక్తిలేదన్నారు. 40 రోజుల రథయాత్రను 20 రోజులకు తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు బీజేపీ నేతలు చెప్పారు. ముషీరాబాద్ జిల్లా నుంచి రథయాత్రను ప్రారంభిస్తామన్నారు.

ఎన్డీఏలో ఏ పార్టీ చేరదు

❑ స్పష్టం చేసిన తమిళనాడు కాంగ్రెస్

చెన్నై, జనవరి 16: ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతో చేతులు కలపడానికి ఏ పార్టీ సిద్ధంగా లేదని తమిళనాడు కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా తాము ఏ పార్టీతోనైనా కలవడానికి సిద్ధమేనని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సు తిరునవుక్కరసర్ మాట్లాడుతూ 'మన ప్రధాని నరేంద్ర మోదీ విశాల హృదయంతో అన్ని పార్టీలకు ఆహ్వానం పలికారు.. కాని ఎన్డీఏలోకి వెళ్లడానికి ఒక్క పార్టీ కూడా ఇష్టంగా లేదు. ఈ పరిస్థితి ఒక్క తమిళనాడులోనే కాదు దేశమంతటా ఉంది' అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఎన్డీఏ నుంచి వివిధ పార్టీలు బయటకు వస్తున్నాయే తప్ప, అందులోకి ఎవరూ వెళ్లరని పేర్కొంటూ ఆర్ఎల్ఎస్‌పి నేత ఉపేంద్ర కుషావహ, అస్సాం గణపరిషత్ పార్టీ ఎన్డీఏ నుంచి బయటకు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచారం, అభ్యర్థుల ఎంపిక తదితర విషయాలపై చర్చించడానికి ఏర్పాటు చేసే కమిటీలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీకి పంపుతున్నట్టు ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేతో పొత్తు వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఎంపికై, బుధవారం బాధ్యతలు స్వీకరించిన మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను గజ మాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఎగ్జిమ్ బ్యాంకుకు రూ.6వేల కోట్ల కేంద్ర సాయం

❑ రెండేళ్లలో దశలవారీగా అందజేత

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రభుత్వ రంగ బ్యాంకు 'ఎగ్జిమ్ బ్యాంకు'కు ఆర్థికంగా బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను రెండేళ్ల కాలంలో 6వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ఈ సాయం అందితే ఈ బ్యాంకు మూలధనం మొత్తం 20వేల కోట్ల రూపాయలకు చేరుతుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.4.500 కోట్లు, 2019-20లో రూ.1,500 కోట్ల వంతున ఈ సాయం అందుతుందని రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ వివరించారు. కేబినెట్ సమావేశం అనంతరం బుధవారం నాడిక్కడ ఆయన విలేఖరులతో మాట్లాడారు. తొలుత ఎగ్జిమ్ బ్యాంకు ఎగుమతులకు రుణాలివ్వడం, అంతర్జాతీయ ఎగుమతుల రుణ ఏజెన్సీలతో సంబంధాలు కలిగివుండానికే పరిమితమైంది. ఆ తర్వాత పరిశ్రమలు, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ ద్వారా అధికోత్పత్తికి తోడ్పాటునందించే వరకు విస్తరించింది. సాంకేతికతను దిగుమతి చేసుకోవడం, వస్తూత్పత్తిని, ఎగుమతులను, మార్కెటింగ్ వ్యవహారాలతోబాటు అంతర్జాతీయంగా ప్రీ షిప్‌మెంట్, పోస్టు షిప్‌మెంట్‌కు సంబంధించిన పెట్టుబడులకు చేయూతనిచ్చే వరకు ఈ బ్యాంకు విస్తరించింది.

సమ్మె విరమించిన 'బెస్ట్' కార్మికులు

❑ లక్షలాది మంది ప్రయాణికులకు ఊరట

ముంబయి, జనవరి 16: గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న బ్రిహాన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (బీఈఎస్‌టీ)కి చెందిన దాదాపు 30వేల మంది కార్మికులు ఎట్టకేలకు తమ ఆందోళనను విరమించారు. దీంతో లక్షలాది మంది ప్రయాణికులకు ఎంతో ఊరట లభించింది. జీతాలు పెంచాలని, జూనియర్ స్థాయి ఉద్యోగులకు నూతన వేతన స్కేలు అమలు చేయాలని అంటూ వివిధ డిమాండ్ల సాధన కోసం 'బెస్ట్' వర్కర్లు ఈనెల 8 నుంచి సమ్మె చేస్తున్నారు. 'బెస్ట్' యాజమాన్యంతో జరిపిన చర్చల్లో కార్మికుల జీతాలు పెంచేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో తమ ఆందోళనను విరమిస్తున్నట్టు 'బెస్ట్' వర్కర్స్ యూనియన్ నాయకుడు శశాంక్ రావు తెలిపారు. ముంబయిలో 'బెస్ట్' తరపున నడుపుతున్న 3200 బస్సు సర్వీసులు థానే జిల్లా, నవీ ముంబయి సహా వివిధ ప్రాంతాల్లో లోకల్ ట్రైన్‌ల తర్వాత 80 లక్షలకు పైగా ప్రజలను చేరవేస్తున్నాయి.

రూ.22,594 కోట్లతో నుమలిగర్ రిఫైనరీ విస్తరణ

❑ కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, జనవరి 16: అస్సాంలోని నుమలిగర్ రిఫైనరీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బృహత్ ప్రాజెక్టు ఖర్చు అంచనా రూ.22,594 కోట్లు. ప్రస్తుతం ఈ రిఫైనరీ సామర్థ్యం మూడు మిలియన్ మెట్రిక్ టన్నులుకాగా దీన్ని యేడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే విధంగా ఈ ప్రాజెక్టు ప్రణాళిక రూపొందింది. మొత్తం 48 నెలల కాలవ్యవధిలో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాల్సివుంది. ప్రభుత్వ ఆమోదానికి సంబంధించిన ఆదేశాలు అందిన నాటి నుంచి ఈ నిర్మాణ కాలవ్యవధి అమలులోకి వస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ విలేఖరులకు తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన గల కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ మేరకు ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసిందని గోయెల్ తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పరదీప్ నుంచి నుమలిగర్ వరకు ఓ ముడిచమురు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుంది. అలాగే నుమిలిగర్ నుంచి సిలిగురి వరకు ప్రాడెక్టు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుందని మంత్రి వివరించారు.

డీసీబీ నికర లాభాల్లో 51 శాతం వృద్ధి

❑ మూడో త్రైమాసికంలో రూ.86 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రైవేట్ సెక్టార్‌లోని డీసీబీ బ్యాంకు మూడో త్రైమాసికంలో మంచి ఫలితాలను సాధించింది. గత ఏడాది డిసెంబర్ 31తో పూర్తయ్యే మూడో త్రైమాసికంలో 6.1 కోట్ల స్థూలలాభంతో 50.8 శాతం అధిక లాభాలను ఆర్జించింది. రుణాలపై గత త్రైమాసికంలో 685.72 కోట్ల ఆదాయం రాగా, ఈ త్రైమాసికంలో అది 871.78 కోట్లకు చేరుకుందని బ్యాంకు ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే రుణాలపై స్థూల నిరర్ధక ఆస్తులు 1.89 శాతం నుంచి 1.92 శాతానికి పెరిగాయి. అలాగే మొత్తం ఆస్తులపై ఎన్‌పీఏ శాతం 0.89 నుంచి 0.71 శాతానికి తగ్గినట్టు బ్యాంకు వర్గాలు తెలిపాయి.

ఓటింగ్‌పై అవగాహన


❑ ఢిల్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మనీకా బాత్రా

న్యూఢిల్లీ, జనవరి 16: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత మనీకా బాత్రా ఓటింగ్‌పై ఢిల్లీలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన శిబిరం (వీఏఎఫ్)ను ఢిల్లీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈఓ) రణ్‌భీర్ సింగ్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) వినియోగంతోపాటు వీవీపాట్‌ల వినియోగంపై ఇటీవల అవగాహన కార్యక్రమాలను ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో కియోస్కలను కూడా ఏర్పాటు చేశామని, బుధవారం 300 ప్రాంతాల్లో ఫోరమ్ ఆధ్వర్యంలో ప్రారంభించామని ఆయన తెలిపారు. బుధవారం ఢిల్లీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫోరమ్‌ను ప్రారంభించిన తర్వాత సీఈఓ రణ్‌భీర్ సింగ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌పై మరింత ప్రచారం చేసేందుకు వీలుగా భారత టేబుల్ టెన్నిస్ స్టార్ క్రీడాకారిణి మనీకా బాత్రాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఆహ్వానించామని, ఆమె సేవలను వినియోగించుకోనున్నట్టు ఆయన తెలిపారు. త్వరలో ఓటింగ్‌పై ప్రజలను అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన వివిధ పోస్టర్లు, ఆడియో విజువల్ కార్యక్రమాల్లో మనీకా బాత్రా సేవలను విరివిగా ఉపయోగించుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా ఇదే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేసేందుకు వీలుగా ప్రముఖ రెజ్లర్, ఒలింపిక్ విజేత సుశీల్ కుమార్ సేవలను కూడా వినియోగించుకోనున్నామని సీఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. అలాగే యువ క్రికెటర్ రిషబ్ పంత్ సేవలను కూడా పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించామని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

గ్లోబల్ థింకర్స్ జాబితాలో ముఖేష్ అంబానీ

న్యూఢిల్లీ, జనవరి 16: భారత్‌లోనే అత్యంత సంపన్నుడైన ముఖేష్ అంబానీకి అరుదైన గౌరవం దక్కింది. గ్లోబల్ థింకర్స్(ప్రపంచ ఆలోచనాపరుల) జాబితాలో స్థానం లభించింది. ప్రతిష్టాత్మకమైన జాబితాలో అంబానీతోపాటు అలీబాబా ఫౌండర్ జాక్‌మా, అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్, ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టిన్ లగార్డేలున్నారు. గ్లోబల్ థింకర్స్ 2019 జాబితాను సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మొత్తం 100 మంది పేర్లు జాబితాలో చోటుచేసుకున్నాయి. విదేశాంగ విధానానికి సంబంధించి ప్రపంచ ఆలోచనాపరుల పూర్తి జాబితాను ఈనెల 22న విడుదల చేయనున్నట్టు వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ముఖేష్ అంబానీ ఆసియా సంపన్నుల జాబితాలో మొదటి స్థానంలో ఉన్నారు. 2018లో 44.3 బిలియన్ డాలర్ల ఆస్తులతో జాక్‌మాను అధిగమించారు. చమురు, గ్యాస్, రిటైల్ రంగంలో మకుటంలేని మహారాజుగా వెలుగొందుతున్నారు. అలాగే జియో వెంచర్ ప్రవేశపెట్టి దేశంలోని టెలికాం రంగంపై అధిపత్యాన్ని చాటుకున్నారు. టెలికాం మార్కెట్‌లో జియో అగ్రస్థానంలో నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్‌కు ముఖేష్ అంబానీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. జియో లాంచింగ్ సంచనాలు సృష్టించింది. సెల్యూలర్ డేటా, వాయిస్ మొదట ఆర్నెల్ల మాటు ఉచితంగా ప్రకటించారు. కనీసం వంద మిలియన్ల మంది ఖాతాదారులను ఆకట్టుకున్నారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ విప్లవాన్ని తనకు అనుకూలంగా తిప్పుకోవడంలో జియో విజయవంతమైందని వెబ్‌సైట్ వెల్లడించింది. డిజిటల్ ఎయిర్‌వేవ్స్‌ను లైఫ్‌స్టయిల్ ప్రాడక్ట్సుకు విక్రయించడం ద్వారా గూగుల్, ఫెస్‌బుక్‌కు సవాల్ విసరనున్నారు. మొత్తం 10 రంగాల్లో పది మందిని జాబితా కోసం ఎంపిక చేస్తారు.



బ్రిటన్ చరిత్రలో అధికార పార్టీకి పరాభవం

❑ బ్రెగ్జిట్ నుంచి వైదొలగే ప్రతిపాదనను తిప్పిగొట్టిన హౌస్ ఆఫ్ కామన్స్

❑ వ్యతిరేకంగా 432 ఓట్లు, అనుకూలంగా 202 ఓట్లు ❑ ఖంగుతిన్న ప్రధాని థెరిసా మే

లండన్, జనవరి 16: యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలన్న బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసా మే ప్రతిపాదన ఒప్పందాన్ని హౌస్ ఆఫ్ కామన్స్ తిప్పిగొట్టింది. బ్రిటన్ చరిత్రలో తొలిసారిగా అవమానకరరీతిలో ప్రధాని మే ప్రతిపాదనను 432 మంది సభ్యులు తిరస్కరించగా, అనుకూలంగా 202 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రధాని థెరిసా మే ప్రభుత్వంపై అవిశ్వాసతీర్మానం పెట్టేందుకు మార్గం సుగమమైంది. ఆధునిక చరిత్రలో తొలిసారిగా అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వానికి ఈ స్థాయిలో పరాభవం ఎదురుకాలేదు. బ్రెగ్జిట్ డీల్‌ను హౌస్ ఆఫ్ కామన్స్ వ్యతిరేకించడంతో, లేబర్ పార్టీ నేత జెర్మీ కార్బీన్ విశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ప్రతిపక్ష నేతలు బలపరిచారు. బుధవారం తర్వాత ఈ అంశంపై ఓటింగ్ జరగనుంది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగాలన్న నిర్ణయాన్ని బ్రెగ్జిట్‌గా నామకరణం చేసిన విషయం విదితమే. బ్రెగ్జిట్ డీల్ ఓటమి చెందడంతో ప్రధాని థెరిసా మే ప్రభుత్వం ఖంగుతింది. ఈ ఓటమిని పెద్ద విపత్తుగా లేబర్ పార్టీ నేత జెర్మీ కార్బీన్ అభివర్ణించారు. బ్రెగ్జిట్ డీల్‌కు ఓటమి ఎదురైందని, ఇదొక పనికిమాలిన నిర్లక్ష్యంతో కూడిన ప్రతిపాదన అని ఆయన అన్నారు. యూరోపియన్ యూనియన్‌లో 28 దేశాలు ఉన్నాయి. ఈ డీల్‌ను హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదించినట్లయితే మార్చి 29వ తేదీన బ్రిటన్ వైదొలగాల్సి ఉండేది. 1973 మార్చి 29వ తేదీన యూరోపియన్ యూనియన్‌లో బ్రిటన్ చేరింది. గత రెండేళ్లుగా బ్రెగ్జిట్ డీల్ ఆమోదం కోసం ప్రధాని థెరిసా మే అన్ని ప్రయత్నాలు చేశారు. ఒక వైపు బ్రెగ్జిట్ డీల్ నుంచి వైదొలగడం, మరోవైపు బ్రిటన్ ఆర్థికాభివృద్ధి కోసం ప్రణాళిక, రాజకీయ తీర్మానం చేయాలని ప్రధాని థెరిసా మే భావించారు. పార్లమెంటులో అన్ని పార్టీలు ప్రధాని ప్రతిపాదనను తిప్పిగొట్టారు. గత డిసెంబర్‌లో తన సొంత పార్టీ నుంచి అవిశ్వాసతీర్మానం ఎదురుకాగా, ఆమె నెగ్గారు. ప్రత్యామ్నాయ ప్రణాళికతో కామన్స్ సభకు వచ్చే వారం ప్రధాని థెరిసా మే వస్తారని ప్రధాని కార్యాలయ వర్గాలు తెలిపాయి. హౌస్ చెప్పిన మాటను ప్రభుత్వం విన్నదని అధికారులు చెప్పారు. ప్రస్తుతం భవిష్యత్తుపై అన్ని పార్టీలతో ఆమె చర్చించనున్నారని చెప్పారు. కాగా విశ్వాసతీర్మానం పరీక్షలో థెరిసా మే గట్టెక్కవచ్చని బ్రిటన్ మీడియా అంచనావేస్తోంది.



బ్రెగ్జిట్‌పై బ్రిటన్ ప్రధాని థెరిసా మే వైఖరికి నిరసనగా లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్ వద్ద 'బ్రెగ్జిట్ వ్యతిరేక' దిష్టిబొమ్మను ప్రదర్శిస్తున్న నిరసనకారులు



'మేఘ్ బిహూ' పండుగను పురస్కరించుకొని కాంరప్‌లో బుధవారం సంప్రదాయ దుస్తుల్లో నృత్యం చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు



రాజస్థాన్ స్పీకర్‌గా సీపీ జోషి ఏకగ్రీవం

జైపూర్, జనవరి 16: రాజస్థాన్ రాష్ట్ర అసెంబ్లీ 15వ స్పీకర్‌గా కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశానుసారం జోషి పేరును నాద్‌ద్వారకు చెందిన నేత ప్రతిపాదించారు. మూజువాణి ఓటు ద్వారా ఆయన ఎన్నికకు సభ్యులు సమ్మతి తెలపడంతో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తున్న గులాబ్ చందర్ కతారియా నుంచి సీపీ జోషి (68) స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 15వ లోక్‌సభలో బిల్వారా నుంచి ఎంపీగా ఎన్నికైన జోషి 2009 నుంచి 2013 వరకు రవాణా, రహదారుల శాఖకు మంత్రిగా చేశారు. అలాగే పార్టీ చీఫ్ విప్‌గా ఎమ్మెల్యే మహేష్ జోషిని, మహేంద్ర చౌదరిని డిప్యూటీ చీఫ్ విప్‌గా నియమించారు. ఈ సందర్భంగా స్పీకర్ జోషికి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అభినందనలు తెలిపారు. స్వపక్ష, విపక్షాలను కలుపుకుని సభను సజావుగా నడిపించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా స్పీకర్ జోషి తెలిపారు. మొదటిసారి సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే దానిని ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సభ్యులు సభలో తమ అభిప్రాయాలు, విమర్శలను ఎలాంటి సంకోచం లేకుండా వ్యక్తపర్చవచ్చునని ఆయన అన్నారు.

మళ్లీ తప్పించుకున్న ఆయుధాల స్మగ్లర్

ముజఫర్‌నగర్ (యూపీ), జనవరి 16: పేరుమోసిన ఆయుధాల స్మగ్లర్ మరోసారి పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. ఆయుధాల కేసుకు సంబంధించి స్మగ్లర్ ఆరిఫ్ యూపీలోని షామ్లీ జిల్లాలో ఉన్నాడన్న సమాచారంతో హర్యానాకు చెందిన గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) బుధవారం దాడి చేయగా, ఆయన వారికి చిక్కకుండా త్రుటిలో పరారయ్యాడు. ఆరిఫ్ ఇలా పోలీసులకు చిక్కకుండా పరార్ కావడం ఈ వారంలో ఇది రెండోసారి. ఈనెల 10న ఆరిఫ్ అనుచరుడు షోయబ్‌ను తొమ్మిది పిస్తోళ్లు, 18 మేగజైన్లతో మధుర-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌లో అరెస్టు చేశారు. అతడిని ప్రశ్నించగా, ఆరిఫ్ కూడా అదే రైలులో ఆయుధాలతో ప్రయాణిస్తున్నట్టు చెప్పడంతో ఆయనను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. వివిధ ప్రాంతాలకు ఆయుధాలను సరఫరా చేయడానికి ఇండోర్ నుంచి ఖైరానాకు వాటిని స్మగుల్ చేస్తున్నట్టు నిందితుడు చెప్పడంతో ఆరిఫ్‌ను పట్టుకోవడానికి జిఆర్‌పి బుధవారం మరోసారి ప్రయత్నించగా, ఆయన త్రుటిలో తప్పించుకున్నాడు. కాగా, షోయబ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, ఆరిఫ్‌ను త్వరలోనే పట్టుకుంటామని సర్కిల్ అధికారి రాజేష్ తివారి తెలిపారు.





శ్రీశైలంలో జరుగుతున్న మకరసంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో ఆది దంపతులకు పుష్పపల్లకి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. శ్రీశైల మల్లన్నకు పుష్పపల్లకి సేవ.

మల్లన్నకు పుష్పపల్లకీ ఉత్సవం

శ్రీశైలం జనవరి 16: శ్రీశైలంలో జరుగుతున్న మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి పుష్పపల్లకి సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. కనుమ సందర్భంగా బుధవారం యాగశాలలో శ్రీ చండీశ్వర పూజలు జరిపించారు. రాత్రి శ్రీ స్వామి అమ్మవార్లకు పుష్కపల్లకి సేవ వైభవంగా జరిగింది. రకరకాల పుష్పాలను ఇందుకు వినియోగించారు. 300 కిలోల ఎర్రబంతి పూలు, 300 కిలోల పసుపు బంతి పూలు, 150 కిలోల తెలుపు చామంతి పూలు, 150 కిలోల ఆస్టర్ పూలు, 500 నెంబర్ల కట్‌రోజెస్, 750 నెంబర్ల జాబ్ర, 750 నెంబర్ల గ్లాడియోలాస్, వెయ్యి నెంబర్ల ఆర్కిడ్స్, 500 నెంబర్ల కార్నేషన్, 250 మీటర్ల కనకాంబరాలు, 250 మీటర్ల కాగడాలు, 150 మీటర్ల అశోక ఆకు మాల తదితర 13 రకాలకు పైగా పుష్పపత్రాలతో అలంకరించిన పల్లకిలో శ్రీ స్వామి అమ్మవార్లను ఆశీనులను చేయించారు. అనంతరం ఆలయ మాడావీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు మల్లన్న, భ్రమరాంబిక అమ్మవార్లను దర్శించుకుని తరించారు.



వైభవంగా అహోబిలేశుని పార్వేట ఉత్సవాలు

ఆళ్లగడ్డ, జనవరి 16: కర్నూలు జిల్లాలోని పుణ్య క్షేత్రం అహోబిలంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్వేట ఉత్సవాట బుధవారం రాత్రి వేడుకగా జరిగాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 45 రోజులుపాటు 33 గ్రామాల్లో పూజలందుకోవడానికి ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీ జ్వాలా నరసింహస్వామి, దిగువన వెలసిన శ్రీ ప్రహ్లాద వరదస్వామి పల్లకిలో తరలివెళ్లే వేడుకే పార్వేట ఉత్సవం. ప్రత్యేక పూజల అనంతరం కుంభహారతి ఇచ్చి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అనంతరం చెంచులు విల్లంబులు చేతబట్టి పార్వేట ఉత్సవ పల్లకికి నమస్కార బాణాలు ఎక్కుపెట్టి సంధించారు. దీంతో పార్వేట ఉత్సవపల్లకి బాచేపల్లె గ్రామం వైపు సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అభివృద్ధి నిరోధకుడు బాబు

❖ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా

కడప సిటీ, జనవరి 16: ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి నిరోధకుడుగా మారారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో చెప్పిన అబద్ధాలే మళ్లీ చెబుతూ, భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. కడప నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో కన్నా మాట్లాడుతూ బాబు ఏపీకి చేసింది శూన్యమని ఎద్దేవా చేశారు. నిజంగా బాబుకు రాయలసీమపై చిత్తశుద్ధి ఉంటే ఇక్కడే హైకోర్టు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. భారతదేశ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. బాబు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్రానికి లక్షల కోట్ల నిధులు, కర్నూలులో సోలార్ ప్లాంట్, రాయలసీమలో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదే అన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే స్టీల్‌ప్లాంట్‌కు పునాదులు వేశారని, అభివృద్ధి కోసం కాదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఏపీ, తెలంగాణలో ఒంటరి పోరాటం చేస్తామన్నారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు, ఏపీకి గృహనిర్మాణం, మరుగుదొడ్లు ఇచ్చింది కేంద్రమే అన్నారు.

అమిత్‌షా కడప పర్యటన రద్దు!


తిరుపతి: కడపలో ఈనెల 18వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాల్సిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పర్యటన రద్దయినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. కడపలో జరగనున్న సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బీజేపీ జిల్లాల వారీగా ముఖ్యుల సమావేశం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీన జరగనున్న సమావేశానికి అమిత్‌షా ముఖ్య అతిథిగా విచ్చేయాల్సి ఉంది. అయితే ఆయన జ్వరంతో బాధపడుతున్న క్రమంలో ఆయన పర్యటన రద్దయినట్లు బీజేపీ ముఖ్య నేతలకు సమాచారం అందింది. కాగా, సమావేశాన్ని రద్దుచేస్తారా, లేక మరో ముఖ్య జాతీయ నేతలతో కొనసాగిస్తారా అన్నది గురువారం తేలనుంది. ఇప్పటికే సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తికావడం అందుకు ప్రధాన కారణం

తెలుగుయువత అధ్యక్షుడిగా దేవినేని అవినాష్

❖ అనుబంధ సంఘాల రథసారథుల నియామకం ❖ తమ్ముళ్లకు బాబు సంక్రాంతి కానుక

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: సంక్రాంతి పర్వదినం సందర్భంగా తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ్ముళ్లకు తీపికబురు అందించారు. ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న పది అనుబంధ సంఘాలకు రథసారథులను నియమించారు. తెలుగు యువత అధ్యక్షుడిగా మాజీ మంత్రి, దివంగత నేత దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) తనయుడు అవినాష్ నియమితులయ్యారు. తెలుగు మహిళ సంఘం అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ పోతుల సునీత (ప్రకాశం), తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిగా కంభం విజయరామిరెడ్డి (నెల్లూరు), బీసీ సెల్ అధ్యక్షుడిగా గుంటూరు అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోరబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎంఎస్ రాజు (అనంతపురం), ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎంవీవీ ప్రసాద్ (విశాఖ), మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇంతియాజ్ అహ్మద్ (కర్నూలు), క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడిగా మద్దిరాల జోసఫ్ ఇమ్మానియల్ (గుంటూరు), టీఎన్‌టీయుసీ అధ్యక్షుడిగా బీ నరేష్‌కుమార్ రెడ్డి (చిత్తూరు), అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలిగా వందనాదేవి (గుంటూరు) నియమితులయ్యారు. పార్టీలో కీలకమైన తెలుగు యువతకు అవినాష్ నియమితులు కావటంతో విజయవాడ నగరంలో రాత్రి పలుచోట్ల సంబరాలు జరిగాయి.



వైద్య పరీక్షల కోసం అమెరికాకు జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 16: వైద్య పరీక్షల నిమిత్తం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం రాత్రి హుటాహుటిన అమెరికాకు బయలుదేరి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన కిడ్నీ సంబంధిత సమస్యలపై పరీక్షల నిమిత్తం అమెరికాకు వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వచ్చే నెల 1వ తేదీన అరుణ్ జైట్లీ ఎన్డీఏ సర్కార్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఇది ప్రస్తుత ప్రభుత్వంలో చివరి బడ్జెట్. గత ఏడాది అనారోగ్యంతో జైట్లీ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో చేరారు. గత ఏడాది మే 14వ తేదీన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. జైట్లీ అనారోగ్యం పాలుకావడంతో, ఆయన స్థానంలో ఆర్థిక శాఖ బాధ్యతలను మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించారు. గత ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచి ఆయన ఆర్థిక శాఖ కార్యాలయానికి రాలేదు. ఆరోగ్యం కుదుపడిన తర్వాత ఆగస్టు 23వ తేదీ నుంచి విధులకు హాజరయ్యారు.

బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రణాళిక కమిటీకి

పురంధ్రీశ్వరి నేతృత్వం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 16: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధ్రీశ్వరి అధ్యక్షతన 11 మందితో బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రణాళిక కమిటీని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రకటించారు. ఈ కమిటీకి పురంధ్రీశ్వరి చైర్‌పర్సన్‌గా, మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు కన్వీనర్‌గా, ఎమ్మెల్సీ మాధవ్, సమాచార హక్కు మాజీ కమిషనర్ పీ విజయబాబు, ప్రొ. డీఏఆర్ సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాసులు, షేక్ మస్తాన్, సత్యనారాయణ, కేఎస్ పిలేశ్వరరావు, పీ నస్యాసి రాజు, మురళి, సుధీష్ రాంభొట్ల సభ్యులుగా నియమితులయ్యారు.

హేళన చేసినవారిని అక్కున చేర్చుకుంటారా?

రాజకీయ మనుగడ కోసం కేసీఆర్ దివాలాకోరుతనం ❖ టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు రమణ ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, ఆంధ్రా ప్రాంత ప్రజలతో పాటు వారి పండుగలను ఇష్టంవచ్చినట్టు హేళన చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు మాటమార్చారని టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై ఫెడరల్‌ఫ్రంట్ పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డితో ముందుకు వెళ్తాన్నామని కేసీర్ తపన పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో వైఎస్ జగన్‌ను విమర్శించిన తెరాస నేతలు ఇప్పుడు ఏవిధంగా మద్దతు ఇస్తారని ఆయన నిలదీశారు. విభజన సమయంలో సోనియా గాంధీని పొగిడిన కేసీఆర్ తర్వాత ఆమెను దెయ్యం అంటూ నిందలు వేశారని ఆయన గుర్తుచేశారు. ఫెడరల్‌ఫ్రంట్ ముసుగులో నరేంద్ర మోదీ, బిజేపీకి, తెరాస, వైఎస్సార్ పార్టీలు బీ టీంగా పనిచేస్తున్నాయని చెప్పారు. గత సెప్టెంబర్ నుంచి తెలంగాణలో అభివృద్ధి కుంటుబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జగన్మోహనరెడ్డి అవినీతిపరుడంటూ కేసీఆర్ ప్రచారం చేసింది మర్చిపోయారా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన జగన్‌ని కేటీఆర్ కలిస్తే అమరవీరుల ఆత్మలు ఘోషిస్తాయన్నారు. తెలంగాణ అమరుల కుటుంబాలకు, ప్రజలకు దీనిపై సమాధానం చెప్పాలని టీడీపీ డిమాండ్ చేస్తోందని అన్నారు. ఆంధ్రాలో టీడీపీ అధికారంలోకి రాకూడదని, రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఒకరినొకరం తిట్టుకున్నాం.. ఈరోజు నుంచి చంద్రబాబుని తిడదాం అన్న విధంగా ఉందని టీఆర్‌ఎస్, వైఎస్‌ఆర్‌సీపీల వైఖరి ఉందని తెలుగుదేశం నేత రావుల చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. తెరాస, వైఎస్సార్, ఎంఐఎం పార్టీలు మళ్ళీ మోదీని ప్రధానిగా చేయడానికి కలసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అశ్వారావుపేట టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

1వ పేజీ తరువాయి

సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా మహేశ్వరి, ఖన్నా

సుప్రీంకోర్టు జడ్జి పదవులకు సిఫార్సు చేశారు. ఈ నిర్ణయం తీవ్ర విమర్శలకు లోనైంది. కాగా కొలీజియం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రశ్నిస్తూ లేఖ రాశారు. ఈ లేఖను కొలీజియం సభ్యులు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అరుణ్ మిశ్రాకు పంపారు. సీనియారిటీని విస్మరించారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కైలాష్ గంభీర్ కూడా ఈ విషయమై రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. సీనియారిటీని విస్మరించారని ఆయన ప్రస్తావించారు. ఈ నిర్ణయాన్ని ఢిల్లీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా విమర్శించింది. కొలీజియం వద్దకు వెళ్లి తమ అభ్యంతరాలను తెలియచేస్తామని బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా తెలియచేశారు. అవసరమైతే ధర్నా చేస్తామన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఒక జూనియర్ జడ్జిని నియమించారంటూ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎం లోథా కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నియామకాల పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొలీజియం పారదర్శకతతో పనిచేయాలన్నారు. కొలీజియం ఒక పరిణతి చెందిన న్యాయమూర్తుల సమావేశమని, కాని నిర్ణయాల్లో పారదర్శకత లోపించిందన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

ఏర్పాటుకు ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నందున కేబినెట్ ఆమోదం, శాసనసభ తీర్మానం చకచకా జరిగిపోతాయని వారంటున్నారు. ఇది విభజన చట్టంలో పేర్కొన్న అంశమే అయినందున గవర్నర్ కూడా అభ్యంతరం చెప్పరన్న విశ్వాసం వారిలో వ్యక్తమవుతోంది. అయితే ఎన్నికలు సమీపిస్తున్నందున కేబినెట్‌లో చర్చించి ఆమోదముద్ర వేయాలని, శీతాకాల బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రిని కోరనున్నారు. గవర్నర్ ఆమోద ముద్ర వేస్తేఎన్నికల నిబంధనలు వర్తించబోవంటున్నారు. ఫిబ్రవరి చివర్లలో ఎన్నికల షెడ్యూలు వెలువడుతుందన్న వార్తల నేపథ్యంలో ఈ నెలలోనే కేబినెట్ ఆమోదం, ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదిస్తేచాలని వారంటున్నారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్న ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. నెలాఖరులో చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేసేందుకు న్యాయవాదులంతా సమాయత్తమవుతున్నారు.

పేదలకు ఇళ్లు

పేదలకు సొంత ఇంటిని అందచేయాలన్న లక్ష్యంతో ఈ పథకం ప్రారంభించామని ఆయన తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు చేపట్టడంలో తానెన్నడూ వెనకడుగు వేయలేదని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం లబ్ధి పొందాలన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే తన లక్ష్యమన్నారు.

ఎన్టీఆర్ నగర్స్ పథకానికి కోట్ల రూపాయల విలువైన భూమిని ఉచితంగా ఇచ్చామని, సబ్సిడీ, ఇతర మౌలిక సదుపాయల కోసం 13,035 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద ఒక్కొక్కరిపై 4లక్షల రూపాయల వరకూ ఖర్చు చేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా ఇంధన సామర్థ్య ఉపకరణాలను పేదలకు అందచేయడం సంతోషంగా ఉందన్నారు. ఇంధన సామర్థ్య ఫలాలు పేదలకూ అందాలనేది తన ఆకాంక్ష అని, దీనివల్ల పేదలకు ప్రయోజనంతో పాటు ఆర్థిక, పర్యావరణ లబ్ధి కూడా చేకూరుతుందన్నారు. ఇంధన సామర్థ్య సన్నద్ధతలో ఇప్పటికే ఏపీ దేశంలోనే నెంబర్-1గా నిలిచిందన్నారు. ప్రపంచ బ్యాంక్ కూడా ఏపీ నెంబర్-1గా ఉన్నట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటులో జాతీయ రికార్డు సృష్టించామన్నారు. కోటి కుటుంబాలకు ఎల్ఈడీ లైట్లు అందించి మరో జాతీయ రికార్డు సృష్టించామన్నారు. రాష్ట్రంలోని 101 మున్సిపాలిటీల్లో ఎన్టీఆర్ నగర్స్ పథకం కింద 5.29 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేశామని చంద్రబాబు వివరించారు. కాగా, ఈ పథకం అమలుకు 511 ఎకరాల భూమి కొనుగోలుకు 176 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గృహ నిర్మాణ పథకంలో ఇంధన సామర్థ్య పరికరాల ఏర్పాటును పర్యవేక్షించే బాధ్యతను తీసుకునేందుకు ఏపీ సీడ్కో, పరికరాలను సరఫరా చేసేందుకు ఈఈఎస్ఎల్ అంగీకరించాయని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ తెలిపారు. కోర్టు భవనాలు, పాఠశాల విద్య, వివిధ సంక్షేమ శాఖల పరిధిలో, ఎన్టీఆర్ నగర్స్‌లో ఈఈఎస్ఎల్ భాగస్వామి కానుందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, తదితరులు పాల్గొన్నారు.

జూదాల గోదాబరి!

చేశారు. ఈ పేకాటకు పదుల సంఖ్యలో కార్లు, వందల సంఖ్యలో బైకులపై హాజరవ్వడం విశేషం.

మీడియా ప్రముఖులనూ వదలని జాడ్యం

జూదాల జాడ్యం మీడియా ప్రముఖులనూ వదలలేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో పలువురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రముఖులు జూదాల నిర్వాహకుల అతిథులుగా కోడిపందేలు, పేకాటలకు హాజరయ్యారు. 24 గంటలూ టెలివిజన్‌లో చర్చలు సాగిస్తూ, ధర్మానికి ఆరడుగుల రూపంగా, అక్రమ వ్యవహారాలను అడ్డుకునే పర్వతంగా పేర్కొనే ఓ టెలివిజన్ ఛానల్ ప్రతినిధి పూలపల్లిలో జరిగిన పేకాట జాతరకు అతిథిగా హాజరయ్యారు. ఆహ్వానితులు వేల రూపాయలు ఒడ్డి పేకాడుతుంటే, ఆయన వారి పక్కన ఆశీనుడై అల్పాహారాలు సేవిస్తూ తిలకించారు. పలువురు జూద ప్రముఖులు ఆయన గురించి గుసగుసలాడుకోవడం విశేషం.

భీమవరంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని

భీమవరం:తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పరిసర ప్రాంతాల్లో జరిగిన కోడి పందాలను వీక్షించారు. ఆయనతోపాటు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. కోడి పుంజులను పట్టుకుని ఫొటోలకు ఫోజులిచ్చారు. భీమవరం ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని తరించారు. కొన్ని వందల సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని మనం గౌరవించాలని మీడియాతో చెప్పారు.

జల్లికట్టు మాదిరిగా కొన్ని పండుగలు జరుగుతుంటాయని, వాటిని జూదంతో ముడిపెట్టకూడదన్నారు. చట్ట వ్యతిరేక క్రీడగా కాకుండా సంప్రదాయంగా చూడాలన్నారు.

జగన్‌పై దాడి కేసు..

చేరుకున్నాడు? దాడికి ఎలా ప్రయత్నించాడు? అనే ప్రశ్నలకు సమాధానం రాబట్టడం కోసం ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. జగన్‌పై హత్యాయత్న చేసే ముందు నిందితుడు విమానాశ్రం నుంచి ఎవరెవరితో మాట్లాడాడనే విషయాలపై సెల్‌ఫోన్ డాటాను పరిశీలిస్తున్నారు. కాగా, ఎన్ఐఏ అధికారుల ముందు శ్రీనివాసరావు పాత పాటేపాడాడు. కాబోయే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్‌కు సానుభూతి వచ్చేందుకే హత్యాయత్నం చేసినట్టు తెలిపాడు. జగన్‌కు రాజకీయంగా ప్రచారం వస్తుందనే ఈ ఘటనకు ప్రయత్నంచానని అన్నాడు. 2018 అక్టోబర్ 25న ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం విమానాశ్రంలో జగన్‌పై హత్యాయకు శ్రీనివాస్‌రావు ప్రయత్నించిన ఘటనపై విచారణను ఎన్ఐఏ దర్యాప్తును ముమ్మరం చేస్తోంది. నిందితుడు శ్రీనివాసరావు కోడికత్తితో హత్యాయత్న చేసినప్పుడు జగన్ ఎడమచేతి భుజంకు గాయమైంది. ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోంమంత్రి శాఖ జగన్ కేసుపై విచారణ చేపట్టాలని జాతీయ దర్యాప్తు సంస్థను ఆదేశించింది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో శ్రీనివాసరావుకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అతను ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు ధ్రువీకరించారని నిందితుడు తరుపున వాదిస్తున్న సలీమ్ చెప్పారు.

కేసీఆర్ ఫ్రంట్‌లోకి..

కేసీఆర్ వైఎస్ జగన్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఫెడరల్ ఫ్రంట్‌లోకి ఆహ్వానించారు. అంతేకాకుండా వివరంగా మాట్లాడేందుకు తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పంపిస్తానని చెప్పారు. దీంతో బుధవారం కేటీఆర్ పార్టీ ఎంపీలు బి. వినోద్ కుమార్, సంతోష్ కుమార్, కౌన్సిల్‌లో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర రెడ్డి ప్రభృతులతో కలిసి జగన్ నివాసానికి వెళ్ళారు. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, పార్టీ నాయకుడు సజ్జల రామకృష్ణా రెడ్డి, మాజీ మంత్రి పార్థసారధి తదితరులు వారికి స్వాగతం పలికారు. జగన్‌ను కేటీఆర్ కలిసేందుకు వస్తున్న వార్త టీవీ ఛానళ్ళు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరగడంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు.

సుదీర్ఘ మంతనాలు..

ఇలాఉండగా జగన్, కేటీఆర్ సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. ఏ లక్ష్యంతో ఫ్రంట్ ఏర్పాటుకు కేసీఆర్ కృషి చేస్తున్నారో, ఇప్పటి వరకు ఎవరెవరిని కలిసారో కేటీఆర్ ఆయనకు వివరించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు పట్ల వివిధ రాష్ట్రాల నుంచి సంపూర్ణమైన మద్దతు లభిస్తున్నదని ఆయన చెప్పారు. ఫెడరల్ ఫ్రంట్‌లో చేరేందుకు ముందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమయంలోనే కేటీఆర్ కేసీఆర్‌కు ఫోన్ చేసి జగన్‌తో మాట్లాడించారు. తానే స్వయంగా ఏపీకి వచ్చి మాట్లాడుతానని కేసీఆర్ చెప్పారు. అయితే తాను గురువారం లండన్ వెళుతున్నానని, తిరిగి వచ్చిన తర్వాత మీకు కబురు పంపిస్తానని వైఎస్ జగన్ చెప్పినట్లు సమాచారం.

సంఖ్యాబలం పెరగాలి..

సమావేశానంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ తనతో ఫోన్‌లో మాట్లాడుతూ ఫ్రంట్‌లో చేరాల్సిందిగా ఆహ్వానించారని చెప్పారు. ఈ మేరకు కేటీఆర్‌తో చర్చించానని అన్నారు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాల గురించి చర్చించినట్లు ఆయన చెప్పారు. ఉదాహరణకు ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటులో ఇచ్చిన హామీకే దిక్కు దివాణం లేదన్నారు. ప్రత్యేక హోదా సాధించాలంటే సంఖ్యాబలం పెరగాలన్నారు. ఏపీలో 25 మంది ఎంపీల బలం సరిపోదని, తెలంగాణలో 17 మంది ఎంపీల బలం తోడైతే 42 మందితో కలిసి కేంద్రంపై వత్తిడి తేవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీనే కాదు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు మేలు జరగాలి అంటే సంఖ్యాపరంగా బలపడాలని అన్నారు. ఈ మేరకు కేసీఆర్ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ప్లాట్ ఫాం (ఫెడరల్ ఫ్రంట్)ను స్వాగతిస్తున్నానని ఆయన చెప్పారు. అన్ని విషయాలూ వివరంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని జగన్ తెలిపారు.

గుణాత్మకమైన మార్పు: కేటీఆర్

దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాలని సమాఖ్య స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ఒక ప్రత్యామ్నాయాన్ని (ఫెడరల్ ఫ్రంట్) ఏర్పాటు చేయాలన్నది కేసీఆర్ భావన అని కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ అధ్యక్షులతో చర్చించినట్లు చెప్పారు. ఆయా రాష్ట్రాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్ళి చర్చించిన తరహాలోనే ఆంధ్ర ప్రదేశ్‌కు వెళ్ళి జగన్‌ను కలిసి మిగతా విషయాలు మాట్లాడుతారని ఆయన వివరించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ఆయన తెలిపారు. ఈ విషయంలో తమ పార్టీ ఎంపీ కవిత లోక్‌సభలో, పార్టీ నాయకుడు కే.కేశవరావు రాజ్యసభలో ప్రస్తావించారని కేసీఆర్ గుర్తు చేశారు. ఒకే ఆలోచన ధోరణి ఉన్న నాయకులంతా ఒక వేదికపైకి వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉండే విధంగా జాతీయ రాజకీయాలు ఉండాలన్న ఆలోచన ఉన్న వాళ్ళు కలిసి వస్తారన్న విశ్వాసం తమకు ఉందని కేటీఆర్ తెలిపారు.

సభకు వేళాయే!

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: శాసనసభ ఎన్నికల తర్వాత తెలంగాణ శాసనసభ గురువారం నుంచి కొలువుదీరనుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత శాసనసభ కొలువుదీరడం ఇదే తొలిసారి. ఈ నెల 20 వరకు నాలుగు రోజుల వరకు కొనసాగనున్న శాసనసభ సమావేశాల మొదటి రోజున సభకు ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఎంఐఎం పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎంపిక చేయగా, ఆయనతో బుధవారం మధ్యాహ్నం గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయించారు. నాలుగు రోజుల పాటు జరగనున్న శాసనసభ సమావేశాల్లో మొదటి రోజు సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్, నామినేషన్ దాఖలు కార్యక్రమాలు ఉంటాయి. ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో సభా నాయకుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రొటెం స్పీకర్ మొదట ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అనంతరం మహిళా సభ్యులు, ఆ తర్వాత సభకు ఎన్నికైన సభ్యుల సీనియార్టీ ప్రకారం వరుసక్రమంలో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఒకవేళ సభ ప్రారంభానికి ముందే తమ సభా నాయకుడిని (సీఎల్‌పీ నేత) ఎన్నుకున్నట్టు ప్రొటెం స్పీకర్‌కు లేఖ ఇస్తే ముఖ్యమంత్రి తర్వాత ప్రతిపక్ష నాయకుడితో ప్రమాణ స్వీకారం చేయించడం సభా సాంప్రదాయం. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తి అయిన తర్వాత స్పీకర్ ఎన్నికకు ప్రొటెం స్పీకర్ నోటిఫికేషన్ విడుదల చేసి, అదే రోజు నామినేషన్లు స్వీకరిస్తారు. రెండవ రోజు శుక్రవారం స్పీకర్ ఎన్నిక అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై సభా కార్యక్రమాలను ఖరారు చేయనుంది. మూడవ రోజు శనివారం శాసనసభా, శాసన మండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగంతో సభా వాయిదా పడనుంది. నాలుగవ రోజు ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం తర్వాత సభ వాయిదా పడనుంది. ఇలా ఉండగా శాసనసభలో సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముందు గురువారం ఉదయం 11 గంటలకు గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు అర్పిస్తారు. అక్కడి నుంచి నేరుగా 11.05 గంటలకు సభకు చేరుకోగానే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది.

క్రీడాభూమి

రెండో వన్డేలో భారత్ గెలుపు

రాణించిన విరాట్, ధోనీ

అడిలైడ్, జనవరి 16: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్లు కోల్పోయి, 298 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లలో షాన్ మార్ష్ (131) సెంచరీ రాణించాడు. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ నాలుగు వికెట్లు, మహ్మద్ షమీ మూడు, రవీంద్ర జడేజా ఒక వికెట్ తీశారు. అనంతరం 299 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ నాలుగు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. భారత బ్యాట్స్‌మెన్లలో ఓపెనర్లు చక్కటి శుభారంభం ఇచ్చారు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత శిఖర్ ధావన్ (32) బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ఖాజాకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీతో కలిసి రోహిత్ శర్మ ఇన్నింగ్స్‌ని చక్కదిద్దే బాధ్యత భుజాన వెసుకున్నాడు. మొదటి మ్యాచ్‌లోనే సెంచరీ చేసి మంచి ఫాంలో ఉన్న రోహిత్ శర్మ (43) స్టొయినిస్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత అంబటి రాయుడు (24) కొద్దిసేపటికే అవుట్ కాగా, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనితో కలిసి విరాట్ చెలరేగాడు. ఈ క్రమంలోనే విరాట్ (104) సెంచరీ చేసి నిష్క్రమించగా, ధోని (55) మరో ఎండ్‌లో ఉన్న దినేష్ కార్తీక్ (25) సాయంతో మ్యాచ్‌ను ముగించాడు. ఆసీస్ బౌలర్లలో జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, జే రిచర్డ్‌సన్, మార్కస్ స్టొయినిస్, గ్లేన్ మ్యాక్‌స్వెల్‌కు తలో వికెట్ లభించింది.





స్కోర్ బోర్డు సంక్షిప్తంగా:

ఆస్ట్రేలియా: షాన్ మార్ష్ 131, గ్లేన్ మ్యాక్‌స్వెల్ 48

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 45/4, మహ్మద్ షమీ 58/3, రవీంద్ర జడేజా 49/1

భారత్: విరాట్ కోహ్లీ 104, మహేంద్రసింగ్ ధోనీ (55)

బౌలింగ్: జాసన్ బెహ్రెన్‌డార్ఫ్ 52/1, జే రిచర్డ్‌సన్ 59/1, గ్లేన్ మ్యాక్‌స్వెల్ 16/1, మార్కస్ స్టొయినిస్ 46/1.

కోహ్లీకి అచ్చొచ్చిన సంక్రాంతి



అడిలైడ్, జనవరి 16: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ 39వ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. అయితే గత మూడేళ్లుగా కోహ్లీ జనవరి 15న తప్పకుండా సెంచరీ బాదుతున్నాడు. గత రెండేళ్లలో 2017లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో తొలి వన్డేలో సెంచరీ (122) చేసిన కోహ్లీ, 2018లో దక్షిణాఫ్రికా పర్యటనలో రెండో టెస్ట్ సెకండ్ ఇన్నింగ్స్‌లో 153 పరుగులు సాధించాడు. ఈ రెండు సెంచరీలతో పాటు ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన రెండే వన్డేలోనూ 104 పరుగులు చేశాడు. దీంతో సంక్రాంతి (జనవరి 15) రన్ మిషన్ కోహ్లీకి కలిసొచ్చిందనే చెప్పాలి.

మిస్టర్ కూల్‌ను విమర్శించడం మానండి

• మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్



న్యూఢిల్లీ, జనవరి 16: భారత క్రికెట్‌కు ధోనీ విలువ వెలకట్టలేనిదని, దయచేసి అందరూ ధోనీని విమర్శించడం మానేయాలని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు. బుధవారం గవాస్కర్ ఇండియాతో మాట్లాడుతూ ధోనీ మునుపటి ఫాంలోకి వచ్చాడని, ఆస్ట్రేలియాతో జరిగిన రెండు వన్డేల్లోనూ అర్ధ సెంచరీ రాణించాడని చెప్పాడు. చివరి ఓవర్‌లో తనదైన శైలిలో సిక్స్‌లు బాదడమే ఇందుకు ఉదహారణగా చెప్పుకొచ్చాడు. ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని చెడు రోజులుంటాయని, దయచేసి ఇప్పటికైనా ధోనీని విమర్శించడం వదిలేయాలని పునరుద్ఘటించాడు. 37ఏళ్ల వయస్సున్న ధోనీ, ప్రస్తుతం కుర్రాళ్లతో పోటీ పడుతున్నాడన్నారు. భారత్‌కు రెండు వరల్డ్ కప్‌లు అందించిన వ్యక్తని కొనియాడారు.

ధోనీకి ఎప్పుడెలా ఆడాలో తెలుసు

• ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జాసన్ గిలెస్పీ



అడిలైడ్, జనవరి 16: భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి ఎప్పుడు ఎలా ఆడాలో తెలుసు, పరిస్థితికి తగినట్లు ఆడడంలో ధోనీని మించి ఎవరూ లేరని ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జాసన్ గిలెస్పీ కొనియాడారు. కొత్త ఏడాదిలో రెండు అర్ధ సెంచరీలతో ధోనీ వన్డేల్లో తన పునరాగమాన్ని ఘనంగా చాటాడన్నాడు. అడిలైడ్‌లో 299 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన భారత్‌ను కెప్టెన్ విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో గెలిపించాడని, ప్రస్తుత ఆటగాళ్లలో కోహ్లీ ముందున్నాడని కొనియాడారు.

కష్టంగా ఫెదరర్..

సులభంగా నాదల్

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ మూడో రౌండ్‌కు మేటి స్టార్లు

మెల్బోర్న్, జనవరి 16: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ చెమటోడ్చి నెగ్గగా, రెండో ర్యాంక్ ఆటగాడు రాఫెల్ నాదల్ ఎలాంటి కష్టం లేకుండా, సులభంగానే ప్రత్యర్థిని ఓడించి మూడో రౌండ్ చేరాడు. క్వాలిఫయర్ డాన్ ఇవాన్స్ నుంచి తీవ్ర స్థాయిలో పోటీని ఎదుర్కొన్న ఫెదరర్ చివరికి పోరును 7-6, 7-6, 6-3 తేడాతో తన ఖాతాలో వేసుకున్నాడు. మొదటి రెండు సెట్లలో చివరి వరకూ చెమటోడ్చిన ఫెదరర్ చివరిదైన మూడో సెట్‌లో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా విజయభేరి మోగించాడు. కాగా, నాదల్ 6-3, 6-2, 6-2 తేడాతో మాథ్యూ ఎబ్డెన్‌ను సునాయాసంగా ఓడించాడు. నాదల్ విజృంభణకు ఎబ్డెన్ నుంచి ఏ దశలోనూ గట్టిపోటీ ఎదురుకాలేదు.

ఆండర్సన్‌కు చుక్కెదురు

ప్రపంచ ఐదో ర్యాంక్ ఆటగాడు కెవిన్ ఆండర్సన్‌కు రెండో రౌండ్‌లోనే చుక్కెదురైంది. మొదటి రౌండ్‌లో బ్రిటన్ ఆటగాడు ఆండీ ముర్రే అనూహ్యంగా పరాజయాన్ని ఎదుర్కోగా, రెండో రౌండ్‌లో ఆండర్సన్ అదే విధంగా ఎవరూ ఊహించని రీతిలో ఓటమిపాలయ్యాడు. ఫ్రాన్సెస్ టియాఫో 4-6, 6-4, 6-4, 7-5 తేడాతో ఆండర్సన్‌ను ఓడించాడు. 27వ ర్యాంకర్ అలెక్స్ డి మినౌర్ 6-4, 6-2, 6-7, 4-6, 6-3 ఆధిక్యంతో హెన్రీ లాక్సోనెన్‌పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. హోరాహోరీగా సాగిన ఈ ఆమ్యాచ్ చివరి వరకూ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

షరపోవా ముందంజ

రష్యా టెన్నిస్ బ్యూటీ మరియా షరపోవా మహిళల సింగిల్స్‌లో ముందంజ వేసింది. రెండో రౌండ్‌లో ఆమె రెబెకా పెటెర్సన్‌ను 6-2, 6-1 తేడాతో చిత్తుచేసింది. 30వ ర్యాంక్ క్రీడాకారిణిగా బరిలోకి దిగిన ఆమెకు టైటిల్ సాధించే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఆమె నంబర్ వన్‌గా నిలిచింది. కాగా, ఐదో ర్యాంక్ క్రీడాకారిణి స్లొయెన్ స్టెఫెన్స్ 6-3, 6-1 ఆధిక్యంతో తిమియా బబోస్‌ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. ఆష్ బార్టీ 6-2, 6-3 స్కోరుతో వాంగ్ యఫాన్‌పై గెలుపొందింది. రెండో ర్యాంక్ క్రీడాకారిణి ఎంజెలిక్ కెర్బర్ 6-2, 6-3 స్కోరుతో క్వాలిఫయర్ బ్రిట్రిజ్ హదాద్ మలాపై గెలుపొందింది. అనస్టాసియా పవ్లిచెన్కో 3-6, 6-3, 6-3 తేడాతో తొమ్మిదో సీడ్ కికీ బెర్టెన్స్‌ను, మూడో ర్యాంకర్ కరోలినా వొజ్నియాకి 6-1, 6-3 ఆధిక్యంతో జొహన్నా లార్సన్‌ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

భారత స్టార్ల శుభారంభం

• మలేసియా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నీ

కౌలాలంపూర్, జనవరి 16: మలేసియా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్లు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశారు. ఏడో సీడ్‌గా బరిలోకి దిగిన సైనా మహిళల సింగిల్స్‌లో హాంకాంగ్‌కు చెందిన జాయ్ జువాన్ డెంగ్‌ను 14-21, 21-18, 21-18 తేడాతో ఓడించింది. రెండో రౌండ్‌లో ఆమె హాంకాంగ్ క్రీడాకారిణి పయ్ ఇన్ ఇప్‌ను ఢీ కొంటుంది. కఠినమైన డ్రాను ఎదుర్కొంటున్న కశ్యప్ తన తొలి రౌండ్‌లో 19-21, 21-19, 21-10 తేడాతో డెన్మార్క్ ఆటగాడు రస్మూస్ జెమ్కేను ఓడించాడు. కిడాంబి శ్రీకాంత్ కేవలం 30 నిమిషాల్లోనే హాంకాంగ్ ఆటగాడు ఆగ్నస్ కా లింగ్‌ను 21-17, 21-11 తేడాతో చిత్తుచేసి రెండో రౌండ్ చేరాడు. కాగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ పోరాటానికి తెరపడింది. ప్రణవ్ జెర్రీ చోప్రా, సిక్కీ రెడ్డి జోడీ 19-21, 17-21 తేడాతో ఇండోనేసియాకు చెందిన ని కెటుట్ మహాదేవి ఇష్టారాణి, రిజ్కీ అమెలియా ప్రదీప్తా జోడీ చేతిలో మొదటి రౌండ్‌లోనే పరాజయాన్ని ఎదుర్కొంది.

బులియన్

ముంబయిలో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 2,907.00
8 గ్రాములు:	రూ.23,256.00
10 గ్రాములు:	రూ. 29,070.00
100 గ్రాములు:	రూ.2,90,700.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,109.091
8 గ్రాములు:	రూ. 24,872.728
10 గ్రాములు:	రూ. 31,090.910
100 గ్రాములు:	రూ. 3,10,909.10
వెండి	
8 గ్రాములు:	రూ. 319.20
10 గ్రాములు:	రూ. 399.00
100 గ్రాములు:	రూ. 3,990.00
ఒక కిలో:	రూ. 39,900.00

హైదరాబాద్‌లో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 2,856.00
8 గ్రాములు:	రూ. 22,848.00
10 గ్రాములు:	రూ. 28,560.00
100 గ్రాములు:	రూ. 2,85,600.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,054.545
8 గ్రాములు:	రూ. 24,436.360
10 గ్రాములు:	రూ. 30,545.450
100 గ్రాములు:	రూ. 3,05,454.50
వెండి	
8 గ్రాములు:	రూ. 319.00
10 గ్రాములు:	రూ. 395.00
100 గ్రాములు:	రూ. 3,950.00
ఒక కేజీ:	రూ. 39,500.00



చమురు, గ్యాస్ నిల్వలను పొదుపుగా వాడుకొని, భవిష్యత్ తరాలు సమస్యలు ఎదుర్కోకుండా చూడడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ పెట్రోలియం పరిరక్షణ సంఘం (పీసీఆర్ఏ) బుధవారం భువనేశ్వర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ ధర్మేంద్ర ప్రధాన్. ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం 'సంరక్షణ్ క్షమతా మహోత్సవ్' (సాక్ష్యం)ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

వరుసగా మూడో రోజూ

పసిడి ధరల పరుగు

రూ. 33,190కి చేరిన 10 గ్రాముల ధర



న్యూఢిల్లీ, జనవరి 16: పండుగ సీజన్‌లో పసిడి ధరల పరుగు కొనసాగుతోంది. వరుసగా మూడోరోజూ ధర పెరగడంతో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.33,190కి చేరింది. బులియన్ మార్కెట్‌లో బుధవారం తులం బంగారం (10 గ్రాములు)పై 65 రూపాయలు పెరిగింది. దేశీయ జువలరీ వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతోనే ఇలా మూడు రోజులుగా బంగారం ధర పెరగుతూ వచ్చిందని వాణిజ్య రంగ నిపుణులు చెబుతున్నారు. అదే క్రమంలో వెండి ధరలు సైతం కిలోపై 300 రూపాయలు పెరిగి రూ.40,500కి చేరింది. పారిశ్రామిక విభాగాలు, నాణేల మార్కెట్ల నుంచి డిమాండ్ పెరిగినందువల్లే వెండి ధర పెరిగిందని అంచనా. కాగా డాలర్‌తో రూపాయి విలువ పడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బంగారంపై మదుపుచేయడమే సురక్షితమైన చర్యగా ఇన్వెస్టర్లు భావించారని, పైగా అంతర్జాతీయంగా సైతం బంగారానికి సానుకూల పరిస్థితులు నెలకొన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రత్యేకించి గత రెండు రోజుల నుంచి బంగారం ధరలు తులంపై 250 వరకు పెరిగాయి. ఇక అంతర్జాతీయంగా న్యూయార్క్‌లో ఔన్సు బంగారం 1,292.03 డాలర్లు అధికంగా అమ్ముడవగా, వెండి ఔన్సు ధర 15.60 డాలర్లు పలికింది. ఇలావుండగా మన దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం 65 రూపాయలు పెరిగి రూ.33,190, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.33,040గాను అమ్ముడైంది. అలాగే సవరం (ఎనిమిది గ్రాముల) బంగారం ధరలు మాత్రం స్థిరంగా 25,400 రూపాయల వద్ద నిలిచాయి. అయితే వారం వారం సరఫరాకు సంబంధించిన వెండి మాత్రం కిలోపై రూ.88 ధర తగ్గి 39,833 వద్ద ట్రేడైంది. ఇక వెండి నాణేలు హెచ్చుతగ్గులు లేకుండా 100 పీసులు కొనుగోలుకు రూ.77 వేలు, అమ్మకానికి రూ.78 వేలు వంతున ధర పలికింది.

కార్ల అమ్మకాల్లో

మారుతీ సుజుకీ టాప్



న్యూఢిల్లీ, జనవరి 16: కార్ల అమ్మకాల్లో మారుతీ సుజుకీ అగ్రస్థానాన్ని ఆక్రమించిది. డిసెంబర్‌లో మొత్తం 1,55,159 కార్లు అమ్ముడుకాగా, వాటిలో 83,729 కార్లు మారుతీ సుజుకీవే కావడం విశేషం.

రెండో స్థానంలో ఉన్న హ్యుందయ్ మోటార్స్ 34,361 వాహనాలను అమ్మింది. హోండా కంపెనీ 10,159 కార్లతో మూడో స్థానంలో నిలిచింది. టాటా మోటర్స్ 8,082, రెనాల్ట్ 5,832, టయోటా కిర్ల్ 3,941, ఫోర్డ్ ఇండియా 2,907, వోక్స్‌వాగన్ 2,785, నిస్సాన్ మోటార్స్ 1,952, స్కొడా ఆటో ఇండియా 1,178, మహీంద్ర అండ్ మహీంద్ర 158, ఫియట్ ఇండియా 75 చొప్పున వాహనాలను అమ్మగలిగాయి. జెన్ మోటర్స్, మహీ ఎలక్ట్రిక్ కనీసం ఒక్క కారును కూడా అమ్మలేకపోవడం గమనార్హం. ఇలావుంటే, కార్ల ఉత్పత్తి డిసెంబర్‌లో 11.28 శాతం తగ్గింది. 2017 డిసెంబర్ మాసంలో 2,01,781 కార్లు ఉత్పత్తికాగా, గత ఏడాది 1,79,014 కార్లకు పడిపోయింది. అదే విధంగా ఎగుమతుల్లో 28.20 శాతం లోటు నమోదైంది. 2017 డిసెంబర్‌లో 58,366 కార్లను ఎగుమతి చేయగా, గత ఏడాది డిసెంబర్‌లో అది 41,322 కార్లకు పతనమైంది.


మొబైల్ బ్యాంకింగ్‌లో పెరిగిన లావాదేవీలు


న్యూఢిల్లీ, జనవరి 16: మొబైల్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు క్రమంగా పెరుగుతున్నాయి. 2017 నవంబర్‌తో పోలిస్తే, గత ఏడాది నవంబర్ నాటికి ఈ లావాదేవీల విలువ రెట్టింపయింది. 1,05,424 కోట్ల రూపాయల నుంచి 2,45,859 కోట్ల రూపాయలకు చేరింది. 2017 నవంబర్ కంటే డిసెంబర్‌లో కేవలం 33 కోట్ల రూపాయల పెరుగుదల నమోదైంది. అయితే, ఆతర్వాత క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2018 జనవరిలో 1,12,421, ఫిబ్రవరిలో 1,13,660, మార్చిలో 1,41,503 కోట్ల రూపాయల విలువైన లావాదేవీలు మొబైల్ బ్యాంకింగ్ ద్వారా జరిగాయి. తాజా ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబర్ వరకూ అందుబాటులో ఉన్న గణాంకాలు కూడా పెరుగుదలను సూచిస్తున్నాయి. ఏప్రిల్‌లో 1,34,839, మేలో 1,77,447, జూన్‌లో 1,89,466, జూలైలో 2,09,186, ఆగస్టులో 2,06,505, సెప్టెంబర్‌లో 2,17,450, అక్టోబర్‌లో 2,47,097 కోట్ల రూపాయల విలువైన లావాదేవీలు జరిగాయి. నవంబర్‌లో కొంత తగ్గినప్పటికీ, 2,45,859 కోట్ల రూపాయలుగా మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీల విలువ నమోదైంది.

వాణిజ్యభూమి

నష్టాల ప్రమాదం తప్పింది

నామమాత్రపు లాభంతో ముగిసిన మార్కెట్





ముంబయి, జనవరి 16: భారత స్టాక్ మార్కెట్‌లో బుధవారం నాటి ట్రేడింగ్ నష్టాలు తప్పవన్న రీతిలో కొనసాగింది. అయితే, అంతర్జాతీయ సూచీలు సానుకూల ధోరణను ప్రదర్శించడంతో, నష్టాల నుంచి తప్పించుకొని, స్వల్ప లాభంతో బయటపడింది. 26,370.74 పాయింట్లతో మొదలైన మార్కెట్ ట్రేడింగ్ అనిశ్చిత పరిస్థితుల్లో నడిచింది. అత్యధికం 36,462.03 పాయింట్లుకాగా, అత్యల్పం 36,278.61 పాయింట్లు. మొత్తం మీద సెన్సెక్స్ 2.96 పాయింట్లు పెరిగి, 36,321.29 పాయింట్ల వద్ద ముగిసింది.

సుమారు రెండు వందల పాయింట్లు పెరుగుతూ, తరుగుతూ కొనసాగిన ట్రేడింగ్ చివరికి నామమాత్రపు లాభంతో ముగిసింది. అమెరికాలో కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, బ్రెగ్జిట్ నుంచి యూకే వైదొలగడం వంటి అనేకానేక అంశాలు భారత స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. అంతర్జాతీయ వార్తలు వెలువడుతున్నకొద్దీ, ట్రేడింగ్‌లో మార్పులు చాలా స్పష్టంగా కనిపించాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) 159.60 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. స్థూలంగా నికర అమ్మకాల విలువ 417.44 కోట్ల రూపాయలుగా నమోదైంది. అమెరికాలో ఆర్థిక బిల్లులకు చట్టసభ ఆమోద ముద్ర వేయకపోవడం అనేక సమస్యలకు తావిస్తున్న విషయం తెలిసిందే. ఈ షట్‌డౌన్ వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతున్నది. అయితే, అధ్యక్షుడు ట్రంప్ మాత్రం తన పట్టును వీడడం లేదు. ఇరు వర్గాలు తమ మాటే నెగ్గాలనే పట్టుదలలకు పోవడంతో, అమెరికాతోపాటు యావత్ ప్రపంచ స్టాక్ మార్కెట్‌లోనూ అనిశ్చితి తప్పడం లేదు. బ్రెగ్జిట్ అంశం కూడా ప్రపంచ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నది. ఈ రెండు అంశాలు ఆరంభంలో ప్రతికూల వాతావరణాన్ని సృష్టించినప్పటికీ, చివరిలో కొంత సానుకూల ధోరణులను ప్రదర్శించడంతో భారత స్టాక్ మార్కెట్‌కు భారీ నష్టం తప్పింది.

ఇలావుంటే, బుధవారం నాటి ట్రేడింగ్‌లో ఎస్ బ్యాంక్ (2.66 శాతం), ఇండస్‌ఇండ్ (2.02 శాతం), ఇన్ఫోసిస్ (1.38 శాతం), ఐసీఐసీ బ్యాంక్ (0.68 శాతం), ఓఎన్‌జీసీ (0.62 శాతం), ఎస్‌బీఐ (0.58 శాతం), యాక్సిస్ బ్యాంక్ (0.54 శాతం), రిలయన్స్ (0.40 శాతం), సన్ ఫార్మా (0.33 శాతం), టీసీఎస్ (0.32 శాతం) వాటాలు లాభాలను ఆర్జించాయి. నష్టాలను చవిచూసిన కంపెనీల్లో భారతీ ఎయిర్‌టెల్, వెదాంతా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి. ఇలావుంటే, నిఫ్టీ 3.50 పాయింట్లు పెరిగి, 10,890.30 పాయింట్లకు చేరింది.



తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం

తిరుపతి, జనవరి 16: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పార్వేట ఉత్సవం కనుమ పండుగనాడైన బుధవారం తిరుమలలో అత్యంత ఘనంగా జరిగింది. అలాగే గోదా పరిణయోత్సవం కూడా కన్నుల పండుగగా నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీ గోదాదేవి చెంత నుంచి శ్రీ వారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. ఈ మాలలను శ్రీవారి మూల మూర్తికి అందంగా అలంకరించారు. బుధవారం స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తి అయిన తరువాత శ్రీమలయప్ప స్వామివారు తిరుచ్చిలో వేంచేశారు. వారి వెంటనే మరో తిరుచ్చిపై శ్రీ కృష్ణస్వామి వేంచేశారు. అనంతరం పార్వేట మండపమునకు వెళ్లి, ఆ మండపమునందు పుణ్యాహవచనం జరిగిన తర్వాత మంచెలో వేంచేశారు. శ్రీ స్వామివారికి ఆరాధన, నివేదన, హారతులు జరిగాయి. అనంతరం ఉభయదార్లకు తాళ్లపాక వారికి, మఠం వారికి మర్యాదలు జరిగాక సామ్విివారు మండపం వదిలి ప్రాంగణానికి చేరుకున్నారు. శ్రీకృష్ణ స్వామి వారిని మాత్రం ము సన్నిధి గొల్లపూజ చేసిన చోటుకు వేంచేపు చేసి పాలు, వెన్న ఆరగింపు, హారతి ఇచ్చిన తరువాత శ్రీ మలయప్ప స్వామి వారికి సన్నిధికి వెళ్లారు. తరువాత ఆ గొల్ల సమర్పించిన పాలు, వెన్న శ్రీ మలయప్ప స్వామివారికి నివేదనం చేసి హారతి సమర్పించారు. అనంతరం గొల్లకు బహుమానం అందించారు. ఈ సందర్భంగా శ్రీ మలయప్ప స్వామి వారు ముందునకు కొంత దూరము పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణము వేసి తిరిగి వెనుకకు వచ్చారు. ఇలా మూడుసార్లు స్వామివారు వేటను కొనసాగించగా ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీ మలయప్ప స్వామివారు ఉత్సవాన్ని పూర్తి చేసుకుని మహాద్వారము వద్దకు వచ్చి హాతీరాంజీవారి బెత్తమును తీసుకుని సన్నిధిలోనికి వేంచేయడంతో పార్వేట ఉత్సవం ముగిసినట్లయ్యింది. ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి హరీంద్రనాథ్, పేష్కార్ రమేష్ బాబు, బొక్కసం సెల్ ఇన్చార్జ్ గురురాజ స్వామి, ఫార్‌పతేదారు, శశిధర్, ఇతర ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

పదేళ్లలో 429 పులులను

చంపిన వేటగాళ్లు

- మధ్యప్రదేశ్‌లో గరిష్ట స్థాయిలో 71 పులుల వధ
- 2011లో 80 పులులను బలిగొన్న వైనం



నోయిడా, జనవరి 16: దేశంలో గత పదేళ్లలో అభయారణ్యాల్లో వేటగాళ్లు 429 పులులను వధించారు. ఇందులో మధ్యప్రదేశ్‌లో 71 పులులను చంపారు. ఈ వివరాలను సమాచార హక్కు కింద వెల్లడించారు. 2011లో గరిష్టంగా 80 పులులను వేటగాళ్లు వేటాడి చంపారు. 2015లో కనిష్ట స్థాయిలో వేటగాళ్ల చేతిలో 17 పులులు హతమయ్యాయి. వన్యప్రాణి క్రైమ్ కంట్రోల్‌బ్యూరో పేర్కొంది. ఈ సంస్థను కేంద్రం చట్టబద్ధంగా ఏర్పాటు చేసింది. 2018లో 22 పులులు, 2017లో 25 పులులను, 2016లో 48 పులులను వేటగాళ్లు చంపారు. నోయిడాకు చెందిన న్యాయవాది రంజన్ తోమర్ వన్యప్రాణి చట్టాల కింద ఈ వివరాలను కావాలని సమాచార హక్కు కమిషన్ కోరారు. మొత్తం మీద మధ్యప్రదేశ్‌లో 71 పులులు, మహారాష్ట్ర, కర్నాటకలో 46పోలీసులు, అస్సాం, చత్తీస్‌గడ్‌లో 42 చొప్పున, ఉత్తరాఖండ్‌లో 35 పులులను వేటగాళ్లు చంపినట్లు పోలీసుల రికార్డులు వెల్లడిస్తున్నాయి. తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో 25 చొప్పున, కేరళలో 19, పశ్చిమ బెంగాల్‌లో 12, హర్యానాలో 11, హిమాచల్ ప్రదేశ్‌లో11, ఢిల్లీ ప్రాంతంలో ఆరుపులులు వేటగాళ్ల చేతిలో హతమయ్యాయి. 14 రాష్ట్రాలు, ఢిల్లీ కాకుండా ఇతర కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పులుల వధపై ఎటువంటి సమాచారం లేదు. కాగా కేంద్రం తీసుకుంటున్న చర్యల వల్ల పులుల వధ గణనీయంగా తగ్గుముఖం పట్టింది. వేటగాళ్ల వేటకు ఏనుగులు, పులులు బలవుతున్నాయి. 2008 నుంచి 2018 వరకు పెద్ద పులుల జనాభాపై వివరాలు కూడా అడిగినట్లు సామాజిక కార్యకర్త ఆర్‌టీఐను కోరారు. వేటగాళ్లు వధించిన పులుల కళేబారాలకు సంబంధించి ఏ మేరకు వాటి జంతు చర్మాలను, ఇతర శరీర భాగాలను స్వాధీనం చేసుకున్నారనే అంశంపై వివరాలు లభించలేదు.



హైవేపై పెరిగిన వాహనాల రద్దీ

పల్లె నుంచి పట్నం బాట..!

ఊర్ల నుంచి తిరుగు పయనం

చౌటుప్పల్, జనవరి 16: సంక్రాంతి పండుగను పల్లెల్లో వైభవంగా జరుపుకోని రోజువారి కార్యక్రమాలలో పాల్గొనేందుకు ప్రజలు బుధవారం భాగ్యనగరం బాట పట్టారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో బోగి, సంక్రాంతి, కనుము పండుగను పూర్తి చేసుకున్న ప్రజలు తిరుగు పయనమయ్యారు. ఉదయం పూట ఖాళీగా ఉన్న జాతీయ రహదారి క్రమంగా రద్దీ పెరిగింది. సాయంత్రం వరకు హైవేపై రద్దీ మామూలు కంటే రెట్టింపు అయ్యింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్రాంతి పండుగ రద్దీని తగ్గించడంతో పాటు టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులుతీరకుండా ఉండేందుకు తిరుగు పయనంలో 16వ తేదీ టోల్‌ను రద్దు చేసారు. హైదరాబాద్ వైపుకు వచ్చే వాహనాలకు 16వ తేదీ ఉదయం నుంచి పంతంగి టోల్ వద్ద టోల్ వసూళ్లను నిలిపివేశారు. అర్ధరాత్రి వరకు టోల్ తీయడంతో సంక్రాంతికి వెళ్లిన ప్రజలు ఆలోపై తిరిగి వచ్చేందుకు ప్లాన్‌లు వేసుకోని ప్రయాణం మొదలు పెట్టారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. సిగ్నల్స్, మూలమలుపుల వద్ద ట్రాఫిక్, సివిల్ పోలీసులను ఏర్పాటు చేసింది. పంతంగి టోల్ వద్ద ప్రత్యేక పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసారు.

నేడు లండన్‌కు జగన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17న (శుక్రవారం) కుటుంబ సమేతంగా లండన్ వెళ్ళనున్నారు. జగన్ కుమార్తె హర్ష లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇటీవలే సంకల్ప యాత్రను పూర్తి చేసుకున్న జగన్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. మళ్లీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల హడావుడి ప్రారంభం అవుతుంది కాబట్టి తన కుమార్తెను కలుసుకోవడానికి కుటుంబ సమేతంగా బయలుదేరనున్నారు. ఈ నెల 22న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

విద్యార్థుల మృతిపై దర్యాప్తు నివేదికను సమర్పించండి

మహారాష్ట్రకు బొంబాయి హైకోర్టు ఆదేశం

ముంబయి, జనవరి 16: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కేసు దర్యాప్తుకు సంబంధించిన సమగ్ర వివరాలను తమకు సమర్పించాలని బొంబాయి హైకోర్టు బుధవారం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్‌లు రంజిత్ మోరే భారత దాంగ్రేలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను ఉన్నత దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని విద్యార్థుల తరపున చేసిన అభ్యర్థనను ఆధారంగా చేసుకుని ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంటూ ఈ కేసు దర్యాప్తుకు సంబంధించిన అన్ని రికార్డులను కోర్టుకు సమర్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని పాల్గర్ జిల్లాలోని విరార్‌లోని ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న 14 సంవత్సరాల లోపు వయసున్న ముగ్గురు విద్యార్థులను సరిగ్గా చదవడం లేదంటూ 2014, ఆగస్టులో టీచర్ మందలించింది. దీంతో ఆ ముగ్గురు విద్యార్థులు రెసిడెన్షియల్ స్కూల్ నుంచి అదృశ్యమయ్యారు. ఆ మరునాడే స్కూల్‌కు సమీపంలోని ఒక నదిలో ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు తేలాయి. కేసు నమోదు చేసుకున్న విరార్ పోలీసులు విద్యార్థులు నీట మునగడం వల్లే మృతి చెందారని వచ్చిన మెడికల్ రిపోర్టు ఆధారంగా వారు ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారించారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. తమ పిల్లలు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదంటూ పేర్కొన్నారు. ఈ కేసును సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ బుధవారం బొంబయి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వారి తరపున వాదించిన లాయర్ కిషోర్ రాధేకర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి లేదని, స్కూల్‌లోని టీచర్లలో ఒకరు వారిని చంపి ఉంటారని వాదించారు. పోలీసులు కేసును నిష్పాక్షికంగా దర్యాప్తు చేయనందున దానిని సీబీఐకి బదిలీ చేయాలని ఆయన కోరారు. 'విద్యార్థులను ఒక టీచర్ ఎందుకు చంపుతారు? వైద్య నివేదిక కూడా వారు నీట మునగడం వల్లే మృతి చెందారని పేర్కొంది కదా?' అని ప్రశ్నించిన ధర్మాసనం కేసుకు సంబంధించిన దర్యాప్తు వివరాలను తదుపరి విచారణ తేదీలోగా సమర్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది.



అన్నింటా కథానాయకుడే!

18న ఎన్‌టీఆర్ వర్ధంతి

ధర్మపురి, జనవరి 16: దశాబ్దాలా పాటు సినీరంగాన్ని ఏలిన నందమూరి తారక రామారావు తెలుగుభాషకు, తెలుగు జాతికి దేశవ్యాప్త గుర్తింపునకు ఎనలేని కృషి చేశారు. వెండితెరపైనే కాకుండా రాజకీయ రంగంలోనూ సంచలనాలు సృష్టించి కథానాయకుడయ్యారు. పదమూడేళ్ళ రాజకీయ జీవితంలో అన్నగా తెలుగు ప్రజల నుంచి నీరాజనాలు అందుకునారు. సాంఘిక, పౌరాణిక పాత్రలతో పాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించి తెలుగు చిత్రసీమకు దేశంలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించిపెట్టారు. 13చారిత్రక, 55 జానపద, 186సాంఘిక, 44పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో పాత్రలకు జీవం పోశారు. 1923 మే 28న కృష్ణ జిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకటరామమ్మ దంపతులకు జన్మించారు. 1942లో బసవ రామతారకంను వివాహమాడారు. 1947లో పట్టభద్రుడై, మద్రాసు సర్వీసు కమిషన్ పరీక్షలు రాసి సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగం పొందారు. సినీరంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ నిర్మాత బీ.ఏ.సుబ్బారావు మద్రాసు పిలిపించి, పల్లెటూరిపిల్ల చిత్రంలో కథానాయకుని పాత్ర, 116 రూపాయ పారితోషికం అందించారు. అయితే 1949లో విడుదలైన మనదేశం ఆయన కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రమైంది. తర్వాత మద్రాసులో దర్శకుడు యోగానంద్‌తో కలిసి చిన్న గదికి మకాం మార్చారు. 1951లో నటించిన నాటికీ, నేటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన పాతాళ భైరవి చిత్రం 10కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకుంది. 1956లో మాయా బజార్ చిత్రానికి ఎన్టీఆర్ తీసుకున్న 7500రూపాయల పారితోషికం అత్యధికం. అడవి రాముడు, యమగోల బాక్సాఫీసు విజయాలు సాధించాయి. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ ప్రజాసేవవైపు తమ దృష్టి మరల్చారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం 9మాసాల కాల వ్యవధిలోనే అప్పటి వరకు కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్రరాష్ట్ర పరిపాలనా పగ్గాలు చేతబుచ్చుకుని, 8ఏళ్ళు ముఖ్యమంత్రిగా ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. ఆత్మగౌరవ పునర్దురణే పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి, సర్వంతామే అయి, 1983 జనవరి 7 ప్రకటిత ఫలితాలలో 199 శాసనసభ స్థానాలను సునాయాసంగా గెలుచుకుని, 97ఏళ్ళ కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయగలిగారు. టీడీపీ వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్‌రావు, 1984 ఆగస్టు 16న ప్రధాని ఇందిర, గవర్నర్ రాంలాల్‌ల సహకారంతో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ ఫలితంగా సెప్టెంబర్ 16న తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. 1985 జూన్ 1న శాసనమండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్దుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989లో మొత్తం మంత్రి వర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరిచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక పాత్ర, రెండు రూపాయాల కిలోబియ్యం పథకం, సంపూర్ణ మద్యనిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా, 1991లో నంద్యాలలో గౌరవ సూచకంగా నాటి ప్రధాని పీవీకి పోటీ పెట్టలేదు. 1989-94మధ్య ప్రతిపక్షపార్టీ నేతగా, 1993లో లక్ష్మీపార్వతిని వివాహమాడడం, సాహచర్యం తారకరాముని రాజకీయ ప్రస్తానంలో ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి.

ఫెడరల్ ఉద్యోగులకు ఉచిత భోజనం

అమెరికాలో ఔదార్యం చాటుకున్న సిక్కులు

హ్యూస్టన్, జనవరి 16: అమెరికాలో నాలుగో వారానికి చేరుకున్న పాక్షిక షట్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న తోటి ఉద్యోగులకు సిక్కు మతస్థులు తమ వంతుగా వారికి ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. టెక్సాస్, సాన్ ఆంటోనియా ప్రాంతాలలో షట్‌డౌన్ వల్ల జీతం లేక ఉచితంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తమ వంతుగా ఈనెల 11 నుంచి ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేసినట్టు సాన్ ఆంటోనియాలోని సిక్కు సెంటర్ అధ్యక్షుడు బల్వీందర్ ధిల్లాన్ తెలిపారు. తమ వంతు సాయంగా తమ తోటి ఉద్యోగులకు వేడివేడి శాకాహార భోజనాన్ని తమ గురుద్వార్‌ల ద్వారా అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇప్పటికే షట్‌డౌన్ వల్ల ఇబ్బందులను పడుతున్న ఉద్యోగులను ఆదుకోవడానికి అమెరికాలోని పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని, తాము కూడా తమ వంతుగా వారికి ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఇలావుండగా, మెక్సికో సరిహద్దు వద్ద అక్రమ చొరబాటుదారులు అమెరికాలో ప్రవేశించకుండా అక్కడ గోడ నిర్మించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబడుతుండగా, 5.7 బిలియన్ డాలర్లతో గోడ కట్టి ప్రజాధనాన్ని వృథా చేయడానికి తాము అంగీకరించమని విపక్ష డెమోక్రాట్లు భీష్మించారు. దీంతో తమ డిమాండ్ అంగీకరించే వరకు ఎలాంటి నిధులు విడుదల చేసేది లేదని ట్రంప్ పేర్కొంటూ పాక్షిక షట్‌డౌన్‌కు పూనుకోవడంతో దేశంలోని 8 లక్షల మంది ఫెడర్ ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాలు లేకుండానే ఉచితంగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాక్షిక షట్‌డౌన్ నాలుగో వారానికి చేరుకోవడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడమే కాక, ఉద్యోగులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అమెరికా హెల్త్‌కేర్ స్కాంలో భారత్ డాక్టర్

- స్కాం విలువ 464 మిలియన్ డాలర్లు
- ఏడు మిలియన్ డాలర్ల బాండ్‌పై రాజేంద్ర విడుదల
- అమెరికా జిల్లా కోర్టు ఆదేశం

హూస్టన్, జనవరి 16: అమెరికాలో అతి పెద్ద హెల్త్‌కేర్ స్కాంలో భారత సంతతికి చెందిన ఇండో అమెరికా డాక్టర్ , పద్మశ్రీ గ్రహీత డాక్టర్ రాజేంద్ర బోత్రాకు అమెరికా జిల్లా కోర్టు ఏడు మిలియన్ డాలర్ల బాండ్‌పైన విడుదల చేసింది. డాక్టర్ రాజేంద్రపై అమెరికా పోలీసులు 464 మిలియన్ డాలర్ల హెల్త్ కేర్ స్కాంలో కేసు నమోదు చేశారు. బాండ్‌పై డాక్టర్ రాజేంద్రను విడుదల చేయడాన్ని ప్రభుత్వం వ్యతిరేకించింది. బెయిల్‌పై విడుదల చేయడం వల్ల రాజేంద్ర దేశాన్ని విడిచి పారిపోతారని కూడా ప్రభుత్వం వాదించింది. బాండ్‌పై రాజేంద్రను విడుదల చేస్తూ జడ్జి స్టీఫెన్ మర్ఫీ ఆదేశాలు జారీ చేశారు. ఈ వివరాలను డెట్రాయిట్ న్యూస్ ఏజన్సీ ప్రకటించింది. ఆయన బ్లూమ్‌ఫీల్డ్ హిల్స్‌లో ఉంటున్నారు. అమెరికా చరిత్రలో ఇంత పెద్ద హెల్త్‌కేర్ స్కాం నమోదు కాలేదని పోలీసులు చెప్పారు. రిటైర్డయిన తర్వాత తనకు వచ్చే బెనిఫిట్ 8.5 బిలియన్ డాలర్లను పూచీకత్తుగా కోర్టుకు రాజేంద్ర సమర్పించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు మూడు రోజులు పడుతుంది. ఈ విచారణకు రాజేంద్ర భార్య, కుమార్తె హాజరయ్యారు. వీరు తమ పాస్‌పోర్టులను కూడా కోర్టుకు సమర్పించారు. బోత్రాకు భారత్‌తో సంబంధాలు ఉన్నాయని, పెట్టుబడులు పెట్టారని, ఆస్తులు ఉన్నాయని అమెరికా దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది . బోత్రా ఇండియన్ అమెరికన్ రిపబ్లికన్ పార్టీలో నిధుల సేకరణలో కీలకపాత్రవహించారు. 1980, 1990 దశకంలో ఆయన జార్జి హెచ్ డబ్ల్యు బుష్, ఇతర రిపబ్లికన్ చట్టసభ్యులకు నిధులను సేకరించడంలో చురుకైన పాత్ర పోషించినట్లు పోలీసులు చెప్పారు. సంవత్సరానికి ఎనిమిది వారాల పాటు ఆయన భారత్‌కు వచ్చి ఇక్కడ ఉచితంగా వైద్య సేవలు అందిస్తుంటారు. ఇంకా వైద్య కళాశాలల్లో ఉపన్యాసాలు ఇస్తుంటారు. నర్గీస్ దత్ ఫౌండేషన్‌కు ఆయన పనిచేశారు. పొగాకు సేవించడం, హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ఆయన విశేషంగా కృషి చేశారు. బోత్రాకు 35 మిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నట్లు ప్రాసిక్యూటర్లు చెబుతున్నారు. బోత్రాకు మెట్రో డెట్రాయిట్‌లో 22 ఆస్తులు ఉన్నట్లు అమెరికా అటార్నీ బ్రాండీ మెక్ మిలియన్ చెప్పారు.

హిరానీ లాంటి వ్యక్తిపై ఆరోపణలా?

'మీటూ'లో దర్శకుడికి మద్దతు ప్రకటించిన బాలీవుడ్ రచయిత జావేద్ అఖ్తర్

ముంబై, జనవరి 16: లైంగిక వేధింపుల ఆరోణలు తగ్గుముఖం పట్టాయనుకున్న తరుణంలో ఓ మహిళ బాలీవుడ్‌లో పెద్ద బాంబు పేల్చారు. అయితే రాజ్‌కుమార్ హిరానీ అలాంటి వ్యక్తి కాదని ఎందరో బాలీవుడ్ ప్రముఖులు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. 3 ఇడియట్స్, మున్నాభాయ్ ఎంబీబీఎస్, సంజు చిత్రాల దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ తనను లైంగికంగా వేధించారంటూ ఓ మహిళ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

అయితే రాజ్‌కుమార్ హిరానీ అలాంటి వారు కాదని తాజాగా బాలీవుడ్ రచయిత జావేద్ అఖ్తర్ ఆయనకు అండగా నిలుస్తున్నారు. సంజు సినిమా కోసం పనిచేస్తున్న సమయంలో హిరానీ తనను లైంగికంగా వేధించారని బాధితురాలు ఆరోపించారు. అయితే ఇండస్ట్రీ మొత్తం హిరానీ వ్యక్తిత్వం తమకు తెలుసునంటూ ఆయనకు నైతిక మద్దతు తెలిపారు. నటి దియామీర్జా, బోనీ కపూర్, అర్షద్ వార్సీ, ఇమ్రాన్ హష్మి ఇది వరకే మద్దతు ప్రకటించగా, ఆ జాబితాలో రచయిత జావేద్ అఖ్తర్ చేరారు. రాజ్‌కుమార్ చాలా మంచివాడు. ఆయనపై ఆరోపణలు వచ్చాయంటే నమ్మశక్యంగా లేదు. హిరానీ ఎప్పటికీ అలాంటి పనిచేయడు అన్నారు. ఁఆయన ఏ ఒక్కరితో దురుసుగా ప్రవర్తించడం చూడా తాను చూడలేదన్నారు. అలాంటిది అకస్మాత్తుగా ఒకరు వచ్చి ఆయనపై ఆరోపణలు చేస్తే నమ్ముతారా అని ప్రశ్నించాడు. విషయం తెలిసిన తర్వాతే ఒకరి వ్యక్తిత్వంపై ఓ నిర్ణయానికి రావాలని, అప్పటిదాకా వేచి చూడటం అందరికీ మంచిదని సూచించాడు.

హిరానీపై వచ్చినవి కేవలం ఆరోపణలేనని, నిజాలు తేలేవరకు మౌనం పాటించాలని అన్నారు. ఆరోపణలు వచ్చిన వెంటనే ఆవేశంతో స్పందించకుండా, నిజం తేలేదాకా వేచిచూసే ధోరణి పాటించాలని సలహా ఇచ్చాడు. ఇవి కేవలం ఆరోపణలు మాత్రమే. అయినా హిరానీ వీటిని కొట్టిపారేశారు కూడా. నిజ నిర్ధారణ జరిగేంత వరకు ఈ విషయం గురించి కామెంట్ చేయకపోవడమే మంచిని అని అభిప్రాయ పడ్డాడు. 'నేను 1965లో సినిమా పరిశ్రమకు వచ్చాను. ఇన్నేళ్ల కాలంలో అందరితో కలిసి పనిచేశాను. చాలా మంది గురించి నాకు బాగా తెలుసు. అందులో ముఖ్యంగా రాజ్‌కుమార్ హిరానీ లాంటి మంచి వ్యక్తి నాకు నచ్చిన వారిలో ముందుంటాడు. పరిశ్రమలో తను కలుసుకున్న అత్యంత మంచి వ్యక్తులలో హిరానీ ఒకరు' అని వ్యాఖ్యానించారు జావేద్ అఖ్తర్. మీటూ విషయంలో పరిశ్రమ నిశ్శబ్దంగా ఉంది. కానీ హిరానీ లాంటి వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడంతో అంతా అలర్టయ్యారు. హిరానీకి తమ మద్దతు ప్రకటించారు.

చట్ట ఉల్లంఘనే

జేఎన్‌యూ చార్జిషీట్‌పై మాజీ ఐఏఎస్

న్యూఢిల్లీ, జనవరి 16: దేశ రాజధాని ఢిల్లీలోని జేఎన్‌యూ కేసులో విద్యార్థినేతలపై దేశద్రోహం కింద చార్జిషీట్ దాఖలు చేయడాన్ని మాజీ ఐఏఎస్ అధికారి షా ఫైజల్ తప్పుపట్టారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్యకుమార్ తదితరులపై దేశద్రోహం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఒక సభలో మాట్లాడిన వాటిని వక్రీకరించి తీవ్రమైన చార్జిషీట్ దాఖలు చేయడం దారుణమని బుధవారం ఆయన అన్నారు. సంఘటన జరిగి మూడేళ్లయిన తరువాత ఢిల్లీ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కుమార్, మరో తొమ్మిది మంది జాతివ్యతిరేక నినాదాలు ఇచ్చారని అభియోగాలు నమోదయ్యాయి. 'ఐపీసీ 124ఏ సెక్షన్‌కు చార్జిషీట్ పూర్తి విరుద్ధం. ఒక విధంగా చట్టాన్ని ఉల్లంఘించడమే'అని విమర్శించారు. 1200 పేజీల చార్జిషీట్‌లో ఏడుగురు కాశ్మీరీల పేర్లు ఉండడం దుర్మార్గమని ఫైజల్ ట్వీట్‌లో మండిపడ్డారు.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావింపటయే
పరమోన్నత సంస్కారము
నరకముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం, 17 జనవరి 2019

కుంభమేళాలో నృత్య ప్రదర్శనకు శుభాన్వితకు ఆహ్వానం



రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో పలు అవార్డులను అందుకున్న కుమారి శుభాన్విత అలహాబాద్ (ప్రయాగరాజ్)లో జరుగుతున్న కుంభ మేళాలో నృత్య ప్రదర్శనకు ఎంపికైంది. సి.సి.ఆర్.టి. స్కాలర్‌షిప్ అందుకుంటున్న శుభాన్విత తెలంగాణ ప్రభుత్వం నుండి బాలరత్న అవార్డునూ పొందింది. 'దేశవ్యాప్తంగా 50 మంది నృత్య కళాకారులను ఎంపిక చేయగా, తెలంగాణ నుండి భరత నాట్యం కేటగిరిలో కేవలం శుభాన్వితకే ఈ అవకాశం దక్కింద'ని, ఆమె గురువు, ఉత్తర సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (యుసిపిఏ) వ్యవస్థాపకురాలు శ్రీమతి గీతా గణేశన్ హర్షం వెలిబుచ్చారు.

యువతలో గుప్పుగుప్పుమంటోంది




మనిషి దశలలో చాలా ప్రముఖమైనది యుక్తవయస్సు. యుక్తవయసులో కలిగే అనుభవాలు మనిషి జీవితాంతం వెన్నంటే ఉంటాయి. ఉన్నత స్థితికి ఎదగాలంటే యుక్తవయసులో తీసుకునే నిర్ణయాలు ప్రధానమైనవి. మధుర స్మృతులు కావచ్చు లేదా మచ్చగా మిగిలే గాయాలుకావచ్చు. బంగారం లాంటి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువత ఒక్కొక్క అడుగువేయాలి. యుక్తవయసులోనే శారీరక, మానసిక పరిపక్వత అభివృద్ధి చెందుతాయి. ఈ వయస్సులో కొత్త అంశాలను కనుగొనడానికి, శోధించడానికి ప్రయత్నాలు చేయడంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. ఇటీవల యువత కొత్త పుంతలు తొక్కుతోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగంతో మంచి కంటే ఎక్కువ చెడుకే సులభంగా, తొందరగా ప్రభావితమవుతున్నారు. ప్రస్తుతం సరదాగా యువత చేసుకుంటున్న స్మోకింగ్ (ధూమపానం) అలవాటే జీవితాంతం కొనసాగే చెడు అలవాటుగా మారుతోంది. ఇది కాస్తా వ్యసనంగామారి క్రమంగా ప్రాణాల మీదికి తెస్తుంది. ధూమపానం చేసే వారి యువత సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. సిగరెట్లు కాల్చేందుకు డబ్బులు ఖర్చుపెట్టిన దానికంటే.. ధూమపానంతో వచ్చే వ్యాధులను తగ్గించుకునేందుకు వందల రెట్ల రూపాయలు అధికంగా ఖర్చుపెట్టినాగాని, పొగాకు పదార్థాల ప్యాకెట్లపై తేలు బొమ్మ, కాన్సర్ రోగి బొమ్మను ముద్రించినా, సిగరెట్ ధర ఎంత పెంచినా, బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేధించినా, చెల్లించక తప్పదు భారీ మూల్యం, ధూమపానం ప్రాణాంతకం అని తెలిసినా సిగరెట్ అమ్మకాలు, పొగాకుప్రియుల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయే గాని తగ్గడం లేదు.

సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ ప్రస్తుతం యువతలో విపరీతంగా పెరిగిపోతోంది. తమ ఆరోగ్యాన్ని తమే పాడుచేసుకుంటున్నామన్న సోయి మరిచిపోయి, పొగను రింగులు రింగులుగా వదులుతూ, విలాసంగా సిగరెట్ కాలుస్తున్నానన్న భ్రమలో తేలియాడుతూ యువత తమ జీవితాన్ని చేజేతులా బూడిద చేసుకుంటున్నారు.

ధూమపానం ప్రాణాంతకమే: ధూమపానంవల్ల వ్యక్తులలో నోటి కాన్సర్, దంత వ్యాధులు, ఊపిరి తిత్తుల క్యాన్సర్, ఉదరకోశ వ్యాధులు, అల్సర్, గ్యాస్ట్రబుల్, ఉదర కోశ క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువ. సెకండ్ హ్యాండ్ స్మోకింగ్ కారణంగా పిల్లల్లో ఆస్తమా రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. గుండెకు సంబంధించిన రక్తనాళాలు దెబ్బతిని రక్తపోటు, గుండెపోటు సంభవిస్తాయి. మెదడులోని రక్తనాళాలు చిట్లి పక్షవాతం, నరాల బలహీనత ఏర్పడే ప్రమాదం ఉంది. పిల్లల్లో వినికిడి, మాట్లాడే సమస్యలు తలెత్తుతాయి. ధూమపానం చేసే వారిండ్లలో ఉన్న పిల్లలకు ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి.

తాగే వాడికన్నా గుప్పుగుప్పుమంటూ వదిలే పొగ పీల్చిన వ్యక్తులకు సైతం ఆయుక్షీణం కలుగుతోంది.

బలహీనతలే కారణమా...: పొగ తాగడం మానేయ్యాలనే ఆలోచన వచ్చినా అమలులోమాత్రం సాధ్యం కావడంలేదనే వారు ఎక్కువయ్యారు. ఒక చెడు మొక్కను నిర్మూలించాలని ఆకులు, కొమ్మలు, కాండంలను నరికివేసినంత మాత్రాన చెడు మొక్క పూర్తిగా నశించదు. మరలా కొద్దిరోజులకు మళ్లీ మొలకెత్తుతుందనే విషయం మనకందరికీ తెలుసు. ఆ చెడు మొక్కను వేర్లతోసహా, నామరూపాలు లేకుండా పెకిలివేసినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. పొగ తాగడం మానేయాలనుకోవడం మంచి నిర్ణయమే. పొగ తాగడం మానేయాలనే ఆలోచనను ఆచరణలో పెట్టాలంటే మాత్రం తప్పకుండా ప్రణాళిక రూపొందించుకోవాలి. పొగ తాగే వ్యసన పరులందరికీ ఒకే రకమైన నియమాలు పనిచేయవనే విషయాన్ని ముందుగా గుర్తించడం మంచిది. పొగ తాగడాన్ని ఎందుకు మానేయాలనుకుంటున్నారో మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవాలి. మీ బలాలు, బలహీనతలను తెలుసుకోండి. సిగరెట్ తాగడానికి మిమ్మల్ని ఏ పరిస్థితులు ప్రేరేపిస్తున్నాయో గమనించండి. సిగరెట్లు మానేయడం సులువే. పొగతాగడం మానివేసే సమయంలో ఉత్పన్నమయ్యే అసహనం, ఆందోళన వంటి లక్షణాలు అగుపిస్తాయి. వీటిని దృఢ సంకల్పంతో ధీమాగా ఎదుర్కోవాలి.



ధూమపానం చేసేవారు ప్రతిరోజు క్రమం తప్పకుండా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగితే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఒక అధ్యయనంలో వెల్లడైంది.

యువత ధూమపానానికి దూరంగా ఉండటానికి సహాయపడే కొన్ని చిట్కాలు:

గ్లాసు పాలు: డ్యూక్ యూనివర్సిటీ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, ధూమపానం చేసేముందు ఒక గ్లాసు పాలు తాగడం మూలంగా సిగరెట్ రుచి పట్ల ఆసక్తి ఉండదని తెలియచేసింది. సిగరెట్ ఆలోచన మనసుకు రాగానే, ముందుగా ఒక గ్లాసు పాలు త్రాగితే మంచి ఫలితం ఉంటుంది.

గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ: ధూమపానం చేసేవారు ప్రతిరోజూ క్రమం తప్పకుండా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగితే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఒక అధ్యయనంలో వెల్లడైంది.

విటమిన్ సి,ఇ: నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం రోజులో కనీసం 35 మిల్లీగ్రాముల విటమిన్-సి తీసుకోవాలి. అయితే పొగాకు తినేవారిలో వచ్చే విటమిన్-సి లోపం కారణంగా గుండె జబ్బులు, కేన్సర్ బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటే పొగాకు వ్యసనంనుంచి బయటపడవచ్చు. విటమిన్ ఇ ఎక్కువగా తీసుకుంటే ధూమపానం వలన వచ్చే అనారోగ్య సమస్యలను నివారించవచ్చు.

తల్లిదండ్రులూ బాధ్యతగా తీసుకోండి:

మార్గదర్శి: తల్లిదండ్రులకు సిగరెట్ కాల్చడం ఒక అలవాటుగా ఉన్నట్లయితే యుక్తవయస్సులోని పిల్లల పరిశీలిస్తూ, వారు కూడా అలవాటుగా చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులుగా బాధ్యతగా తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టి యందుంచుకుని సాధ్యమైనంత త్వరగా పొగ తాగడం అలవాటును మానుకోవాలి. ధూమపానం నిర్మూలన దిశగా వ్యతిరేకంగా కఠినమైన నిబంధనలను, నియమాలను నిర్దేశిస్తూ చిన్నవయస్సులోనే ధూమపానానికి అలవాటుపడటం మంచిదికాదని పిల్లలను హెచ్చరిస్తూ ఉండాలి. ధూమపానం ఎంతమాత్రమూ మంచి అలవాటుకాదని దృఢంగా కచ్చితంగా చెప్పాలి.

మనస్తత్వం: యుక్తవయస్సులోని పిల్లలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ వారితో మాట్లాడుతూ వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలి. యుక్త వయసు పిల్లల్లో కొత్త అంశాలపైపుగా మొగ్గుచూపుతూ వాటి ఆకర్షణకు లోనవుతూ ఉంటారు. స్నేహ బృందంతో కలిసి పోవడానికి, వారిదగ్గర మెప్పుపొందడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. సరైన సమయంలో జోక్యం చేసుకుని, వారికి సరైన మార్గదర్శం చేయడం ద్వారా ధూమపానంనకు దూరంగా ఉండేందుకు ప్రోత్సహిస్తూ ఉండాలి.

మంచి చెడు: ధూమపానం చేయడంవలన కలిగే దుష్ప్రయోజనాలను, జీవితకాల వ్యసనంగా ఎలా మారుతుందో తెలియజేయాలి. సిగరెట్‌లో ఉండే హానికారక రసాయనాలు గురించి మరియు శ్వాస క్రియా వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె సమస్యలు మొదలైన పలు ఆరోగ్య సమస్యలు ఏవిధంగా సంభవిస్తాయో వారికి తెలియజేయాలి. మంచి చెడులను వివరిస్తూ ఉండాలి.

స్నేహితుడిగా భరోసా: ధూమపానం మానేయడం మూలంగా స్నేహితులు దూరమవుతారని, వారి అభిమానంకోసం తన స్నేహితులు చెప్పినవాటికి 'లేదు'అని చెప్పడానికి మీ యుక్తవయస్సులోని పిల్లలు భయపడవచ్చు. యుక్తవయస్సులోని పిల్లలతో మాట్లాడి, వారు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడాలి. కొన్ని దురలవాట్లకు 'లేదు' అని చెప్పడం వలన జీవితాంతం సుఖంగా జీవించవచ్చని వారికి చెప్పాలి. తల్లిదండ్రులు ఒక స్నేహితుడిగా భరోసాను పిల్లలలో నింపుతూ ఉండాలి. తల్లిదండ్రులు యుక్తవయస్సులోని పిల్లలు బాధ్యతాయుతమైన వయోజనులుగా ఎదగడానికి కీలక పాత్రను పోషించాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రులు సరైన సమయంలో జోక్యంచేసుకుని, సరైన మార్గదర్శకం అందించి, పిల్లలకు బాసటగా నిలిచినప్పుడు సరైనమార్గంలో పయనిస్తారు. ఉన్నతస్థాయికి ఎదగగలుగుతారు.

కౌన్సెలింగ్: యువత ధూమపానం అలవాటును దూరంచేసుకోవడానికి సైకాలజిస్ట్ ద్వారా కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిది. లక్ష్యం వైపుగా పయనించడానికి కౌన్సెలింగ్ ద్వారా సాధించడం సులువవుతుంది.

- డా.అట్ల శ్రీనివాస్‌రెడ్డి



సంధ్యా సమీరాలు



కమ్మగానో కరకుగానో- సెన్సిటివ్‌గానో, సీరియస్‌గానో- ఘర్షణలతోనో సంఘర్షణలతోనో- పడుతూ లేస్తూనో, లేస్తూ పడుతూనో... ఆరుపదుల జీవితాన్ని చూసిన తర్వాత భవిష్య జీవితం ఆవలి తీరానికి చేరుకున్నట్లే!

చూసిన జీవితం కంటే చూడాల్సిన జీవితం చిన్నదే! అనుభవాల ముడుతలు పసిమి రంగును సింగారించుకుంటుండగా-

ఆవలి తీరాన అలిగినా అలక తీర్చే వారుండరు. కోపాలు, తాపాలు కరగాల్సిందే.

కన్నీళ్ళు సైతం కనురెప్పల మాటున దాగాల్సిందే. దేన్నీ దాచుకోవాల్సిన అవసరం లేని వయసు తీరం ఇది. సంపాదించిన డబ్బేకాదు, ఏ సంపాదననైనా ఖర్చుపెట్టుకోవాల్సిన వయస్సు... పది మందికీ ఉపకరించాల్సిన మనసు- ఈ ఆవలి తీరానిది.

❖ ❖ ❖

కరిగిన కాలంకంటే కరగాల్సిన కాలం నిడివి తక్కువే! వెంట తెచ్చుకున్నదేదీ లేదు. కాబట్టి వెంట తీసుకుపోయేదీ ఏదీ ఉండదు!! జనన మరణాల మధ్య జీవించే బ్రతుకులో కూడబెట్టుకున్నదేదైనా ఇక్కడ ఖర్చు కావలసిందే!!

మనం అయినా ఖర్చు పెట్టుకోవాలి. లేదా మనవారో మనకయినవారో, మరెవరో ఖర్చుపెట్టాల్సిందే. కాబట్టి సంపాదనను ఉట్టికి కట్టి చూస్తూ చప్పరిస్తూ కూర్చుంటే ఆ ఉట్టి తరగదు కానీ మన జీవితం ఉత్తగానే, చప్పగానే కరిగిపోతుంటుంది.

❖ ❖ ❖

మన సంతానమే.. మన పిల్లలే మన మనవలు, మనవరాండ్రే. మన సంపాదనను సంపదల రూపేణా వారికి గిఫ్ట్‌గా ఇవ్వాల్సిందే! అయితే ఈ గిఫ్ట్‌కంటే వారికి సంపాదించుకునే మార్గాలను, సంపాదించుకునే అర్హతలను గిఫ్ట్‌గా ఇవ్వగలిగితే బాధ్యతగా వ్యవహరించినట్టు అవుతుంది, సంతృప్తీ మిగులుతుంది.

మన సంపద వారికి కానుకే అయినా దాని మెరుపు వారి కళ్లలో కనిపించేది బహుకొద్ది కాలమే... వారి కాళ్లమీద వారిని నిలబడేలా చేయగలిగితే వారి జీవితంలో ప్రతిఫలించే ఆత్మవిశ్వాసం మనకు చివరి శ్వాస వరకూ మెరుపు అవుతుంది.

మన సంపాదనను సంపూర్ణంగా మనవారికోసమేకాక కొంత మొత్తాన్ని ఈ సమాజానికి ఇవ్వాల్సిన బాధ్యత మనమీదుంది. కుటుంబంతోపాటు సమాజమూ మనకు జీవితాన్నిచ్చిందన్న వాస్తవాన్ని మరవకూడదు. కాబట్టి, ఆ సమాజానికి మనమూ ఎంతోకొంత ఇవ్వాల్సిన బాధ్యత మనమీదుంది. దాన్ని సమాజం విరాళం అనవచ్చుగాక, ఆ మొత్తం ఒక జీవితాన్నో, మరికొన్ని జీవితాలనో నిలబెడుతుంది.

❖ ❖ ❖

తొలి శ్వాసతో పుడమితల్లిని ముద్దిడిన క్షణంలో మనదంతా నగ్నతే... తుది శ్వాసలో, మట్టిలో మమేకమవుతున్న తరుణంలోను మనదంతా నగ్నతే! మధ్యన జీవితం ఎన్ని రంగులను సంతరించుకున్నా, ఎన్ని కీర్తికిరీటాలను ధరించినా, ఎన్ని సత్కారాలను పొందినా-అన్నీ ఇక్కడివరకే- అన్నీ చివరి శ్వాసలో లయించిపోవలసిందే! ఎంతటి ఘనకీర్తి అయినా మనం లేని తరుణం నుండి క్రమేణా కాలగర్భాన్ని చేరవలసిందే! కాబట్టి, మన 'మంచి' ఒక్కటే పెరుగుతూ పోతుంటుంది... అది 'విత్తనం'గా కనిపించకపోవచ్చు కానీ, వృక్షంలా నీడనిస్తూనే ఉంటుంది.

❖ ❖ ❖

ఆరు పదుల రిటైర్మెంట్‌లో అప్పటివరకు సంసార అవసరాలకు ఆదుకున్న సంపాదన గ్రాట్యుటీ రూపంలోనో, పెన్షన్ రూపంలోనో చేరుకుంటున్నప్పుడు వయసు పైబడుతున్న దంపతులకు అది 'తమ' అవసరాలకు పరిమితం కావాలి. తమ ఆనందానికే పరిమితం కావాలి. చూడని ప్రపంచాన్ని చూడటానికి ఉపకరించాలి.

నిజమే, వయసు సహకరించక పోవచ్చు. ఆరోగ్యమూ సహకరించడం లేదనిపించవచ్చు- అయినా, మనసుకు మల్లెల పరిమళాన్ని అద్దండి. కాళ్లు పరుగులు తీస్తాయి. ఆరోగ్యమూ సహజీవనానికొస్తుంది. నిజం, వయసు పైబడుతుంటే చూపు మసకబారవచ్చు... అయినా ఆ మసక చూపులోనే ఎంతో మెరుపు చోటుచేసుకుంటుంది.

అప్పుడనిపిస్తుంది- సంపాదన కేవలం జేబులు నింపుకోవడానికే కాదు, సంసార అవసరాలమటుకే కాదు, బాంక్ బాలెన్స్‌ల వరకే కాదు అని. ఇలా అనిపించటమే సంపాదనకు కొసమెరుపు.

❖ ❖ ❖

సేవింగ్స్ అకౌంట్స్, రికరింగ్ డిపాజిట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్స్, లాకర్స్ ఇలా ఎన్ని ఉన్నా మనకు కావలసింది ముప్పొద్దులా ఆహారం, కంటి నిండా నిద్రించటానికి ఒక మంచం. ఎంతటి ఇంద్ర భవనం ఉన్నా, ఎకరాలలో ఫార్మ్‌హౌస్ ఉన్నా చివరి వరకు కావలసింది అలుపుతీర్చే నిద్ర, ఆరోగ్యాన్నిచ్చే ఆహారం.

❖ ❖ ❖


మన పిల్లలు- మన సంసారం - ఈ జీవితం వేరు. మన పిల్లలు-వారి సంసారం- జీవితం వేరు.

ఆరుపదుల జీవితంలో ఈవలి తీర ఛాలెంజెస్ వేరు. ఆవలి తీర ఛాలెంజెస్ వేరు. ఈ వయసులో మన జీవితమే మనకు ఛాలెంజ్ కాకూడదు అంతే!

మొత్తానికి- వయసు, మనసు, కుటుంబం, సమాజం- ఆరుపదుల వరకు 'నా' అనుకున్నవన్నీ మెల్లిమెల్లిగా ప్రశ్నార్థకాలుగా రూపుదిద్దుకుంటుంటాయి.

అయితే, ఆవలి తీర జీవితం సమాధానాలను తడుముకోవాల్సిన ప్రశ్నపత్రం కాదు. సమాధానాలను నెమరేసుకుంటూ సమాధాన పడవలసిన సంధ్యా సమీరం.

- విశ్వర్షి వాసిలి




జ్ఞాపకశక్తి కోసం..



ఒక్కోసారి ఎవరైనా వ్యక్తి పేరుగానీ, ఏదైనా స్థలం పేరుగానీ, ఏదైనా వస్తువును ఎక్కడ పెట్టామో కానీ ఎంత ప్రయత్నించినా గుర్తుకు రాదు. వయసుతోపాటు జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతుందని చిన్నప్పటి నుండి వింటూ వచ్చాం. అలాగే వయసుతో పాటు వివేచనాశక్తి, ప్రతిస్పందనలూ మందగిస్తాయని కూడా ఎప్పటినుంచో వింటున్నాం. ఎంత వయసు పెరిగినా కూడా ప్రయత్నంతో మెదడును తిరిగి ఉద్దీపనం చేసుకోవచ్చని ఇటీవలి పరిశోధనలు చెబుతున్నాయి. అందువల్ల జ్ఞాపకశక్తిని తిరిగి పునరుద్ధరించుకోవాలనుకుంటే ఈ చిన్న చిన్న సలహాలు, సూచనలను ప్రయత్నించాలి.

❖ జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడానికి దానిని సవాలు చేయడం లేదా కొత్త అలవాట్లను నేర్చుకోవడం ఒక విధానం. ఏదైనా కళలు లేదా కొత్త భాషను నేర్చుకోవడానికి ప్రయత్నించడం వంటివి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. కాబట్టి స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో ఆన్‌లైన్ ఆటలు ఆడాలి. అవి మన ఆలోచనలకు పదును పెడతాయి. ఇలాంటి సమయంలోనే మనకు మనమే సవాల్ విసురుకోవాలి.. అంటే ఈ ఆటలో మనం ఎంత స్కోరు చేయాలి. ఎంత మందిని ఓడించాలి వంటివన్నమాట.

❖ సంగీతం ఒక ప్రత్యేక విధానంలో మెదడును ఉద్దీపన చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి సంగీతంపై ఇష్టం పెంచుకోవాలి. ఏదైనా సంగీతాన్ని వింటున్నప్పుడు వారి మెదడును స్కాన్‌చేస్తే, అది చాలా చైతన్యవంతంగా ఉన్నట్లు గుర్తించారు పరిశోధకులు. కాబట్టి సంగీతం మన సాధారణ గ్రహణశక్తిని మెరుగుపరుస్తుంది. డిమెన్షియా వంటి వ్యాధుల్లో చివరగా చెరిగిపోయేవి సంగీతపరమైన జ్ఞాపకాలే అని కూడా గుర్తించారు పరిశోధకులు.



* వ్యాయామం వల్ల శరీరానికే కాదు మెదడుకు కూడా చాలా మంచిది. వ్యాయామం వల్ల మెదడులో కొత్త శక్తి మొదలవుతుంది. మెదడులో కొత్త సంబంధాలు ఏర్పడతాయి. అలాగే కొత్తకణాలు ఉత్పత్తి అవుతాయి. నిజంగానే.. వ్యాయామం వల్ల శరీరం ఎక్కువ ఆక్సిజన్‌ను గ్రహిస్తుంది. ఇలా మెదడుకు ఎక్కువ ఆక్సిజన్, గ్లూకోజ్ అందితే శరీరంలో టాక్సిన్ల నిర్మూలన జరుగుతుంది. అందుకని వ్యాయామాన్ని ఆరుబయట చేస్తే మరీ మంచిది. దీనివల్ల మెదడుకు ఆక్సిజన్ అందడమే కాకుండా, శరీరానికి విటమిన్ 'డి' కూడా లభిస్తుంది. కొత్త వాతావరణంలో, కొత్త తరహాలో వ్యామాయం చేయడానికి ప్రయత్నించాలి. గార్డెనింగ్ ఇష్టమైతే, గార్డెనింగ్ అలవాటున్నవారితో కలిసి పనిచేస్తే మరీ మంచిది. దీనివల్ల శరీరానికి వ్యాయామం లభించడంతో పాటు మెదడు కూడా చురుగ్గా మారుతుంది.

* నిజానికి జీవితంలో కొంత ఒత్తిడి అవసరం. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో తొందరగా ప్రతిస్పందించడం అలవాటు అవుతుంది. ఒత్తిడి వల్ల కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి జరిగి, దానివల్ల మనకు శక్తి లభించి, లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించడం సాధ్యమవుతుంది. అయితే ఎక్కువ కాలం ఒత్తిడి, ఆందోళనలు మెదడుకు మంచివి కావు. అందువల్ల అప్పుడప్పుడూ ఒత్తిడి నుంచి స్విచ్ ఆఫ్ చేసుకుని, మెదడుకు విశ్రాంతి ఇవ్వడం చాలా అవసరం. ఇలాంటి సమయంలో ఆలోచనలను అదుపులో పెట్టుకోవడం కష్టమైతే మెడిటేషన్ వంటి వాటిని ప్రయత్నించాలి. దానివల్ల ఒత్తిడి కలిగించే హార్మోన్లు సాధారణ స్థాయికి చేరుకుంటాయి.

* పగటిపూట ఏదైనా నేర్చుకుంటే, నిద్రపోయాక అది ఒక జ్ఞాపకం మారిపోతుంది. అందువల్ల జ్ఞాపకాలను పదిలపరచుకోవడానికి నిద్ర అనేది చాలా అవసరం. పడుకునేముందు ఎవరికైనా ఒక జాబితాను ఇచ్చి పొద్దున్నే దాన్ని గుర్తు తెచ్చుకొమ్మని చెప్పండి. మరొకరికి పొద్దున్న ఆ జాబితా ఇచ్చి రాత్రి అప్పగించమని చెప్పండి. పగటిపూట నేర్చుకున్నదే బాగా గుర్తుంటుందని పరిశోధనలలో తేలింది. ఒకవేళ ఎవరైనా పరీక్షకు సిద్ధమవుతుంటే జవాబులు నేర్చుకున్న తరువాత చిన్న కునుకు తీస్తే మంచి ఫలితం ఉంటుందని పరిశోధనలలో తేలింది. అదేవిధంగా నిద్రపోయే ముందు చెడ్డ అనుభవాలను లేదా జ్ఞాపకాలను గుర్తుచేసుకోకూడదు అని చెబుతారు పెద్దలు. ఎందుకంటే వాటివల్ల చెడ్డ కలలు వస్తాయని.. అందుకే నిద్రపోయే ముందు హారర్ సినిమాలు చూడటం లేదా హారర్ కథలు చదవడం చేయకూడదు.

* ప్రతిరోజూ ఐదు గంటల కన్నా తక్కువ సేపు నిద్రపోతే మెదడు చురుగ్గా ఉండదు. అదేవిధంగా పది గంటల కన్నా ఎక్కువసేపు నిద్రపోవడం కూడా మంచిది కాదు. మనం ఎప్పుడూ చీకటిగా ఉండే గదిలో నిద్రపోవడం మేలు.

★

శ్రీనరసింహ శతకము

సీ॥ అవనిలోఁగల యాత్ర -లన్ని చేయఁగ వచ్చు
ముఖ్యమౌ నదులందు మునుఁగవచ్చు
ముక్కుపట్టుక సంధ్య మొనసి వార్చఁగ వచ్చుఁ
దిన్నఁగా జపమాలఁ ద్రిప్ప వచ్చు
వేదాల కర్థంబు విఱిచి చెప్పఁగవచ్చు
శ్రేష్ఠ క్రతువులెల్ల (జేయవచ్చు
దనములక్షలు కోట్లు దానమీయఁగ వచ్చు
నైష్ఠికాచారముల్ నడుప వచ్చుఁ
తే॥ జిత్త మస్యస్థలంబుల (జేరకుండ
నీ పదాంభోజముల యందు నిలుప (గలమె
భూషణ వికాస - శ్రీధర్మ పురనివాస!
దుష్టసంహార నరసింహ దురిత దూర

భావం: ఓ స్వామీ! ప్రపంచంలో యాత్రలెన్ని ఐనా చేయవచ్చు. ప్రసిద్ధ నదుల్లో తీర్థమాడవచ్చు. ముక్కు పట్టుకుని సంధ్యవార్చ వచ్చు. తిన్నగా జపమాల తిప్పవచ్చు. వేదాలకర్థం విడదీసి చెప్ప వచ్చు. మంచియగాలు చేయవచ్చు. నిష్ఠగా ఆచారాలు నిర్వ హింపవచ్చు. కాని మనస్సును ఇతర చింతల నుండి మరల్చి ఉంచటం సాధ్యమవుతుందా? అంటే కష్టసాధ్యమైన పని కదా అది.

అనంతం

37 -గోపరాజు నాగేశ్వరరావు

వంట పనిలో తాముంటే జలనంలో కలిసి తప్పిపోతారని- పిల్లల్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు.

పెద్దవాళ్ళవెంట పిల్లలుంటే రంగులరాట్నం వాడు మాటలతో వూరిస్తూ-

"పిల్లలు తిరిగే రంగుల రాట్నం... దర్జాగా కూర్చోండి. గుండ్రంగా తిరగండి... రాండి పిల్లలూ.., రాండి! రంగుల రాట్నం ఎక్కండి" అంటూ పిల్లలకు సైగలు చేస్తున్నాడు.

వాళ్ళు పెద్దవాళ్ళని పీడించిమరీ రంగుల రాట్నం ఎక్కుతున్నారు. అడవి సంపద చేతులు మారుతున్నది!

ఒకచోట-

మూడుముక్కలాట జోరుగా సాగుతోంది!

పట్నం బిత్తరగాడొకడు పేకముక్కల్ని కలిపి, మూడే మూడు ముక్కల్ని క్రింద పరుస్తూ- తీసి కలుపుతూ...

"కాయ్‌రాజా.. కాయ్! కాయ్ రాజా.. కాయ్!! జూదం ధనలక్ష్మి... ధైర్యం మహాలక్ష్మి..

జోకర్ మీద కాస్తే ఒకటికి పది రెట్లు! బొమ్మ మీద కాసింది తప్పిందంటే గోవిందా!

పందెం గెలిస్తే ఒకటికి పది రెట్లు... ఓడిపోతే నష్టం తక్కువ! ఒక్కసారి గెలిస్తే పదిసార్లు ఓడినా దండగుండదు.

కాయ్ రాజా.. కాయ్!

తేనె సీసాకి పది సీసాల ధర. కిలో చింత పండుకి పది కిలోల ధర! స్పాట్ పేమెంట్... ఫటాఫట్... ధనాధన్...

దగాలేదు.. మోసం లేదు..

జోకర్ మీద కాయండి... లాభం పొందండి.

కాయ్ రాజా.. కాయ్ అంటూ విరామం లేకుండా వసపిట్టలా అరుస్తూనే ఉన్నాడు.

జనం గుమికూడారు!

"జోకరంటే ఏంటిది?" అని ఎవ్వరో అడిగారు.

బిత్తరోడు క్రిందపరచిన మూడు పేకముక్కల్ని పైకి తీశాడు.

వాటిల్లోవున్న జోకరు బొమ్మ చూపించా-

"జోకరంటే యీ బొమ్మే!" అన్నాడు.

"పందెఁవెట్టాగాయాలి."

"మూడుముక్కలు క్రింద పరుస్తాను. వాటిల్లో ఒకటి జోకరు. దాని మీద పందెం కాస్తే గెల్చినట్టు... పందెం కాసింది జోకరు కాకపోతే ఓడినట్టు" అని,

"కాయ్ రాజా కాయ్! దగా లేదు మోసం లేదు" అన్నాడు, పేకముక్కలు క్రింద పరుస్తూ.

అందరి కళ్ళూ పేకముక్కల మీదే ఉన్నాయి!

"పట్నపోళ్ళంతా తిక్కల్నాయాళ్ళేడా ఉండరు" అన్నాడో అడవి పుత్రుడు, రహస్యంగా ప్రక్కవాడితో!

"ఏంటికంట?"

"ముక్కల్ని సక్కంగా పరవటఁవ్ గూడా తెలవదు! బొమ్మ సూపిత్తా పర్సిండు.. మద్దెలోదే బొమ్మ."

అందరూ దానిమీద పందెం కాసారు.

అడవి పుత్రులు కన్నీళ్ళ పర్యంతమౌతూ, జూదం ఆడినందుకు తమనుతామే నిందించు కొంటూ- బిక్కమొహాలతో అక్కడే నిలబడిపోయారు.

అంతలో గోపీనాయక్ వచ్చాడు!



తేనె సీసాలు, చింతపండు, కాయలూ, పండ్లూ పందెం పెట్టారు.

బిత్తరగాడు-

"జై భవాని.. జై కనకదుర్గ.. జైజై కొండదేవరా.."అంటూ, చివాల్న మధ్యలోవున్న పేకముక్కని పైకి తీసి చూపించాడు.

అది జోకరు కాదు!

ఒక్క క్షణంలో సంపదంతా కోల్పోయిన

"కాయ్‌రాజా.. కాయ్"అంటూ బిత్తరోడు మళ్ళీ మూడు పేక ముక్కలు క్రింద పరిచాడు. "దగాలేదు.. మోసం లేదు...కాయ్ రాజా..కాయ్" అన్నాడు మళ్ళీ!

గోపీనాయక్ కొంచెం ముందుకు జరిగాడు.

బిత్తరోడు గమనించేలోపే, మూడు పేకముక్కల్నీ వెల్లకిలా వేసాడు.

వాటిల్లో జోకరే లేదు!

హస్తలాఘవాన్ని కనిపెట్టారని తెలిసి బిత్తరోడు భయంతో వొణికిపోతూ- పోలీసుల వైపుకు పరుగులు తీశాడు.

అడవి పుత్రుల్ని గోపీనాయక్ మందలించి, అక్కడ్నించి పంపించాడు.

ఇంకొకచోట-

చాప మీద వనమూలికలు పెట్టి, వన మూలికల మధ్యలో ధన్వంతరి పటం పెట్టి, పటంమ్మీద పసుపూ కుంకుమా చల్లి, మధ్యకి కోసంన రెండు నిమ్మకాయ బద్దల్ని పటం ముందుపెట్టి,-

అడవి పుత్రులకే వన మూలికలు అమ్ముతున్నాడొకడు!

"రండి బాబూ.. రండి! వనమూలికలు కొనండి! మామూలు వన మూలికలు కావు- దేవతా వన మూలికలు! దక్షిణాఫ్రికా అడవుల్నించి మీకోసం తెప్పించిన స్పెషల్ వనమూలికలు!!"

"ఏఁవుండయ్య నీకాడ?" ఎవ్వరో అడిగారు.

"ఇది తెల్ల గంజేరు! అడవిలో పాములుంటయ్యి! అందితే కాటేస్తయ్యి! తెల్లగంజేరు దగ్గరుంటే పాములు పరార్..!"

"మాకాడ శానా వుండయ్యి."

"అదేబాబూ పొరపాటు! మీ దగ్గరున్న తెల్లగంజేరు వాసనకి అడవి పాములు పరారైతాయిగానీ, పట్నం పాములు పరారుకావు! సంత బేరానికి పట్నంపోతే మీదగ్గరుండాలి మా తెల్లగంజేరు."

"ఇంకా ఏఁవుండయ్యి నీకాడ?"

"ఇది మార్తాండ మూలిక! ఇది కుంతీ మూలిక!"

"ఏంటి కయ్యి?"

"ఆడవాళ్ళదగ్గర మార్తాండ మూలిక, మగవాళ్ళదగ్గర కుంతీ మూలిక వుంటే సత్వర సంతానాభివృద్ధి జరుగుతుంది!

గంపెడు పిల్లల్ని కనండి!

ఇంటింటా మూలికలుంచి ఓటర్లని కంటే, రాబోయే రోజుల్లో అధికారం మీదే!"

"ఎంతకాడికి అమ్ముతుండావూ?"

"మార్తాండ మూలిక ఒక్కింటికి పది కిలోల చింతపండు"

"మొగోళ్ళ మూలికో...?"

"కుంతీ మూలిక ఇరవై కిలోల చింత పండు."

క్షణాలమీద మూలికలన్నీ అమ్మి, సొమ్ముచేసుకొని అతగాడు అదృశ్యమయ్యాడు.

అంతలో-

రెడ్డియానాయక్ తండావాళ్ళు మిడతల దండులా వచ్చిపడ్డారు!

(ఇంకా ఉంది)

అనుక్షణికం

-వడ్డెర చండీదాస్

తనను పెంచిన ఆ మేనమామ ఇంటి నుంచి బయటకు వచ్చి స్నేహితుల సహాయాన్ని కూడా నిరాకరించి, ఒక కార్మికునిగా చేరతాడు. తనను ప్రేమించిన స్థితిమంతురాలు 'నళిని'ని అంతకుముందే కాదంటాడు. ఎంతో నిజాయితీ వున్న మనిషి. దొంగతనం, లంచం, వ్యభిచారం అంటే అతనికి పరమ అసహ్యం. తన తోటి కార్మికుని చెల్లెలు 'గంగి'ని పెళ్లాడతాడు. క్రమక్రమంగా రాజకీయాలవైపు ఆకర్షితుడౌతాడు. ఎంఎల్ఏ అవుతాడు. అవకాశవాదిగా మారి ఆనక మినిష్టరవుతాడు.

ఆ పదవి రావటానికి, దాన్ని నిలబెట్టుకోవటానికి అన్ని వెధవ పనులూ చేస్తాడు. భార్య 'గంగి' చెడు ప్రవర్తనను కూడా భరిస్తాడు. తన పదవిని నిలబెట్టుకోవటానికి, ఒక సందర్భంలో 'నళిని'ని ఆశ్రయించి, ఆమె షరతు మీద ఆమె ముందు అండర్‌వేర్‌తో నిల్చుంటాడు కూడా. 'ఎందుకింత దిగజారిపొయ్యావని' నళిని ప్రశ్నిస్తే యిలా చెబుతాడు- "రాజకీయం భయంకరమైనది. ఆ దాహం, ఆ వ్యసనం జూదం కంటే, త్రాగుడుకంటే, ముండలకంటె అన్నిటికంటె మించిన వ్యసనం- మహా మోహం అది. దాన్లో పడినవాడు దాన్లో అంతం కాక తప్పదు" అని - అలా అంతం కావటానికే సిద్ధపడ్తాడు కాని బయటపడాలని అనుకోడు.

అతనికి ఎంతో ఇష్టమైన నల్లగులాబి మొక్కను అతని రాజకీయ అస్తిత్వానికి ప్రతీకగా చూపెడతాడు రచయిత. ఎదగకుండా ఎప్పుడూ అలాగే వుండిపోయే అతను ఇష్టపడిన ఆ నల్లగులాబి మొక్క ఎప్పుడూ గుంట పూలనే చూస్తూ వుంటుంది.

రవి భార్య గంగిది మరొక రకమైన మనస్తత్వం. రవి అంటే ఎంతో ప్రేమ, అంతకుమించిన ప్రాణం. కాని 'రవి' ఆమెను సెక్స్‌ను తృప్తిపరచలేకపోతుంటాడు. ఆమెకు 'సెక్స్‌యావ' ఎక్కువ. తన కోరికలను ఆపుకోలేక కావాలనే దారి తప్పుతుంది. అలా తప్పు చెయటానికి కారణం 'రవి'యే అన్న విషయాన్ని కూడా అతనికి సూచనగా తెలియజేస్తుంది. ఒక తప్పును పదే పదే అనేకమార్లు చెయ్యటం వల్ల అది తప్పనే భావం పోతుంది. అటువంటి పరిస్థితులలో అందరూ అదేవిధంగా ప్రవర్తిస్తారనే దృష్టితో ఆ నైతిక ప్రవర్తనను కొనసాగిస్తుంటుంది. తత్త్వశాస్త్రంలో ఈ స్థితిని గాడిద అంతరాత్మ (కాన్సైన్స్ ఆఫ్ యాస్ యాస్) అని అంటారు.

మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన 'తార' చిన్నప్పటినుంచి తన పరిధిని మించిన కలలు కంటూ వుంటుంది. తన లాంటి అందగత్తె పొరపాటున ఈ సగటు కొంపలో పుట్టినట్లు ఎప్పుడూ బాధపడుతుంది. తప్పని పరిస్థితుల్లో 'డ్రాఫ్ట్‌మెన్ రామారావు'ను పెళ్లిచేసుకొని హైదరాబాద్ వచ్చి పిజిలో చేరుతుంది. భర్త ఇంజనీరని, తమది హై క్లాస్ సొసైటీ అని అందరికీ

వినమరుగైన..

రామిశెట్టి చంద్రశేఖర అజాద్


చెప్తుంటుంది. భర్త లంచాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. అతని జీవితాన్ని నరకప్రాయం చేస్తుంది. చివరకు సూర్యప్రకాష్ వలలో చిక్కుతుంది. ఎంతో సెక్సీగా కనపడే తార, సెక్స్ క్రియ విషయంలో మనసు బిగదీసుకుపోతుంది. అయినా ఆ అయిష్టతను కనపడకుండా నటించగల నేర్పరి. సూర్యప్రకాష్ వల నుంచి తప్పించుకొని పారిపోయే ప్రయత్నంలో, బ్రిడ్జి మీద రైలు క్రిందపడి తునాతునకలౌతుంది. ఈ పాత్ర విషయంలో పొయెటిక్ జస్టిస్ జరిగినట్లుగా పాఠకుడు భావిస్తాడు.

సుబ్రమణ్యం విద్యార్థి దశలో తనకు పిన్ని వరసైన, పెళ్లైన, నేర్పుగా బొంకగల్గిన వేదవతితో సెక్స్ సంబంధాలు పెట్టుకుంటాడు. ఒకసారి ఆమెమీద వొరుగుతుండగా అనుకోకుండా ఆమెభర్త కంటపడతాడు. తనను రేప్ చెయ్యబోయాడని బొంకుతుంది వేదవతి. తన్నులు తిని అవమానంతో బయటకు నెట్టబడతాడు.

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన -
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట — నిర్వహణ: సుధామ — 1847



అడ్డం — ఆధారాలు — **నిలువు**

అడ్డం:
1. నరకంలోని ఓ శిక్ష. ఆవముదలి ఇటుకల్లో కాల్చడం
5. ముండ్లకర్ర
7. హిందీ మనస్సు , హృదయం
8. జానపదవాద్యం
9. స్త్రీ , 10. ఘటము
12. ఒడంబడిక, ఇనాందారు రైదుకు రాసిచ్చే పత్రము
14. శ్రీకృష్ణుని బాల్య మిత్రుడు, సహాధ్యాయి

నిలువు:
2. నరకానికి పోయేవారు
3. సంజ్ఞలు కాదు ఓ బాలీవుడ్ గాయకుడు
4. స్వర్గం
6. పడుకొనగా.. అనే
7. రోజు
10. చెవుల పిల్లి
11. శృంగార చేష్ట, విలాసము
13. పరుగు

అడ్డం	మాటాట-1846	సమాధానాలు	నిలువు
1. కోడిపందేలు	9. మేను	2. పండుగ	7.కనుమ
5. రవి	10.ధాత	3. ధర	10. ధాన్యం
7. కల్ల	12. మతి	4.చల్ల	11. పిదప
8. డులి	14. గాలిపటాలు	6. విడుత	13. తిథి

కృష్ణనామం మోక్షకారకం

యుగధర్మాన్ని రక్షించుటకై శ్రీ మహావిష్ణువు కృష్ణపరమాత్మునిగా అవతరించాడు. మార్గశిరమాసమంతా కృష్ణనామస్మరణతో దేవాలయాలు మారుమ్రోగుతుంటాయి. కానీ ప్రతి క్షణమూ కృష్ణనామాన్ని స్మరించుకుంటూ కృష్ణుడు చేసిన, చూపిన, చెప్పిన విషయాలను అర్థం చేసుకొని ఆచరణలో పెడితే కృష్ణుడికి మనుష్యునికి తేడా ఉండదు. అందుకే నరనారాయణులుగా కృష్ణార్జునులు పుట్టారు. మనమూ కృష్ణునితో స్నేహం చేసి కృష్ణులుగా మారాలి.

కృష్ణుడు పుట్టినప్పటి నుంచి అద్భుతాలనే చూపిస్తున్నాడు. స్వామి ఏ పని చేసినా చెప్పినా అది అర్థం చేసుకొంటే జ్ఞానోదయం కలుగుతుంది. పరమాత్ముడు రాత్రివేళ గాఢాంధకారంలో కారాగారంలో ఉన్న దేవకీ వసుదేవులకు జన్మించాడు. శంఖచక్రగదా పద్మాలతో చతుర్భుజునిగా దర్శనమిచ్చాడు. వారు చేయవలసిన పనులను ఆదేశించాడు. వెనువెంటనే అపుడు జన్మించిన శిశువువలె అమ్మ ఒడిలో పడుకున్నాడు. ఆ పాపడిని తీసుకొని వసుదేవుడు తలపై ధరించి రేపల్లెకు



వెళ్లాడు.

దారిలో యమునమ్మ కనిపించినా మైదానం లాంటి దారినిచ్చింది. ఆదిశేషుడు తన పడగ విప్పి బాలగోపాలునికి ఛత్రంగా మారాడు. కారాగారంలో కావలిగాండ్రు, తలుపులు తాళాలు అన్నింటికీ అన్నీ వేటికవి విడిపోయి మరీ వసుదేవునికి దారిచ్చాయి. ఇదంతా జరగడానికి కారణం మేమిటని ఆలోచిస్తే చిన్ననాడు యశోదమ్మ లాలి పోసి బువ్వపట్టి పడుకోడితే జోలపాటకు కరిగిపో యినట్టుగా నిద్రపోయాడు. ఆ చిన్నవాడే యశోదమ్మకు తన చిరుబొజ్జలో 14 భువనభోంతరాళాలను భద్రపరిచాడు.

కృష్ణపరమాత్మణ్ణి ఎవరు, ఎపుడు తలంపులో ఉంచుకుంటారో అంటే నిత్యం నామస్మరణ చేస్తారో, ఎవరైతే ఆయన ఉపదేశాలు ఆచరిస్తారో వసుదేవునికి అసంభవాలు సంభవాలుగా మారినట్టు భక్తజనులకు అసాధ్యమంటూ ఏమీ ఉండదు. ఎంతటి కష్టతరమైన పనులు కూడా 'కృష్ణశబ్దం'లో సులభం చేసుకొంటారు. ఎప్పుడూ అధర్మమైన పనులు చేయకుండా, ఇతరులను నొప్పించకుండా ఉంటే చాలు కృష్ణపరమాత్మ ఎపుడు పిలిస్తే అపుడు పలుకుతాడు.

కృష్ణమాయను తెలుసుకోవడం అంత సులభం కాదు. స్వామిని అర్థం చేసుకోవాలంటే కృష్ణునిగా మారాలి. కుబ్జ కురూపి అయినా కూడా మనఃస్ఫూర్తిగా కృష్ణనామాన్ని స్మరించేది కనుకనే ఆ దేవుడు సౌందర్యరాశిని చేశాడా కుబ్జను. అక్రూరుడు శ్రీకృష్ణుని పరమాత్మగా అవగాహన చేసుకొన్నాడు. కనుక అక్రూరుడిని తన చెంత చేర్చుకున్నాడు.

దురభిమానంతో కృష్ణుడిని అవమానిం చిన దుర్యోధనాదులనంతా వారి వారి కర్మానుసారం వారు సంహరించబడేట్లుగా కృష్ణుడు రచన చేశాడు. సృష్టిస్థితిలయాదులకు కారణాకారుడు కృష్ణపరమాత్మనే. కనుక కృష్ణుని నామోచ్చారణ ఈ కలియుగంలో మేలు చేకూరుస్తుంది. కృష్ణ నామస్మరణ మోక్షసిద్ధికి మార్గం.

– కూచిబొట్ల వెంకటలక్ష్మి

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురవుతాయి. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కోపాన్ని అదుపులో నుంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుటకు దైవ ధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు. వృధా ప్రయాణాలెక్కువవుతాయి. ధనవ్యయం తప్పదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
వృత్తి ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. దూర బంధువులతో కలుస్తారు. తద్వారా లాభాలుంటాయి. విదేశయాన ప్రయత్నాలు సంపూర్ణంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. అన్ని విషయాల్లో విజయాన్ని సాధిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబంలో సుఖ, సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రస్తుత కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. ప్రయాణాలు లాభదాయకంగా వుంటాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కొన్ని జటిలమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
అకాల భోజనాదులవల్ల అనారోగ్యమేర్పడుతుంది. పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. క్రొత్త పనులు ప్రారంభించరాదు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
బంధు, మిత్ర విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. మానసికాందోళన అధికమవుతుంది. అనారోగ్య బాధలను అధిగమిస్తారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. నూతన కార్యాలకు ప్రణాళికలు వేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది. రహస్య శత్రువులపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. ఏ విషయంలోనూ నిరుత్సాహం పనికిరాదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

195

"ప్రకటితమూ మరియు రహస్యమూ అయిన రెండు ధనాలను నీవే వహించి యున్నావు. ఆ రెండు సుఖదాయకమైనవే. ఓ ప్రభూ! నా కోరికను తిరస్కరించకు. సర్వప్రబోధకుడవు నీవే. నా అభిమతమేదో తెలిసినవాడవు కూడ నీవే. సర్వప్రదాతవు నీవే."

నా కోరికలలో మంచి కోరిక ఏదో నీవే ఎరుగుదువు. ఆ కోరికలను నెరవేర్చువాడవు కూడ నీవే. అందుచేత నీవుచేసే పనిని నా ఎడల చేయి. ఆనందం పొందడమే నా ధ్యేయం. కాని నిజమైన ఆనందమేది? దానికి సంపూర్ణత ఉందా? నిజంగానే ప్రశ్నిస్తే దానిని గురించి కొంచెం కూడ తెలియదు. పలుమార్లు తీయనిదిగా పొరపడి చొప్పదంటును తిన్నాను. కాని రసహీనమైన ఆ చొప్పదంటు వెగటును కలిగించింది. దానితో ఎందుకో మనసులో భయం కూడ కలిగింది. నాలో ఆనందం పొందాలనే లౌల్యబుద్ధి ఎప్పుడూ ఉంది. కాని నాలో ఉన్న సహజమైన అజ్ఞానమే తెలుసుకొనేందుకు సిద్ధమవుతూంది కాబట్టి సర్వ జ్ఞాన విధానా! నా ఉచితమైన కోరిక ఏదో నీవే గుర్తించి పరిపూర్ణం చేయి. ఇదే నీకు నా విజ్ఞప్తి- ప్రార్థన.

దుఃస్వప్న నివారణోపాయం

పర్యావర్తే దుఃష్వప్న్యాత్ పాపాత్స్వప్న్యాద భూత్యాః

బ్రహ్మాహమంతరం కృణ్వే పరాస్వప్న ముఖాః శుచః

భావం: దుఃస్వప్నానికి కారణమైన పాపం నుండి మరియు అసలు అట్టి కల రావడానికి కారణమైన దౌర్భాగ్యం నుండి విముక్తి పొందుతున్నాను. ఆ కలలు వచ్చినట్లయితే హృదయంలో దైవధ్యానం చేస్తాను. దానివలన కలలోని దుఃఖం నుండి విముక్తి పొందుతాను.

వివరణ: దుఃస్వప్నమన్న పేరే అది చెడ్డదన్న విషయాన్ని తెలుపుతుంది. అసలు దుఃస్వప్నానికి కారణం పాపమే. అదేమిటో ప్రతి వ్యక్తి తెలుసుకోవాలి. కలకు - మెలకువకు మధ్య భేదమేమిటో ముందు తెలుసుకొందాం. జాగ్రత్ (మెలకువ) దశలో ఆత్మ కొరకు మనో, బుద్ధి, అహకార, చిత్తాలనే అంతఃకరణాలు మరియు జ్ఞానం, కర్మేంద్రియాలు చురుకుగా పనిచేస్తుంటాయి. కాని స్వప్నం - ఆ జాగ్రద్దశకు భిన్నంగా శరీరం మరియు జ్ఞాన కర్మేంద్రియాలు అలసిపోయి విశ్రాంతిని పొందుతూ కేవలం అంతరింద్రియమైన మనస్సు మాత్రమే పనిచేస్తూ ఉండేదశ. ఈ సందర్భంలో ఆత్మ మరియు ఇంద్రియాలకు మధ్య మనస్సు అనుసంధానకర్తగా ఉంటుందని దార్శనికులు చెబుతారు. అంటే- ఇంద్రియాలు తాము సంగ్రహించిన రూపాదుల విషయ జ్ఞానాన్ని మనసుకు చేరవేస్తాయి.

ఆ జ్ఞానాన్ని మనస్సు ఆత్మకు నివేదిస్తుంది. దానివలన ఒకే సమయంలో ఒకే విధమైన జ్ఞానం కలుగుతుంది. కారణం మనసు ఒక సమయంలో ఒక ఇంద్రియాలతోనే సంయోగం చెందుతుంది. అంటే లోనున్న ఆత్మ నుండి భావాలు బయటకు ప్రసరించినా, బయటనుండి జ్ఞానం ఇంద్రియాల ద్వారా లోపల వున్న ఆత్మకు చేరినా ఆ జ్ఞానం గాని భావంగాని మనస్సుకు ఇంద్రియాలందించినవి మాత్రమే కాబట్టి స్వప్న దశలో మంచి గాని చెడుగాని మనస్సు దేనిని స్మరిస్తుందో అది జాగ్రద్దశలో ఎప్పుడో ఒకప్పుడు క్రమబద్ధంగా గాని, మరొకప్పుడు క్రమవిహీనంగా గాని, వేరొకప్పుడు రెంటికి భిన్నంగా గాని జరిగిన విషయాలకు ఛాయారూపమే. ఈ అంశాన్నే సూచిస్తూ ఋగ్వేదం 'యదాశసా నిఃశసాభిశసోపారిమ జాగ్రతో యత్స్వపంతః'- జాగ్రద్దశలో చేయబడిన హత్యలే కలలోనికి వస్తాయి అని స్పష్టం చేసింది. వేదమతానుసారం మృతాత్మకే స్వప్నాలు వస్తాయి. మృతాత్మ అంటే పాపకర్మ చేత హతమైన ఆత్మ అని అర్థం. ఆ విధంగా మరణించని-

భద్రం వై వరం వృణతే భద్రం యుంజంతి దక్షిణమ్

భద్రం వైవస్వతే చక్షుర్బహుత్రా జీవతో మనః

"సజీవమైన ఆత్మ దైవాన్ని క్షేమంకర వరాలనర్థిస్తుంది. సదా ఉత్సాహంగా ఉంటుంది. మరియు వివస్వంతుని (భగవంతుని) గూర్చి సుజ్ఞానం కలిగి ఉంటుంది" అని ఋగ్వేదం వివరించింది. అంటే ఏమిటి? ఎన్నడూ ఇతరులకు చెడు చేయక, చెడు కోరక, అందరకు మేలును కోరేవారికి దుఃస్వప్నమెలా వస్తుందని ఋగ్వేదాభిప్రాయం.

ఈ ఋగ్వేదాభిప్రాయాన్ని విశ్లేషించితే దుఃస్వప్నాలనుండి రక్షణ పొందాలంటే సదాలోచన మరియు సదాచరణ తరుణోపాయమని స్పష్టమవుతుంది. ఈ రెండు ఎలా సిద్ధిస్తాయి. శుభప్రదుడైన భగవానుని వలననే. లోకంలో ఆయనకంటే శుభప్రదుడెవరున్నాడు? అందుకే ప్రస్తుత మంత్రంలో 'బ్రహ్మాహమంతరం కృణ్వే పరా స్వప్న ముఖాః శుచః' -"నేను బ్రహ్మను (దైవాన్ని) హృదయంలో నిలుపుకొంటాను" అని దుఃస్వప్న నివారణోపాయం సూచించబడింది. ఈ విషయాన్నే విశ్లేషిస్తూ అనుభవ శిరోమణి సాక్షాత్ ధర్మస్వరూపులు అయిన అధ్యాత్మ ప్రసాద్‌గారు ఇలా వివరించారు.

"జితేంద్రియుడు కావాలని అభిలషించే వారు రాత్రింబవళ్ళు పవిత్ర ప్రణవమై ఓంకారాన్ని జపించాలి. రాత్రి ప్రణవ జప సాధనలో చాలా ప్రొద్దు గడచిపోతే ఒక రెండు గంటలు నిద్రించి లేచి ఓంకారాన్ని జపించాలి. ఎక్కువ సమయం నిద్రించేవారికి కలలు వస్తాయి. జితేంద్రియాభిలాషికి రావు.

ఇంకావుంది...

వ్యాఘ్రగోమాయు సంవాదం



మహాభారతంలో ఉపాఖ్యానాలు 101

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

పూర్వం పురిక అనే నగరానిని పీఠకుడనే రాజు పరిపాలించేవాడు. అతను చాలా దురాత్ముడు. క్రూర స్వభావం కలవాడు. ఇతరులను హింసించి ఆనందించేవాడు. కొంతకాలానికి అతనికి ఆయువు తీరి పోయింది. తాను చేసిన క్రూర కర్మల ఫలితంగా ఆరాజు నక్కగా జన్మించాడు. కాని అతనికి తన పూర్వ జన్మ వైభవం గుర్తుండి పోయింది. దాన్ని స్మరిస్తూ పరమ దుఃఖాన్ని పొందాడు. ఎవ్వరైనా మాంసాన్ని తెచ్చి ఇచ్చినా తినలేదు. సకల ప్రాణులను హింసించడం మానివేశాడు. సత్య భాషణవ్రతాన్ని నియమంగా కొన సాగించాడు. చెట్ల మీది నుండి రాలిన పళ్లనే ఆహారంగా తీసుకునేవాడు. కొన్ని సార్లు ఆకులు ఆహారంగా తీసుకొని, మరికొన్ని మార్లు కేవలం నీరు మాత్రమే ఆహారంగా స్వీకరించే వాడు.

అతని నివాసం కూడా శ్మశానంలోనే ఉండేది. అదే దాని జన్మభూమి అయింది. దాని సదాచారాలను ఇష్టపడని తక్కిన నక్కలు దాని చేత ఈ నియమాలను మాన్పించాలని తలిచాయి. అవి ఎంతో నమ్రతగా దాని దగ్గరికి వచ్చి ఇలా అన్నాయి "నీవు మాంసాహారివై ఉండి కూడా ఈ శ్మశానంలో పవిత్రంగా జీవించాలనుకుంటున్నావు. ఇది నీ జన్మకు తగిన పద్ధతి కాదు. కనుక నీవు కూడా మాలాగే జీవించు. మేము నీకు భోజనం తెచ్చి పెడ్తాము దాన్ని తిను. నీ ఈ ఆచారాలను వదిలిపెట్టు. నీజాతికి ఏది ఆహారమో దాన్నే స్వీకరించు"

వాటి మాటలు విన్న ఆ నక్క యుక్తిగా వివరంగా, మృదువుగా వాటితో ఇలా అన్నది. "నాపుట్టుకయే విచిత్రమైనది. సదాచారాలవల్లనే కులానికి పేరు వస్తుంది. కులం యొక్క కీర్తి ప్రతిష్ఠలు పెంపొందే కర్మలను చేయాలని నిశ్చయించుకున్నాను. ఇక శ్మశానం నివాసం గురించి చెప్తాను వినండి. ఆత్మయే అన్ని కర్మలను చేయిస్తుంది. కాని ఆవాసం కాదు. ఆశ్రమంలో ఉంటూ ద్విజుని చంపితే అది పాపం కాకుండా పోతుందా? ఆశ్రమం కాని చోట గోవుదానం చేస్తే అది పుణ్యం అవదా? మీ అందరికీ తిండి మీదే ఆసక్తి, మీ జీవిక అవిశ్వాసంతో ఉంది. నింద్యమైనది. ధర్మానికి హాని కలిగిస్తుంది. కనుక దూషితమైనది. ఇహపర లోకాలకు హాని చేస్తుంది. కనుక నాకిది నచ్చలేదు" నక్కమాటలు విన్న ఒక పులి దానిని సదాచారవంతునిగా, పండితునిగా భావించి నక్కను పూజించి, తన మంత్రిగా నియమించాలని తలచింది. శార్దూలం నక్కతో ఇలా అంది -

"మీ గురించి నాకు అంతా తెలిసింది. కనుక మీరు నాతో పాటు జీవించండి. మీకిష్టమైన భోగాలను అనుభవించవచ్చును. ఇష్టం లేనివి విడిచిపెట్టవచ్చును. మేము క్రూరులం అని ప్రసిద్ధి చెందాము. మాతో మృదువుగా ఉంటే నీకేలాభం".

శార్దూలం మాటలు విన్న గోమాయువు వినయంగా ఇలా అంది- "మృగరాజా! మీరు చెప్పిన విషయం చాలా బాగుంది. ధర్మార్థాలను తెలిసిన వారిని మీకు సహాయకులుగా బతకటం చాలా మంచి విషయం. ఎందుకంటే మంచి మంత్రులు లేకపోతే రాజ్యాన్ని పాలించడం చాలకష్టం. దుష్టమంత్రి కూడా రాజ్యానికి నష్టమే కలిగిస్తాడు. కనుక మీలాంటి ప్రభువులు మీ పట్ల భక్తి ఉన్నావారిని, నీతిజ్ఞులను, సద్భావ సంపన్నులను, స్వామి కార్యతత్పరులను, లోభరహితులను సహాయకులుగా నియమించుకొని, వారిని గౌరవించాలి. మృగరాజా! నాకు భోగాల మీద ఆసక్తి లేదు. మీసేవకుల తత్త్వంతో నా తత్త్వం పడదు. వారు నన్నూ మిమ్మల్ని కలిసి నేను ఎన్నడూ మంత్రాంగం చేయను. ఎందుకంటే వారు నాపై కొండెములు చెప్తారు. ఏకాంతంగా నేను ఒంటరిగా మీకు హితవచనాలు చెప్తాను. నీ జ్ఞాతులకు సంబంధించిన విషయాలలో నన్ను సలహా అడగవద్దు".



విడదీస్తారు. మీరు ఎంతో మందికి ఆశ్రయం కల్పించారు. నేను స్వేచ్ఛగా అడవిలో తిరిగేవాడిని. రాజాశ్రయంలో ఉన్నవారికి రాజుకు సంబంధించిన దోషాలన్నీ అంటుతాయి. అడవిలో తిరిగి కందమూలాలు తినేవారికి ఆ భయం ఉండదు. ఎక్కడ చూసినా సమృద్ధిగా జలం, ఫలాలిచ్చే వృక్షాలు ఉంటాయి. ఇదే నాకు సుఖమైన జీవితం".

నక్క ఇంకా ఇలా అన్నది-" మృగ రాజా! నేను నీ సేవ చేయాలంటే ఒక నియమం ఉంది. నీవు నా వారిని గౌరవించాలి. నా జీవికకు నీవు కల్పించే వ్యవస్థ నీదగ్గరే ఉండాలి. నీ ఇతర మంత్రులతో కలిసి నేను ఎన్నడూ మంత్రాంగం చేయను...

మృగరాజు "అలాగే చేస్తాను" అని చెప్పి నక్కను మంత్రిగా నియమించాడు. నక్క, రాజుకు మంచి సలహాలు చెప్పి మంచి పనులు చేయించుతూ ఉంటే తక్కిన సేవకులు అతన్ని ద్వేషించసాగారు. పూర్వం వారు కొద్ది కొద్దిగా ధనం అపహరిస్తూ ఉంటే వారు. ఇప్పుడు నక్క కట్టడి చేయడంతో వారు అలా ధనం అపహరించలేకపోయారు. వారు అనేక విధాలుగా గోమాయువు యొక్క నాశనాన్ని కోరుకున్నారు. అతన్ని అనేక విధాలుగా ప్రలోభపెట్టడానికి ప్రయత్నించ సాగారు. ధనం చేత ప్రలోభపెట్టారు. కాని నక్కవాటికి లొంగలేదు. అప్పుడు వారంతా కలిసి దాని వినాశనానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారంతా మృగేంద్రుని కోసం వండిన మాంసాన్ని తీసి గోమాయువు నివాసంలో పెట్టారు. గోమాయువుకు ఈ పని ఎవరు చేశారో ఎందుకు చేశారో తెలుసు, కాని మౌనంగా ఉండిపోయింది. మంత్రి కాక ముందు అతను వ్యాఘ్రంతో అన్నాడు. "రాజా నాతో మైత్రిని కోరుకుంటే నన్ను చంపకూడదు" అని.


తరువాత ఆకలితో మృగేంద్రుడు లేచి ఆహారం కోసం చూడగా అక్కడి మాంసం కన్పడలేదు. ఆ పని చేసిన సేవకులే రాజుతో ఆ మాంసాన్ని గోమాయువు తీశాడని చెప్పారు. గోమాయువు తన కోసం వండిన మాంసాన్ని తిన్నాడు అని విన్న శార్దూలానికి ఆగ్రహం వచ్చింది. వెంటనే దాన్ని చంపాలనుకుంది. రాజులోని ఈ ఆలోచన గ్రహించిన పూర్వపు మంత్రులు గోమాయువుపై ఇంకా చాడీలు చెప్పసాగారు. వారు రాజుతో ఇలా అన్నారు.

"మహారాజా! అతను ఈ పని చేసాడు అంటే ఇంకేదైనా చేయగలడు. మీరు అతని గురించి విన్నది సత్యం కాదు. అతను మాటలలో ధర్మిష్ఠుడు స్వభావంలో క్రూరుడు. అతను తన తిండి కోసం పాటుపడుతున్నాడు. కావాలంటే చూడండి. అని పలికి రాజుకి గోమాయువు ఇంట్లో తాము పెట్టిన మాంసాన్ని చూపించారు. వారి మాటలు విన్న వ్యాఘ్రం నక్కను వధించమని ఆజ్ఞాపించింది. అప్పుడు శార్దూలం మాటలు విన్న దాని తల్లి వచ్చి కుమారునితో ఇట్లా అన్నది. "కుమారా! ఇందులో ఏదో కపట ప్రయత్నం కలిసి ఉంది. కనుక నీవు దీనిని పట్టించుకోకు. కపట మనస్సు కలవారు నిర్దోషులను దోషులుగా చూపిస్తారు. ఇంకొకరి ఔన్నత్యాన్ని సహించలేని వారు ఇటువంటి పనులు చేస్తారు. ఈర్ష్యయే వైరానికి కారణమై పని చేస్తుంది.

అరణ్యంలో తపస్సు చేసుకునే మునులకు కూడా మిత్రులు, ఉదాసీనులు, శత్రువులు అనే మూడు పక్షాలు ఉంటాయి. లోభులకు ఉదారులందు, పిరికి వారికి వీరులందు, దరిద్రులకు ధనవంతులందు సహజంగా ద్వేషం ఉంటుంది. నీయింటి నుండి మాంసం అపహరించబడినప్పటికీ, అతడు మాంసాన్ని తాకనైనా తాకడు. కనుక బాగా ఆలోచించి ఏపనైనా చేయి.

-ఇంకావుంది

సుందరకాండ



అసలు బట్టలులేవని అనరు. నిద్రాబల పరాజిత అయిన స్త్రీ ప్రక్కదాని బట్టను కూడా తానే పైన వేసికొందట.

ఇపుడు రెండు చీరలున్నదానిని స్వామి చూస్తున్నాడట. ఇలాంటి సంస్కారంతో అలాంటి స్వరూపాల్ని చూస్తూన్న స్వామి-

జగామ మహతీం చింతాం ధర్మ సాధ్వస వంకితః

ధర్మలోపభయాన్ని పొందేడట. పరోపకారం కోసం చేసే పనే అయినా అందులో స్వార్థ భావన ప్రవేశిస్తోందేమో అని సత్పురుషులు భయపడుతూ ఉంటారు. అందుకనే మధ్యలో మనో విమర్శనమును చేసికొంటూ ఉంటారు. స్వామి అనుకొంటున్నాడు.

ఏమిటి నే చేస్తున్నది. ఎందుకు నే చూస్తున్నది. ఇలా ఒకరి నుండి ఒకరిని చూసికొంటూ వస్తున్నానే- ఇటువంటి వాళ్ళను చూడటంలో నాలో ఆసక్తి కాని తద్రూపమైన కామం కాని ఉందా?

ఒక్కసారి తన మనస్సును తాను పరామర్శ చేసికొన్నాడు.

లేదు అనే నిర్ణయానికి వచ్చేడు. వచ్చి హేతువును చూపిస్తున్నాడు.

నహి మే మనసః కించిద్వైకృత్యము పపద్యతే

నా మనస్సు ఏవిధమైన వికారాన్ని పొందలేదు. ఈ స్త్రీలను చూడక ముందు సీతాన్వేషణ దీక్షాదక్షమైన మనస్సెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది.

మనోహి హేతు స్సర్వేషాం ఇంద్రియాణాం ప్రవర్తనే

శుభాశుభాస్వవస్థాసు తచ్చమే సువ్యవస్థితమ్

అనుకొన్నాడు. అదీ ధృతి అంటే-

అందుకని నే చేస్తున్న పని సరియైనదే. ఇంద్రియాలన్నీ విషయాలపై ప్రసరించడానికి మనస్సే కారణం. ఆ మనస్సే శుభ అశుభ అవస్థాకారణం అవుతున్నది గదా! అటువంటి నా మనస్సు సువ్యవస్థతలో వుంది. అంటే ఏ వికారాన్ని పొందటం లేదు. కనుక నే చేస్తున్న పని సరియైనదే. ఇదీ స్వామి తన మనస్సును తాను పరీక్షించుకొనిన విధానం. అయితే మరి ఎంతసేపు స్త్రీల మధ్యనే వెదుకుతావెందుకు? అని అంటారేమో?

నాన్యత్రహి మయా శక్యా వైదేహీ పరిమార్గితుం

స్త్రియో హి స్త్రీషు దృశ్యన్తే సదా సంపరి మార్గణే

ఆడుదాని కొరకు ఆడువాళ్ళ మధ్యలో వెదుకక ఇంకెక్కడ వెదుకను? మృగాల మధ్య వెదుకనా? ఇలా తపనపడి తర్కించుకొని ప్రతిస్థలాన్ని వెదుకుతూ అన్వేషణలోని ప్రతిక్షణానికి ముందు సంస్కారాన్ని అడ్డుపెట్టుకొని-

పాన భూమిని విడిచిపెటిట అడుగు ముందుకు వేస్తున్నాడు. శ్రీరామపత్ని కనబడటంలేదు. అనేక విధాన ఆలోచిస్తున్నాడు.

ధ్రువం హి సీతా మ్రియతే యథా విచిన్వతో దర్శన మేతి మైథిలీ

సీత చనిపోయి ఉండదు. వెతికితే కనబడుతుంది. ఇది సామాన్యం. సీత ధ్రువకళ. దానికి నాశనముండదు. సాధకుడన్వేషిస్తే దర్శింపబడుతుంది. పదహారవ చంద్రకళకు ధ్రువకళ అని పేరు. దానికి క్షయం లేదు.

ఇంకావుంది...

అహంకారం వల్లే అజ్ఞానం

పురాణ వ్యక్తులు - పూర్వజన్మలు
డా. రాయసం లక్ష్మి


బ్రహ్మ చిరునవ్వుతో పుట్టిన వారు గిట్టక మానరు కదా అన్నాడు.

కానీ నీ కోరిక కాలాంతరంలో తీరుతుందిలే అని చెప్పాడు. అంతే బ్రహ్మ ఇచ్చిన వరబలంతో కాలనేమి చాలా అకృత్యాలు చేశాడు. సజ్జనులను హింసించాడు. చివరకు కాలనేమి తన జీవితాకాలం అంతమవడంతో తిరిగి ఉగ్రసేనుడు, పద్మావతి అనే దంపతులకు కంసుడుగా పుట్టాడు.అతనికి కాస్త పూర్వజన్మ జ్ఞానం ఉంది. తనను చంపడానికి మహావిష్ణువే వస్తాడు అని జ్ఞప్తి చేసుకొన్నాడు. ఆ మహావిష్ణువు నుంచి తప్పించుకోవాలని నానాయాతనలు పడేవాడు.

ఒకసారి జరాసంధుడను రాజు తన మృగయావినోదం కోసం అడవికి వెళ్లాడు. కూడా కువలయాపీడ నమే మత్తేభాన్ని తీసుకొని వెళ్లి అతి బలవంతమైన ఆ మత్తేభాన్ని తన శిబిరం దగ్గర కట్టేసుకున్నాడు.

ఆ కువలయాపీడనం మావటివాని మాట వినక తన తాళ్లను తెంచుకుని చుట్టుపక్కలను నాశనం చేస్తూ పరుగెత్తి వెళ్లింది. ఆ కువలయాపీడనం చివరకు కంసుడు మల్లయుద్ధం చేసేదగ్గరకు వచ్చి నిలిచింది. దాన్ని చూడగానే కంసునిలోని మహాశక్తి ఉవ్వెత్తున ఎగిసిపడింది. వెంటనే కంసుడు ఆ ఏనుగు తొండం పట్టుకుని గిరగిరా తిప్పి విసిరికొట్టాడు. కంసుని బల పరాక్రమం వల్ల ఆ ఏనుగు గింగిరాలు తిరిగి తిరిగి జరాసంధుని శిబిరం దగ్గర పడిపోయింది.అది చూసిన జరాసంధుడు నేనే బలశాలి అనుకొంటే నా కన్నా బలవంతుడెవడు? ఈ కువలయాపీడనాన్ని మర్దించాడు అనుకొని విచారించి కంసుని గురించి తెలుసుకొని స్నేహం చేశాడు. కంసుడు కూడా తన కన్నా బలవంతులైన వారు ఉండకూడదనే స్థిరనిశ్చయంతో ఉన్నవాడు కనుక జరాసంధుడినే స్నేహితుడినే కాదు బంధువును కూడా చేసుకొన్నాడు. జరాసంధుని కూతుర్లు అయిన అస్తి, ప్రాప్తి అనే ఇద్దరినీ తాను వివాహం చేసుకొన్నాడు.

ఒకనాడు బలగర్వంతో ఋష్యమూక పర్వతం పైకి వెళ్లాడు. అక్కడ కేశి అనే అశ్వముఖుడైన రాక్షసునితో ఘోరంగా పోరాడాడు. అతనితో పోరాడుతూ మహేంద్రగిరిపైకి వెళ్లాడు. కేశిని గెలిచాడు. ఆ ఆనందంలో మహేంద్రగిరి ని పలుమూరు ఊగించాడు. కదిలించివేశాడు. అట్లా కదిపే సమయంలో అక్కడ పరశురాముడు శివుని ధ్యానంలో ఉన్నాడు. మహేంద్రగిరి భుజ శక్తితో అవివేకంతో కదుపుతున్న కంసుని చూసి కోపోద్రికంతో 'ఓరీ కంసా! నీవు నీకున్న బలాన్ని చూసుకొని అహంకరిస్తున్నావు. నిన్ను నిర్జించేశక్తి వస్తోంది. నీకు మరణం తప్పదు'అని శపించాడు. పైగా పరశురాముని దగ్గర ఉన్న ఏడు తాళ్లపొడువు లక్ష పుట్ల ఇనుప ధనుస్సు ఉంది. దీనిని త్రిపురాసుర సంహారం కోసం మహావిష్ణువు పరమశివునికిచ్చాడు. పరమశివుడు పరశురామునికి అనుగ్రహించాడు. ఆధనస్సును



కంసుని కి చూపిస్తూ " ఓ కంసా! దుర్జనుడా! దీనిని నీవు ఎక్కుపెట్టు. లేకుంటే నిన్ను నేను నిర్జిస్తాను" అని అన్నాడు. వెంటనే కంసుడు అమితోత్సాహాలతో ఆ విల్లును ఎక్కుపెట్టపోయి పరాజితుడయ్యాడు. పరశురాముని శరణుకోరాడు.అపుడు ఆ పరశురాముడు దీనిని ఎక్కుపెట్టిన వాడు నిన్ను కూలదోస్తాడు తెలుసుకో అని కంసుని హెచ్చరించాడు.

మరణభయం ఉన్న కంసుడు ఆ ధనస్సును ఐదువేలమందిని నియోగించి తన దగ్గరకు తెప్పించుకుని చతుర్దశినాడు ఆ ధనుస్సును పూజించి ఆ ధనస్సును పెట్టడానికి ధనుశ్శాలలో బంగారు వేదికను నిర్మించి దానిపై బంగారు దారాలతోఅల్లికలను నేర్పించి దానిని కట్టుదిట్టంగా చేసి భద్రపరిచాడు.

ఇంతా చేశాడు కాని మరణ భయం మాత్రం కంసుని వదలలేదు.పైగా దేవకీదేవికి వసుదేవునితో పెళ్లి చేసి తన అత్తవారింటికి పంపుతుండగా ఆకాశవాణి దేవకీదేవి అష్టమ సంతానం నీకు మృత్యుదేవత అని కంసుని మరణవార్తను చెప్పింది. దానితో మరింత భయకంపితుడైన కంసుడు దేవకీవసుదేవులను చెరసాలలో పెట్టించాడు. వారికి పుట్టిన ఆరుగురు శిశువులను శిశుప్రాయంలోనే సంహరించాడు. ఏడవగర్భాన్ని పరమాత్మ రోహిణీ దేవి గర్భంలోకి ప్రవేశపెట్టాడు.

దానితో ఏడవ గర్భం దేవకీదేవికి విచ్చితి జరిగిందనుకొన్నాడు కంసుడు ఇప్పుడు పుట్టబోయే వాడు ఏడవ వానిగా లెక్కపెట్టాలా లేక ఎనిమిదవ వానిగా లెక్కపెట్టాలో అర్థం కాక కంసుడు సతమతమవుతున్నాడు.

అంతలో శంఖచక్రగదాపద్మయుతుడు అరవిందదళాయ తాక్షుడు దేవకీవసుదేవులకు పుట్టనే పుట్టాడు. మాయామానుషవిగ్రహుడైన ఆ పరమాత్మ యశోదమ్మ ఒడిని కూడా చేరాడు. అక్కడ ఎందరినో శత్రువులను హతమార్చాడు. వీరాధివీరునిగా పేరెన్నికగన్నాడు. ఆ సంగతి రేపల్లెలో నందనందనుడు వీరాధివీరుడుగా పేరు తెచ్చుకుంటున్నాడని. పరమాత్మ మాయలు ఎంచడం ఎవరికి తరము అని వెంటనే ఆ నందనందునుడిని చూడాలనుకొన్నాడు. వెంటనే అక్రూరుని పంపి శ్రీకృష్ణుని బలరామ సమేతంగా తీసుకొని రమ్మన్నాడు. అక్రూరుడు బయలుదేరి వెళ్లాడు.

నిజమే కదా! పరమాత్మ నిర్ణయించిన తరువాత మృత్యువు అయినా, జన్మయైనా ఎవరు గతి తప్పేట్టుగా చేసేది? సర్వవ్యాపి, సర్వోత్తముడైన పరమాత్మ తత్వాన్ని ఎరుకపర్చుకోలేని అధములు నేనంటే నేనే అనే అహంకారంతో విర్రవీగి వీగి చివరకు తోకముడిచి పరమాత్ముని శరణు వేడక తప్పదు కదా. పాప రాశి భస్మీపటలం అవగానే ఆ పరమాత్మ ఆ జీవులను కరుణించి తనలో ఐక్యం చేసుకొంటాడు కదా. అట్లానే నేడు కంసుడు తన మృత్యువును తానే రమ్మని పిలిచాడు. అదీ ఎందుకంటే వైరభక్తితో కృష్ణ నామాన్ని వదలక నిరంతరం జపిస్తూనే ఉన్నాడు కదా. మరేమి నిత్యమూ కృష్ణనామాన్ని పఠించిన వారికి వారు ఎవరైనా సరే వారి పాపరాశి లేశమాత్రం ఐనా మిగలకుండా నాశనమయి తీరుతుంది కదా. అటులనే నేడు కంసుడు తన మల్లయుద్ధవిశారదులైన సేవకాగణాన్ని చూసుకొని ఆ దేవాదిదేవుడిని ఆది అంతం లేనివాడిని, అవ్యయుడిని, అనిత్యుడిని, అవ్యక్తుడిని వ్యక్తునిగా రమ్మని పిలిచాడు.

రమ్మని వారిని నిరాశపర్చకుండా దేవుడు తనంతట తానే దిగివస్తాడనే నిజాలెన్నో చరిత్రలో దాగి ఉన్నాయి కదా. అట్లానే బలరామ కృష్ణులు వచ్చారు. ధనుశ్శాలను అడిగి మరీ తెలుసుకుని ఆ లక్షపుట్ల ధనస్సును చిరునవ్వుతో చూశారు. ఆ ధనస్సును కృష్ణయ్య ఎత్తి ఎక్కుపెట్టి ఆ వింటినారిని తన చెవి వరకు లాగాడు. అంతే ఆ లక్షపుట్ల ధనువు ఒక్కసారిగా పుట్టుకున లక్షపుట్లగా విరిగిపోయింది. ఆ సంగతి కంసుని తెలిసింది. అంతే నరనరంలోను తన మృత్యువు పొడ చూసి గజగజా వణికి పోయాడు. కానీ మల్లయుద్ధ నిపుణులవల్ల పరమాత్మను ఢీకొనొచ్చునేమో అని ఆశపడి మల్లయుద్ధరంగాన్ని తీర్చి దిద్దమన్నాడు.

కోరికలను కాదనుడు కదా కృష్ణయ్య. అలానే ఆ మల్లయుద్ధ మంటప ప్రదేశానికి వచ్చాడు. అక్కడ కువలయపీడనాన్ని పీడించి సంహరించాడు. చాణూర ముష్టికులను సంహరించారు.

అట్లా అందరినీ హతమార్చే ఆ పురుషపుంగవులను చూడగానే కంసుడు పిచ్చివాడై ప్రేలాపనలు చేశాడు. తన తండ్రిని కూడా దుర్బుద్ధిగలవాడుగా ఎంచి వృష్ణి వంశీయులందరినీ హతమార్చమని అరిచాడు.

ఆ మాటలను విన్న వెంటనే శ్రీకృష్ణుడు ఎగిరి కంసుని ఎదుటికి దూకాడు. ఆ దివ్యవిగ్రహాన్ని చూసి కంసుడు అచేతనుడైయ్యాడు. కంసుని రెండు చేతులతో పట్టుకొని గిరగిరా త్రిప్పి నేలకేసి మోదాడు. అంతే వైరభావంతోనైనా వదలక కృష్ణనామాన్ని జపిస్తూనే ఉన్నాడు కదా. నిరంతరం ఏ దిక్కునుంచి ఆ మహావిష్ణువు ఏరూపంతో వచ్చి నన్ను హతమారుస్తాడో అని ఎదురుచూశాడు కదా. అందుకే ఆ దివ్యక్షణంలో కంసునిలోని జీవాత్మ కృష్ణపరమాత్మలో కలసిపోయింది. సజ్జనులంతా ఆనందించారు. అట్లా కంసుడు తన పూర్వజన్మయైన కాలనేమి వాసనను కూడా వదుల్చుకుని పరమాత్మలో లీనమైయ్యాడు.

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

గురువారం 17, జనవరి 2019

రెండో షెడ్యూల్‌లో.. ట్రిపుల్ ఆర్



ఎన్టీఆర్-రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రాజమౌళి దర్శకత్వంలో రాబోతున్న భారీ మల్టీస్టారర్ ఆర్‌ఆర్‌ఆర్ ఇప్పటికే మొదటి షెడ్యూల్‌ను పూర్తిచేసుకుంది. కాగా ఈ చిత్రం రెండవ షెడ్యూల్ ఈనెల 21న హైదరాబాద్‌లో స్టార్ట్‌కానుంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ రఫ్ లుక్‌లో కన్పిస్తాడట. బాహుబలి తరువాత రాజమౌళి చేస్తున్న సినిమా కావడం, ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండటంతో సినిమాపై ఆరంభం నుండే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డి.వి.వి.దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

ఏప్రిల్ 12న చి.త్ర.ల.హ.రి.



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా 'నేను శైలజ' ఫేమ్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్ నిర్మిస్తోన్న చిత్రం 'చిత్రలహరి.' సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. సాయిధరమ్‌తేజ్ సరసన కల్యాణి ప్రియదర్శన్, నివేదా పేతురాజ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి సినిమాలు ఏప్రిల్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. 'కిషోర్ తిరుమల సినిమా అంటే కూల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటూనే ఎమోషన్స్ క్యారీ అవుతుంటాయి. అలాంటి మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ సబ్జెక్ట్‌తో చిత్రలహరి తెరకెక్కుతోంది. షూటింగ్ అనుకున్న ప్లానింగ్ ప్రకారం జరుగుతోంది. రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఆయన సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. సాయిధరమ్ తేజ్‌ను సరికొత్త యాంగిల్‌లో కిషోర్ తిరుమలగారు ప్రెజెంట్ చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి సినిమాను ఏప్రిల్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలనుకుంటున్నాం' అన్నారు. దర్శకుడు కిషోర్ తిరుమల మాట్లాడుతూ.. 'మంచి ఎమోషనల్ ఫీల్ గుడ్' ఎంటర్‌టైనర్‌గా చిత్రలహరి తెరకెక్కుతోంది. టైటిల్‌లో ఐదు అక్షరాలు ఉన్నట్లు సినిమాలో ఐదు క్యారెక్టర్స్‌కు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటాయి. సినిమా ఈ పాత్రల చుట్టూ ఎక్కువగా తిరుగుతుంది. సాయిధరమ్ తేజ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీ అవుతుంది' అన్నారు.

వేసవికి.. ఏబీసీడీ



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ఏబీసీడీ. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే హిందీ శాటిలైట్ డిజిటల్ రైట్స్ ఫ్యాన్సీ రేట్‌కు అమ్ముడైన విషయం తెలిసిందే. సీనియర్ నిర్మాత డి.సురేష్ బాబు ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తుండడం విశేషం. ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. మెగా బ్రదర్ నాగబాబు ఇందులో అల్లు శిరీష్‌కు తండ్రి పాత్రలో నటించారు. బాల నటుడిగా మనకు సుపరిచితమైన భరత్ ఇందులో హీరో ఫ్రెండ్ పాత్రలో నటిస్తున్నాడు. రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్. సంజీవ్‌రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమౌతున్నారు. బిగ్‌బెన్ సినిమాస్ యశ్ రంగినేనితో కలిసి మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో మధుర శ్రీధర్ ఈ ఎంటర్‌టైనర్‌ని నిర్మిస్తున్నారు. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధాసాంధీ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఈ చిత్రాన్ని మార్చి 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ.. మలయాళంలో సూపర్ సక్సెస్ అందుకున్న ఏబీసీడీ చిత్రాన్ని తెలుగులో అల్లుశిరీష్‌తో నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. మలయాళంలో దుల్కర్ పోషించిన పాత్రను తెలుగులో శిరీష్ పోషిస్తున్నారు. సురేష్‌బాబుగారు ఈ సినిమాకు సమర్పకులుగా సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ ద్వారా మార్చి 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నాం. మెగాబ్రదర్ నాగబాబుగారు ఇందులో శిరీష్‌కు తండ్రి పాత్రలో నటించారు. మాస్టర్ భరత్ అల్లు శిరీష్ స్నేహితుడిగా నటిస్తున్నాడు. తెలుగు ప్రేక్షకులంతా హ్యాపీగా ఎంజాయ్ చేసే కథకావడంతో రీమేక్ చేస్తున్నాం. కృష్ణార్జునయుద్ధం ఫేం రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధాసాంధీ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండడం విశేషం. దర్శకుడు సంజీవ్‌రెడ్డి తెలుగు ప్రేక్షకులు మెచ్చే విధంగా కథను తీర్చిదిద్దారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేసే ఈ చిత్రాన్ని మార్చి 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం అని అన్నారు.

గజినికి సీక్వెల్?



సూర్య హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన 'గజిని' సినిమా భారీ వసూళ్లు సాధించిన విషయం తెలిసిందే. తెలుగులో డబ్ అయ్యి ఇక్కడ కూడా సూపర్‌హిట్ అయ్యింది. అల్లు అరవింద్ ఈ సినిమాను తెలుగులో డబ్ చేశాడు. టాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన గజినిని బాలీవుడ్‌లో అల్లు అరవింద్ అదే మురుగదాస్ దర్శకత్వంలో రీమేక్ చేసిన విషయం తెల్సిందే. బాలీవుడ్‌లో అమీర్‌ఖాన్ నటించిన గజిని అక్కడ సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. అప్పట్లో 100 కోట్లు రాబట్టింది. మురుగదాస్‌కు బాలీవుడ్‌లో స్టార్ డైరెక్టర్ హోదాను తెచ్చిపెట్టింది. అల్లు అరవింద్‌కు భారీగా లాభాలను తెచ్చిపెట్టిన గజిని సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లుగా తెలుస్తోంది. ఫిల్మ్ ఛాంబర్‌లో గజిని 2 అంటూ టైటిల్ రిజిస్టర్ అయ్యింది. అది మరెవ్వరో రిజిస్టర్ చేయిస్తే పెద్దగా పట్టించుకునే అవసరం లేదు. కానీ స్వయంగా అల్లు అరవింద్ ఆ టైటిల్‌ను రిజిస్టర్ తన గీత ఆర్ట్స్‌లో చేయించాడు. అందుకే త్వరలోనే గజిని 2 సినిమా ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే గజిని సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా ఉంటుందా లేదంటే కొత్త కథతో సినిమాను తీస్తారా అనేది చూడాలి. గజిని 2కు మురుగదాస్ దర్శకత్వం వహిస్తాడా లేదా అనే విషయం కూడా తెలియాలి.

సేనాపతి అలా...



అవినీతిపరుల గుండెల్లో గునపం దింపడమే లక్ష్యంగా సేనాపతి బరిలో దిగుతున్నాడు. అవినీతి కొమ్మపై నిర్మితమైన సంఘాన్ని కరెక్ట్ చేయడమే ధ్యేయంగా ఈసారి శంకర్ అస్త్రం సంధిస్తున్నాడు. అలక్ష్యం.. అభద్రత.. నిర్లక్ష్యం.. పేరు ఏదైనా సంఘంలో పేరుకుపోయిన తుప్పును వదిలించేందుకు కొత్త అస్త్రం సిద్ధం చేస్తున్నాడు. దీనికి పొలిటికల్ సబ్జెక్టును ఎంచుకుని థ్రిల్లర్ మోడ్‌లో రక్తి కట్టించేందుకు శంకర్ శంఖారావం పూరించాడు. జనవరి 18 నుంచి భారతీయుడు 2 సెట్స్‌పైకి వెళుతోంది. తమిళంలో ఇండియన్ 2, హిందీలో హిందూస్తాన్ 2 పేరుతో ఈ సినిమా రిలీజ్ కానుంది. 2.0 వరల్డ్ వైడ్ రిలీజ్ ఘనవిజయం నేపథ్యంలో భారతీయుడు 2 చిత్రాన్ని అత్యంత భారీతనంతో నిర్మించేందుకు లైకా సంస్థ సన్నాహాలు చేస్తోంది. దాదాపు 500 కోట్ల బడ్జెట్ వెచ్చించనున్నారని తెలుస్తోంది. తాజాగా శంకర్ టీమ్‌నుంచి సంక్రాంతి కానుక అందింది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేశారు. సేనాపతి లుక్‌ను తాజాగా రివీల్ చేశారు.

సైరా ఓబయ్యా ఇలా



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రం శరవేగంగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా సైరా బృందం సినిమాలో విజయ్ సేతుపతి లుక్‌ని రివీల్ చేస్తూ పోస్టర్‌ను అండ్ మోషన్ టీజర్‌ను విడుదల చేసింది. 2018లో అతడు అరడజను సినిమాల్లో నటించాడు. 2019లో మరో అరడజను సినిమాలు క్యూలో వున్నాయి. సైరాలో ఓబయ్య అనే విప్లవకారుడి పాత్రలో అతడు నటిస్తున్నాడు. తాజాగా అతడి పాత్ర లుక్‌ను సైరా టీమ్ విడుదల చేసింది. బాలీవుడ్ సంగీత దర్శకుడు అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో నయనతార, తమన్నా, సుధీప్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో హీరో రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



జార్జిరెడ్డి ఎవరు?

జార్జిరెడ్డి.. దశాబ్దాల క్రితం విద్యార్థి విప్లవోద్యమ నాయకుడుగా చరిత్రలో నిలిచిపోయిన పేరు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా సాగిన జార్జిరెడ్డి ప్రస్థానం నేటికీ ఎన్నో విద్యార్థి ఉద్యమాలకు ఆదర్శంగా నిలుస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో చదువుతూ విద్యార్థి ఉద్యమాల్లో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన జార్జిరెడ్డిని చాలా చిన్న వయసులోనే ప్రత్యర్థులు క్యాంపస్‌లోనే హత్య చేశారు. అలాంటి విద్యార్థి నేత జీవితం వెండితెరపై ఆవిష్కృతం కాబోతోంది. గతంలో 'దళం' సినిమాతో ఆకట్టుకున్న జీవన్‌రెడ్డి దర్శకుడు. లేటెస్టుగా చిత్ర ప్రీ లుక్ పోస్టర్ విడుదలైంది. అతి త్వరలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోపాటు నటీనటుల వివరాలు తెలియజేస్తామని దర్శక నిర్మాతలు అంటున్నారు. 'మీట్ ద ఫర్‌గాటెన్ లీడర్ సూన్' అనే టైటిల్‌తో పాటు ఏ మ్యాన్ ఆఫ్ యాక్షన్ అనే క్యాప్షన్ కూడా ఉంది. 1970 దశకం బ్యాక్‌డ్రాప్‌లో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైక్ మూవీ అధినేత అప్పిరెడ్డి త్రీలైన్స్ సినిమా బ్యానర్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సైరత్ సినిమాకు సినిమాటోగ్రఫి అందించి.. ఇటీవల నాన్ అనే సినిమాతో దర్శకుడిగా మారిన సుధాకర్‌రెడ్డి యెక్కంటి ఈచిత్రానికి కెమెరామెన్ కావడం విశేషం. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న చిత్రం సమ్మర్‌లో విడుదలకానుంది.

అక్కడొకడుంటాడు..



శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రూపొందిన చిత్రం అక్కడొకడుంటాడు. హీరో హీరోయిన్లుగా రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించారు. లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకర్‌రావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో నాగశౌర్య ఆవిష్కరించగా.. చిత్రంలోని ఆడి పాడి గడిపేద్దాం అంటూ సాగే పాటను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో నాగశౌర్య మాట్లాడుతూ- సస్పెన్స్, థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్‌తోపాటు పోస్టర్స్ చాలా ఆకట్టుకున్నాయని అన్నారు. చిత్రం ప్రేక్షకుల ఆదరణ చూరగొనాలని చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందజేశారు నిర్మాత కె.ఎస్.రామారావు. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్‌వల్ల కలిగే అనర్థాలను ఈ చిత్రంలో చూపిస్తున్నామని అన్నారు. నిర్మాత రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే అన్ని పాటలున్న ఆడియోను విడుదల చేసి, ఇదే నెలలో సినిమాను ప్రేక్షకులముందుకు తీసుకువస్తామని చెప్పారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ- అనుకోని ఆపదలో చిక్కుకున్న ప్రేమజంటకు స్నేహితుల సహాయం అందే సమయంలో మరో ప్రమాదం ఎదురవుతుంది. దాని నుంచి ఆ ప్రేమజంట ఎలా బయటపడిందన్నదే చిత్ర ప్రధానాంశం అన్నారు.

'అక్షర'మే ఆయుధంగా..



నందితాశ్వేత ప్రధాన పాత్రలో రూపొందుతున్న అక్షర మూవీ మోషన్ పోస్టర్ భోగి సందర్భంగా విడుదల చేసింది చిత్ర యూనిట్. ప్రస్తుతం సమాజంలో విద్యకు మించిన వ్యాపారం లేదనే మాట ఎక్కువగా వినపడుతుంది. కానీ సమాజాన్ని మార్చే ఆయుధం విద్యే అనే అందరూ ఒప్పుకుంటారు. అక్షర ప్రయాణం ఎలా ఉండబోతుంది అనే ఆలోచనలకు ఈ మోషన్ అద్దంపడుతుంది. బలమైన కంటెంట్‌ని ఎఫెక్టివ్‌గా ప్రజెంట్ చేయడంలో చిత్ర యూనిట్ సక్సెస్ అయ్యింది. మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ.. 'విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం. కానీ విద్యావ్యవస్థ ఫక్తు వ్యాపారంలా మారిపోయింది. అలాంటి వ్యవస్థపై అక్షర చేసే పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందిత శ్వేత అక్షర పాత్రకు ప్రాణంపోస్తుంది. ఆమె కెరియర్‌లో బెస్ట్‌గా ఈ పాత్ర నిలుస్తుంది. సురేష్ బొబ్బిలి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలెట్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ చేస్తున్నాం' అన్నారు. నిర్మాత అహితేజ బెల్లంకొండ మాట్లాడుతూ... సినిమా కాన్సెప్ట్‌ని టీజర్‌గా రిలీజ్ చేసాం. దానికి మంచి స్పందన వచ్చింది. మోషన్ పోస్టర్‌ని కూడా కాన్సెప్ట్‌ని ఎలివేట్ చేసే విధంగా ప్లాన్ చేసాం. ఎడ్యుకేషన్ వ్యవస్థలోని లోపాలను బోల్డ్‌గా తెరమీదకు తీసుకురాబోతున్నాం. భోగి సందర్భంగా విడుదల చేసిన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన లభించింది' అన్నారు. మరో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ.. మోషన్ పోస్టర్‌కి వస్తున్న స్పందన చాలా ఆనందంగా కలిగించింది. ప్రేక్షకుల ఆలోచనలలో మార్పు తెచ్చే విధంగా అక్షర రూపుదిద్దుకుంటుంది. విద్యకి వ్యాపారం పర్యాయ పదం అయ్యింది. అలాంటి ఆలోచనలు మార్చేందుకు అక్షర చేసే ప్రయత్నం ఆకట్టు

పెళ్లికి రెడీ



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో లీడర్ సినిమాలో రానా సరసన హీరోయిన్‌గా నటించిన రిచా గంగోపాధ్యాయ.. ఆ తరువాత మిరపకాయ్, మిర్చి సినిమాలతో మంచి గుర్తింపే తెచ్చుకుంది. కానీ కెరీర్ పీక్‌లో ఉండగానే సినిమాలకు గుడ్‌బై చెప్పి పైచదువుల కోసం విదేశాలకు వెళ్లిపోయింది. తాజాగా తనకు బిజినెస్ స్కూల్లో పరిచయం అయిన జోయ్ అనే అతనితో తనకు నిశ్చితార్థం జరిగినట్టుగా రిచా గంగోపాధ్యా ట్విట్టర్ ద్వారా తెలిపింది. అయితే ఇంకా తమ పెళ్లికి ముహూర్తం ఖరారు కాలేదని, లైఫ్‌లో కొత్త మార్పుకోసం సంతోషంగా ఎదురుచూస్తున్నానని రిచా గంగోపాధ్యాయ చెప్పుకొచ్చింది.